

www.andhrajyothy.com
విజయవాడ సిటీ**

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI
వెల (Price) : Rs. 6.50

శుక్రవారం | 13-9-2024 | పేజీలు: 12 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 149

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, బాద్రపదమాసం, శుక్లపక్షం; తిథి: దశమి రా. 10.30 తదుపరి ఏకాదశి; నక్షత్రం: పూర్వాషాఢ రా. 9.35 తదుపరి ఉత్తరాషాఢ; వర్జ్యం: ఉ. 7.21-8.56, తె. 5.14 మొదలు; దుర్ముహూర్తం: ఉ. 8.32-9.20, మ. 12.35-1.23; అమృతఘడియలు: సా. 4.50-6.25; రాహుకాలం: ఉ. 10.30-12.00; సూర్యోదయం: 6.06; సూర్యాస్తమయం: 6.15

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ప్రధాని, సీజేఐ భేటీపై అనుమానాలున్నాయ్

మా కేసు సీజేఐ విచారిస్తున్నారు..

- న్యాయం జరుగుతుందా.. అన్న అనుమానం ఉంది
- శివసేన నేత సంజయ్ రౌత్ విమర్శలు
- సీజేఐ స్వతంత్రతపై నమ్మకం పోయింది
- సుప్రీం బార్ అసోసియేషన్ ఖండించాలి: ఇందిరా
- సీజేఐ ఇంట్లో ప్రధాని పూజపై ప్రతిపక్షాల విమర్శలు
- సీజేఐ ఇంటికి ప్రధాని వెళ్లడం తప్పా?
- గతంలో మన్మోహన్ ఇఫ్తార్ విందుకు సీజేఐ వెళ్లలేదా?.. బీజేపీ ధ్వజం


చీఫ్ జస్టిస్ చంద్రచూడ్ ఇంట్లో గణపతి పూజలో పాల్గొన్న ప్రధాని మోదీ (ఫైల్)

న్యూఢిల్లీ, సెప్టెంబరు 12: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ ఇంట్లో జరిగిన గణపతి పూజకు ప్రధానమంత్రి మోదీ హాజరవడంపై ప్రతిపక్షాలు విమర్శలు గుప్పించాయి. బుధవారం ప్రధాని మోదీ సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ ఇంటికి వెళ్లి గణపతి పూజలో పాల్గొనడంతో పాటు హారతి కూడా ఇచ్చారు. మోదీకి సీజేఐ

మిగతా 2వ పేజీలో...

రాలిపోయిన అరుణతార

12-08-1952 / 12-09-2024



సీపీఎం అగ్రనేత ఏచూరి కన్నుమూత

- న్యుమోనియాతో ఢిల్లీ ఎయిమ్స్ ఆస్పత్రిలో మృతి
- చిన్ననాటి నుంచే వామపక్ష భావజాలం
- విద్యార్థి నాయకుడిగా ఎస్ఎఫ్ఐపై ముద్ర
- ఎమర్జెన్సీ కాలంలో పీహెచ్‌డీని పక్కనపెట్టి.. పోరుబాట
- రాష్ట్రపతి, ప్రధాని, రాహుల్, చంద్రబాబు, పవన్ నివాళులు

పాలస్తీనాపై దాడికి వ్యతిరేకంగా..

నిరంతరం ఉద్యమాల్లో పాల్గొంటూ, తన ఉపన్యాసాలతో మంత్రముగ్ధుల్ని చేసే ఏచూరి.. చివరిసారి జూన్‌లో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఒక నిరసన ప్రదర్శనలో పాల్గొన్నారు. పాలస్తీనాపై ఇజ్రాయెల్ దాడికి నిరసనగా ఏర్పాటు చేసిన ప్రదర్శన అది. ఆ విషయంలో భారత తన ధోరణిని వెల్లడించాలని డిమాండ్ చేస్తూ.. అమెరికాపై మండిపడ్డారు.

న్యూఢిల్లీ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఒక అరుణతార రాలిపోయింది. అరుణారుణ పోరుబాటపై అజరామర ముద్ర వేసిన కామ్రేడ్ ఇక లేరు. పీడిత, తాడిత, అణగారిన వర్గాలవైపు నిలబడి.. వారి గొంతుకై ఎలుగెత్తిన వామపక్ష యోధుడు.. సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి గురువారం ఢిల్లీలోని ఎయిమ్స్ ఆస్పత్రిలో తుది శ్వాస విడిచారు. ఆయన వయసు 72 సంవత్సరాలు. గత నెల 19న ఆయన న్యుమోనియాతో బాధపడుతూ.. ఎయిమ్స్‌లో చేరారు. ఛాతీభాగంలో తీవ్రమైన ఇన్‌ఫెక్షన్ ఉండడంతో వైద్యులు ఆయన్ను ఐసీయూలో ఉంచి చికిత్స చేశారు. వైద్యులు ఎంతగా ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. గురువారం మధ్యాహ్నం 3.05 గంటలకు ఆయన కన్నుమూశారు. ఎయిమ్స్ ఈ విషయాన్ని ఒక హెల్త్ బులెటిన్ ద్వారా వెల్లడించింది. సీపీఎం మీడియా విభాగం కూడా ఈ విషయాన్ని ఎక్స్‌లో పోస్ట్ చేసింది. ఏచూరి భార్య సీమా చిస్తీ ప్రస్తుతం న్యూస్ పోర్టల్ 'ద వైర్'కు ఎడిటర్‌గా సేవలందిస్తున్నారు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉండగా.. ఒక కుమారుడు ఆశిష్ 2021లో కొవిడ్‌తో చనిపోయారు. కుమార్తె అఖిల.. ప్రస్తుతం ఎడింబరో విశ్వవిద్యాలయం, సెయింట్ ఆండ్రూస్ వర్సిటీల్లో ప్రొఫెసర్‌గా సేవలందిస్తున్నారు. వామపక్షవాదులు, కార్యకర్తలకు ప్రేరణగా నిలిచిన సీతారాం ఏచూరి.. భారత రాజకీయాల్లో విలక్షణ నేతగా గుర్తింపు పొందారు. విద్యార్థి దశ నుంచి.. తన జీవిత చరమాంకం వరకూ.. సామాజిక న్యాయం, ప్రజా సమస్యల పరిష్కారానికి

మిగతా 2వ పేజీలో...





గనుల వెంకటరెడ్డిపై ఏసీబీ కేసు

ఇసుక అక్రమాలు రూ.2500 కోట్లపైనే
కుట్రదారు, సూత్రధారి ఆయనే
కుట్ర, అవినీతి, దోపిడీలో ఏ1గా నమోదు.. త్వరలో అరెస్టు!
మరో ముగ్గురిపైనా కేసు..

12



12

స్టేట్ బోర్డులోనే పరీక్షలు

వెయ్యి సీబీఎస్ఈ పాఠశాలలపై ప్రభుత్వ నిర్ణయం
78 వేల మంది విద్యార్థులకు ఉపశమనం
పరీక్షల విధానం ప్రకారం
వచ్చే ఏడాది నుంచి దశల వారీగా మార్పులు

జిల్లా అధ్యక్ష పదవి నాకొద్దు

పార్టీకి పనిచేయలేను
జగన్‌కు తేల్చిచెప్పిన బాలినేని!
జనసేన వైపు చూపు?

3

ఇది పెను విపత్తు

సాధారణ విపత్తులా దీనిని చూడొద్దు.. గతంలో వచ్చిన వరదల్లాంటిది కాదిది

- ఊహించని దెబ్బతో భారీగా నష్టపోయాం
- కేంద్రం ఉదారంగా వ్యవహరించాలి
- బాధితులను తిరిగి నిలబెట్టేలా సాయం
- రాష్ట్రంలో అపారంగా పంట, ఆస్తి నష్టం
- రెండు రోజుల్లో 50 సెం.మీ. వర్షపాతం
- బ్యారేజీకి 11.43 లక్షల క్యూసెక్కుల వరద
- 14 లక్షల క్యూసెక్కులు వస్తే పరిస్థితి ఏంటి?
- వరదల నుంచి రాష్ట్రానికి శాశ్వత విముక్తి
- కేంద్ర బృందానికి సీఎం చంద్రబాబు వినతి
- ఇంత కష్టంలోనూ బాధితుల్లో మీపై నమ్మకం
- సాయం, న్యాయం దక్కుతాయనే ధీమా వారిలో చూశాం.. సీఎంకు బృందం ప్రశంస


బెజవాడలో వరద పరిస్థితిపై ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న కేంద్ర బృందం

అమరావతి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని ముంచెత్తిన భారీ వర్షాలు, ఆకస్మిక వరదలను సాధారణ విపత్తుగా పరిగణించరాదని కేంద్రానికి ముఖ్యమంత్రి చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. గతంలో వచ్చిన సాధారణ వరదల్లా వీటిని చూడొద్దని కోరారు. వరదల నుంచి రాష్ట్రానికి శాశ్వత విముక్తి లభించేలా కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టాలని విన్నవించారు. రాష్ట్రంలోని వరద ప్రాంతాల్లో రెండు రోజులుగా పర్యటిస్తున్న కేంద్ర బృందం గురువారం తనను కలిసినప్పుడు ఆయన ఇలా స్పందించారు. వరదలు, భారీ వర్షాలు పంట నష్టంతోపాటు ఆస్తి నష్టాన్ని వి ఎగిల్చాయని ఆయన కేంద్ర బృందం దృష్టికి తెచ్చారు. ఊహించని విపత్తుతో ప్రజలు భారీగా నష్టపోయారని, బాధిత ప్రజలను తిరిగి నిలబెట్టేలా కేంద్ర సాయం ఉండేలా చూడాలన్నారు. అమరావతి

మిగతా 11వ పేజీలో...

తొలగని ఏలేరు ముంపు

- ప్రాజెక్టులో తగ్గినట్టే తగ్గి పెరుగుతున్న ప్రవాహం
- 8 మండలాల్లో 64 గ్రామాలు అతలాకుతలం
- నీటిలోనే నానుతున్న ఊళ్లు, పొలాలు
- కోళ్ల ఫారాల్లో వేలాది కోళ్ల మృత్యువాత
- 206 గ్రామాల్లోని 75 వేల ఎకరాల్లో పంటలు మునక
- పంట నష్టం రూ.180 కోట్లుగా అంచనా

11

పారిశ్రామిక పార్కుల్లో రైతులకు భాగస్వామ్యం

- ఎంఎస్ఎంఈలకు రూ.100 కోట్లతో క్రెడిట్ గ్యారంటీ
- యూనిట్ల స్థాపనకు డ్వాక్రా మహిళలకు ప్రోత్సాహం
- ఉద్యాన, ఆక్వా రైతుల లబ్ధికి సర్కారు కసరత్తు
- ఎంఎస్ఎంఈ, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖలపై సీఎం సమీక్ష
- సరికొత్త పారిశ్రామిక పాలసీ రూపొందించాలి: చంద్రబాబు
- గత ప్రభుత్వం పరిశ్రమలకు పెండింగ్ పెట్టిన ఇన్సెంటివ్ బకాయిలు చెల్లించేందుకు కసరత్తు చేయాలని ఆదేశం
- అమరావతిలో రూ.150 కోట్లతో టెక్నాలజీ సెంటర్
- యువతకు పారిశ్రామిక వృత్తి నైపుణ్య శిక్షణ: మంత్రి కొండపల్లి

3



కష్టంగా అండర్ వాటర్ ఆపరేషన్

- బోట్ల తయారీలో మందపాటి రేకు వాడకం
- గురువారం పై భాగం మాత్రమే కట్ చేసిన సిబ్బంది
- నీళ్లలో బోటు కటింగ్‌కు ఎక్కువ సమయం
- బోటును రెండు ముక్కలు చేసి, రోప్‌లతో కట్టి వేరు చేయాలనే యోచన
- కాకినాడ నుంచి మరో బృందం రాక

11

నేడు ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం

వాయుగుండంగా మారే అవకాశం

3





స్నేహితులందరికీ 'సీత'!

దేశం మొత్తానికీ సీతారాం ఏచూరి అంటే వామపక్ష దిగ్గజం! కానీ.. స్నేహితులంతా ఆయన్ను ఆప్యాయంగా 'సీతా' అని పిలుచుకునేవారని ప్రముఖ ఆర్థికవేత్త, జేఎన్‌యూ ప్రొఫెసర్.. సీపీ చంద్రశేఖర్ తెలిపారు. సీతారాం ఏచూరి గురించి ఆయన పలు ఆసక్తికర విషయాలను వెల్లడించారు. పార్టీకి విధేయుడిగా ఉంటూనే.. భారతదేశ రాజకీయ యవనికపై ప్రజాస్వామిక శక్తులతో వ్యవహరించే క్రమంలో కొంత పట్టువిడుపుల ధోరణితో వ్యవహరించాలని ఏచూరి భావించేవారని తెలిపారు. గడిచిన దశాబ్దకాలంలో భారత రాజకీయాలు నియంతృత్వం దిశగా మలుపు తీసుకున్న నేపథ్యంలో ఏచూరిలో ఆ దృక్పథం మరింత బలపడిందని వెల్లడించారు.

ఎమర్జెన్సీలో నా దగ్గరే: మోహన్ కందా

సీతారాం ఏచూరి.. ఎమర్జెన్సీ సమయంలో కర్నూలులో తన దగ్గరే తలదాచుకున్నారని ఆయన మేనమామ మోహన్ కందా తెలిపారు! మేనల్లుడికి, తనకు మధ్య వయసులో తేడా ఏడేళ్లేనని.. వరుసకు మేనమామ, మేనల్లుళ్లయినా అన్నదమ్ములా మసలేవాళ్లమని వివరించారు. 1952 ఆగస్టు 12.. చెన్నైలో సీతారాం ఏచూరి పుట్టినప్పుడు ఆ నర్సింగ్‌హోం బయట తాను ఒక కారులో వేచి చూస్తున్నానని, అప్పటికి తన వయసు ఏడేళ్లని వెల్లడించారు. మేనల్లుడు పుట్టాడని ఆనందిస్తుండగా.. ఆ రోజు రోహిణీ నక్షత్రం, కృష్ణాష్టమి అని తెలిసిందని.. దీంతో తనను చూడనివ్వలేదని చెప్పారు. సంప్రదాయం ప్రకారం.. తర్వాత కొన్నిరోజులకు నూనెలో తన మేనల్లుడి ముఖం చూశానని, కుటుంబసభ్యులు, బంధువులు అతణ్ని 'బాబు' అనే పిలిచేవారని తెలిపారు. "సీతారాం మా అమ్మని 'అమ్మమ్మ' అనడానికి బదులుగా 'అమ్మా' అనే పిలిచేవాడు. తనని మా అమ్మానాన్నలు అల్లారుముద్దుగా చూసేవారు. దీంతో నాకు అప్పుడప్పుడూ ఈర్ష్య కూడా కలిగేది" అని మోహన్ కందా వెల్లడించారు. "జేఎన్‌యూలో చేరడమే రాజకీయాల్లో సీతారాం ప్రస్థానానికి నాంది అయింది. 1975లో ఎమర్జెన్సీ విధించినప్పుడు అతడు అండర్ గ్రౌండ్‌లో ఉండాల్సి వచ్చింది. దీంతో మా అమ్మానాన్నలు.. సీతారాంని నాతోపాటు కర్నూలులో ఉంచాలని నిర్ణయించారు. అప్పట్లో నేను తనకు నచ్చజెప్పి రాజకీయాల నుంచి విరమించేలా చేద్దామని ప్రయత్నించాను. ఆ ప్రయత్నంలో విఫలమవడమే కాక.. నేనే తన బాటలోకి వెళ్లి, కమ్యూనిస్టులా మారిపోవడాన్ని త్రుటిలో తప్పించుకున్నాను" అని మోహన్ కందా తెలిపారు.

రాజ్యసభలో కీలక ప్రసంగాలు

రాజ్యసభ సభ్యుడిగా ఏచూరి ప్రజల గళాన్ని పార్లమెంట్‌లో వినిపించారు. 12 సంవత్సరాలు ఎంపీగా ఉన్న ఆయన.. 244 సార్లు కీలక ప్రసంగాలు చేశారు. క్విట్ ఇండియా ఉద్యమం జరిగి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా 2017 ఆగస్టు 9న మాట్లాడుతూ.. భారత స్వాతంత్ర్యోద్యమంలో కమ్యూనిస్టుల పాత్రను వివరించారు. విదేశాంగ విధానాలు, దళితుల ఊచకోత, ధరల పెరుగుదల, రైతుల ఉద్యమాలు, ఎన్నికల సంస్కరణలు మొదలైన అనేక కీలక అంశాలపై ఆయన ప్రసంగించేప్పుడు సభలో నిశ్శబ్దం నెలకొనేదంటే.. ఆయన ఉపన్యాసాలు సభ్యులను ఎంతలా మంత్రముగ్ధుల్ని చేసేవో అర్థం చేసుకోవచ్చు. 2015 మార్చి 3న బడ్జెట్ సమావేశాల సందర్భంగా.. అప్పటి రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ చేసిన ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానానికి.. ఏచూరి సవరణలను ప్రతిపాదించారు. దానిపై ఓటింగ్ జరగ్గా.. ఆయన సవరణల ప్రతిపాదన నెగ్గింది. రాజ్యసభ చరిత్రలోనే ఇలా జరగడం నాలుగోసారి కాగా.. 2015లో మోదీ సర్కారును ఇబ్బందికి గురిచేసిన అంశమిది. మూడోసారి ఆయనను రాజ్యసభకు పంపాలని పశ్చిమబెంగాల్‌లోని సీపీఎం నిర్ణయించినా.. పొలిట్‌బ్యూరో అంగీకరించలేదనే కారణంతో ఆయన తప్పుకోవడం గమనార్హం..!

ఒబామా రాకకు వ్యతిరేకంగా..

అమెరికా విదేశాంగ విధానాన్ని ఏచూరి తీవ్రంగా వ్యతిరేకించేవారు. 2015లో భారత గణతంత్ర వేడుకలకు అప్పటి అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన రాకను ఏచూరి తీవ్రంగా వ్యతిరేకించారు. దేశవ్యాప్తంగా వామపక్షవాదులను ఏకం చేసి.. ఒబామా రాకకు నిరసనగా ఎక్కడికక్కడ ప్రదర్శనలను నిర్వహించారు. ఇస్లాం మతంలో ఛాందసవాదం పెరగడానికి అమెరికానే కారణమని ఏచూరి నిందించేవారు. పశ్చిమాసియాలో అమెరికా జోక్యంతోనే అశాంతి నెలకొంటోందని, ఇస్లామిక్ స్టేట్ (ఐఎస్) మారణహోమానికి కూడా అమెరికా తీరే కారణమని విమర్శించేవారు. ప్రపంచంపై అమెరికా పెత్తనాన్ని నిలదీసేవారు. ప్రపంచంలోని వనరులు.. ముఖ్యంగా ఇంధన వనరులను దోచుకోవడానికి.. పెత్తనం చెలాయించడానికి అమెరికా అస్త్రాలు చాస్తోందని మండిపడేవారు.

అర్ధరాత్రి ఫిడెల్ క్యాస్ట్రో పిలుపు

సీతారాం ఏచూరి ఓ సందర్భంలో ఊహించని విధంగా క్యూబా నేత ఫిడెల్ క్యాస్ట్రో నుంచి పిలుపునందుకున్నారు. 1994లో జ్యోతిబసు తదితరులతో ఏచూరి కూడా క్యూబా వెళ్లారు. రాత్రి సమయంలో ఉన్నపళంగా మాట్లాడడానికి క్యాస్ట్రో తమను పిలిపించారని ఏచూరి ఓ సందర్భంలో చెప్పారు. ఆ సమయంలో.. "భారతదేశంలో ఉక్కు ఉత్పత్తి ఏ స్థాయిలో ఉంది" అని అడిగారని.. అప్పటి నుంచి తాను ఎప్పుడు క్యూబా వెళ్లినా.. వెంట ఓ చిన్న గణాంకాల పుస్తకాన్ని తీసుకెళ్లేవాడనని ఏచూరి పేర్కొన్నారు. అపరాత్రి వేళ పిలవడంతో జ్యోతిబసు కొంత ఇబ్బందికి గురైన విషయాన్ని ప్రస్తావిస్తూ.. ఉక్కు ఉత్పత్తిపై అడిగిన ప్రశ్నకు ఆయన వద్ద కూడా సమాధానం లేదని చెప్పారు. ఆరోజు తెల్లవారుజామున 2 గంటల వరకు తమ సమావేశం కొనసాగిందని వివరించారు.

సైన్స్ కోసం శరీరాల దానాలు

మరణానంతరం మత ఆచారాల ప్రకారం శరీరాన్ని ఖననం చేయడమో.. దహనం చేయడమో తెలిసిందే..! అయితే.. సీతారాం ఏచూరి మాదిరిగా శరీరాలను వైద్య విద్యార్థుల కోసం దానం చేసిన వారు చాలా అరుదుగా ఉంటారు. అలాంటి వారిలో వామపక్ష ఉద్ధండులే ముందు వరుసలో ఉండడం గమనార్హం..!

- 80 ఏళ్ల వయసులో మరణించిన పశ్చిమబెంగాల్ మాజీ సీఎం బుద్ధదేవ్ భట్టాచార్య కోరిక ప్రకారం ఆయన పార్థివ దేహాన్ని కోల్‌కతాలోని నీల్ రతన్ సిర్కార్(ఎన్ఆర్ఎస్) వైద్య కళాశాలకు అందజేశారు. బుద్ధదేవ్ భట్టాచార్య 2006లోనే గణదర్పన్ అనే ఎన్జీవోకు ఈ మేరకు హామీ ఇచ్చారు.
- 34 ఏళ్లపాటు బెంగాల్‌కు సీఎంగా సేవలందించిన జ్యోతి బసు 2003లోనే మరణానంతరం తన శరీరాన్ని వైద్య కళాశాలకు అందజేస్తానని ప్రకటించారు. 2010లో ఆయన మరణం తర్వాత కుటుంబ సభ్యులు పార్థివదేహాన్ని కోల్‌కతాలోని ఎస్ఎస్‌కేఎం ఆస్పత్రికి అందజేశారు.
- లోక్‌సభ మాజీ స్పీకర్ సోమ్‌నాథ్ ఛటర్జీ 2000 సంవత్సరంలోనే తన మరణానంతరం శరీరాన్ని వైద్య విద్యకు అప్పగిస్తానని పేర్కొన్నారు. 2018లో ఆయన మృతి తర్వాత.. కుటుంబ సభ్యులు ఆయన ఆశయాన్ని నెరవేర్చారు.
- సీపీఎం మాజీ కార్యదర్శి అనిల్ బిశ్వాస్, మరో నేత బెనోయ్ చౌదరి కుటుంబ సభ్యులు కూడా.. మరణానంతరం వైద్య కళాశాలలకు వారి శరీరాలను అప్పగించారు.




ప్రభావవంతమైన స్వరం మూగవోయింది



ఏచూరి మరణవార్త విని చాలా బాధపడ్డాను. ఆయన విద్యార్థి నేతగా, పార్లమెంటేరియన్‌గా జాతీయ రాజకీయాల్లో ప్రభావవంతమైన స్వరం వినిపించారు. నిబద్ధత కలిగిన సిద్ధాంతాలతో పనిచేశారు. ఏచూరి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను.

\- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము



సమర్థ పార్లమెంటేరియన్



ఏచూరి మరణానికి విచారిస్తున్నాను. ఆయన వామపక్షవాది అయినా.. రాజకీయ ప్రపంచంతో మంచి అనుబంధాన్ని పెంచుకున్నారు. ఆయన సమర్థమైన పార్లమెంటేరియన్‌గా తనదైన ముద్ర వేసుకున్నారు. ఆయన కుటుంబ సభ్యులకు, అభిమానులకు నా ప్రగాఢ సానుభూతి. ఓం శాంతి.

\- ప్రధాని నరేంద్ర మోదీ

రాలిపోయిన అరుణతార

(మొదటి పేజీ తరువాయి)

ఎన్నెన్నో ఉద్యమాలు నడిపారు. మరణం తర్వాత కూడా ఆయన తన పార్థివ దేహాన్ని ఎయిమ్స్‌కు అందజేయాలని కోరేవారు. భవిష్యత్ తరాల వైద్యుల బోధనకు, వారి పరిశోధనలకు తన శరీరాన్ని ఉపయోగించుకోవాలనేది ఆయన ఆకాంక్ష. కుటుంబ సభ్యులు ఆ ఆకాంక్షను నెరవేరుస్తూ.. ఎయిమ్స్‌కు ఆయన దేహాన్ని అప్పగించనున్నట్లు ప్రకటించారు. ప్రజలు, కార్యకర్తలు, అభిమానులు, పార్టీవర్గాల దర్శనార్థం ఆయన పార్థివ దేహాన్ని శనివారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఢిల్లీలోని ఏకే గోపాలన్ భవన్‌లో ఉంచుతామని సీపీఎం వర్గాలు ప్రకటించాయి. ఏచూరి మృతి పట్ల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ, లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్, సీపీఐ నేత డి.రాజా తదితరులు సంతాపం తెలియజేశారు.

చదువుల్లో మేటి..

సీతారాం ఏచూరి పూర్వీకుల స్వస్థలం ఆంధ్రప్రదేశ్. ఆయన 1952 ఆగస్టు 12న చెన్నైలో జన్మించారు. ఆయన తండ్రి సర్వేశ్వర సోమయాజుల ఏపీఎస్ఆర్టీసీలో ఇంజనీరుగా.. తల్లి కల్పకం ప్రభుత్వోద్యోగిగా పనిచేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా సేవలందించిన మోహన్ కందా.. సీతారాం ఏచూరికి స్వయానా మేనమామ. హైదరాబాద్‌లో పెరిగిన ఏచూరి చదువుల్లో మేటి. పదో తరగతివరకూ హైదరాబాద్‌లోని ఆల్ సెయింట్స్ హైస్కూల్‌లో చదువుకున్నారు. 1969లో తొలిదశ తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిపడుతున్న కాలంలో.. ఉన్నత విద్య కోసం ఢిల్లీ వెళ్లారు. ఢిల్లీలోని ప్రెసిడెంట్స్ ఎస్టేట్ స్కూల్‌లో (సీబీఎస్ఈ) 12వ తరగతి వరకూ చదివి.. ఆలిండియా టాపర్‌గా నిలిచారు. అనంతరం సెయింట్ స్టీఫెన్స్ కళాశాలలో అర్థశాస్త్రంలో డిగ్రీ (బీఏ ఆనర్స్) చదివి ఫస్ట్ ర్యాంక్ సాధించారు. జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం(జేఎన్‌యూ)లో ఎంఏ (అర్థశాస్త్రం)లో పట్టా పుచ్చుకున్నారు. తర్వాత పీహెచ్‌డీ ప్రారంభించారు గానీ.. ఎమర్జెన్సీ నేపథ్యంలో ఆయన చదువుకు ఫుల్‌స్టాప్ పడింది.

విద్యార్థి నేతగా..

జేఎన్‌యూలో చదువుతున్నప్పుడే.. సీతారాం ఏచూరి సీపీఎం స్టూడెంట్స్ వింగ్ భారత విద్యార్థి సమాఖ్య(ఎస్ఎఫ్ఐ)లో పనిచేశారు. మూడు సార్లు జేఎన్‌యూ విద్యార్థి సంఘం నేతగా ఎన్నికయ్యారు. మరో వామపక్ష నేత ప్రకాశ్ కరాట్‌తో కలిసి జేఎన్‌యూను వామపక్షాలకు కంచుకోటగా మార్చారు. ఆ తర్వాత ఎస్ఎఫ్ఐకి జాతీయ ప్రధాన కార్యదర్శిగా, అధ్యక్షుడిగా సేవలందించారు. ఎమర్జెన్సీ రావడంతో పూర్తిస్థాయిలో ఉద్యమాల వైపు మళ్లారు. అరెస్టయ్యారు. కొన్నాళ్లు అజ్ఞాత జీవితాన్ని గడిపారు. తెలుగుతోపాటు.. తమిళం, బెంగాలీ, హిందీ, ఆంగ్లం, తదితర భాషల్లో అనర్గళంగా మాట్లాడే సీతారాం ఏచూరి సీపీఎంలో అంచెలంచెలుగా అనేక పదవులను చేపట్టి.. ప్రధాన కార్యదర్శి స్థాయికి ఎదిగారు. విద్యార్థి నేతగా ఉన్న ఏచూరి ప్రతిభాపాటవాలను గుర్తించిన సీపీఎం అధిష్ఠానం.. 1984లో ఆయనను కేంద్ర కమిటీ సభ్యుడిగా నియమించింది. 1995లో పొలిట్‌బ్యూరో సభ్యుడిగా పనిచేశారు. 2005 నుంచి 2017 వరకు రాజ్యసభ సభ్యుడిగా ఉన్నారు. 2015లో విశాఖపట్టణంలో జరిగిన సీపీఎం 21వ మహాసభలో ఆయన పార్టీ కార్యదర్శిగా ఎంపికయ్యారు. ఎలాంటి గ్రామీణ నేపథ్యం లేకుండా.. హైదరాబాద్, ఢిల్లీ వంటి పట్టణ ప్రాంతాల్లో పెరిగిన సీతారాం ఏచూరి పార్టీ జనరల్ సెక్రటరీ స్థాయికి ఎదగడం విశేషం.

రాజకీయాలపై చెరగని ముద్ర

సీతారాం ఏచూరి అంటేనే ప్రత్యామ్నాయ రాజకీయాలు గుర్తుకు వచ్చేంతగా ఆయన తనదైన ముద్ర వేశారు. 'తాపట్టిన కుందేలుకు మూడేకాళ్లు' అన్న చందంగా మొండిగా కాకుండా.. సమయాన్ని, సందర్భాన్ని బట్టి వ్యవహరించడం, అందరినీ కలుపుకొని పోవడానికి ప్రయత్నించడం ఆయన పంథా. అందుకే పలుమార్లు ఆయన దేశ రాజకీయాల్లో కీలకపాత్ర పోషించగలిగారు. యునైటెడ్ ఫ్రంట్ నిర్మాణంలో.. దేవెగౌడ, ఐకే గుజ్రాల్ ప్రభుత్వాల హయాంలో కీలకంగా వ్యవహరించారు. యునైటెడ్ ఫ్రంట్ కనీస ఉమ్మడి కార్యక్రమ రచనలో ఆయన పాలుపంచుకున్నారు. 2004లో యూపీఏ ప్రభుత్వ ఏర్పాటులోనూ ఏచూరి పాత్ర ఉంది. అయితే.. అణు ఒప్పందం విషయంలో కాంగ్రెస్‌తో విభేదాలు రావడంతో సీపీఎం ఆ కూటమి నుంచి వైదొలగింది. 2014లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రభుత్వం ఏర్పాటయ్యాక.. ఏచూరి బీజేపీయేతర పక్షాలను ఏకం చేయడానికి కృషి చేశారు. గత ఏడాది ఏర్పడ్డ 'ఇండియా' కూటమి ఏర్పాటులోనూ తనదైన పాత్రను పోషించారు.

చివరి వీడియో అదే..

కిందటి నెల 22న ఏచూరి ఆస్పత్రి నుంచి ఓ వీడియోను విడుదల చేశారు. పశ్చిమ బెంగాల్‌లో వామపక్ష దిగ్గజం, మాజీ సీఎం బుద్ధదేవ్ భట్టాచార్యకు ఆ వీడియోలో నివాళులర్పించారు. "నేను ఆస్పత్రిలో ఉన్నందున బుద్ధా దా సంస్మరణ సభకు హాజరు కాలేకపోతున్నా. ఆయనకు నివాళులు అర్పించడం నా బాధ్యత. బుద్ధ దాకు నా లాల్‌సలామ్ చెబుతున్నా" అని ఆ వీడియోలో సీతారాం పేర్కొన్నారు.

రచనలు

సీతారాం ఏచూరి పలు రచనలు చేశారు. సోషలిజం ఇన్ చేంజింగ్ వరల్డ్, మోదీ గవర్నమెంట్ న్యూసర్జ్ ఆఫ్ కమ్యూనలిజం, కమ్యూనలిజం వర్సెస్ సెక్యులరిజం, క్యాస్ట్ అండ్ క్లాస్ ఇన్ ఇండియన్ పాలిటిక్స్ టుడే తదితర పుస్తకాలు రాశారు. పీపుల్స్ డెమాక్రసీ పత్రికలో ఆయన ఎన్నో వ్యాసాలను రాశారు.

ఇందిర సమక్షంలో.. ఆమె రాజీనామాకు డిమాండ్



సీతారాం ఏచూరి జేఎన్‌యూ విద్యార్థి నేతగా ఉన్నప్పుడు.. 1977లో పలువురు విద్యార్థులతో ర్యాలీగా ఇందిరాగాంధీ ఇంటికి వెళ్లి జేఎన్‌యూ చాన్స్‌లర్ పదవికి ఆమె రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు! ఇందిరాగాంధీ సమక్షంలో.. ఆమె పక్కన నిలబడి.. ఆమె రాజీనామాకు డిమాండ్ చేయడం అప్పట్లో సంచలనం సృష్టించింది. ఆ సంఘటన గురించి ఏచూరి ఒకసారి స్వయంగా చెప్పారు. "ఎమర్జెన్సీ సమయంలో చాలామంది విద్యార్థులకు అరెస్టు నోటీసులు జారీ చేసి.. వాటిని వారి హాస్టల్ తలుపులకు అంటించేవారు. దీంతో.. వర్సిటీ చాన్స్‌లర్‌గా ఆమె రాజీనామా చేయాలనే డిమాండ్ విద్యార్థుల్లో ఊపందుకుని.. ఒక నిరసన ప్రదర్శన నిర్వహించచారు. అక్కణ్నుంచీ బయల్దేరి ఆమె నివాసానికి వెళ్లి.. రాజీనామా చేయాలనే నోటీసు ఆమె ఇంటి తలుపునకు అంటించాలని నిర్ణయించుకున్నాం. అక్కడికి వెళ్లాక ఐదుగురు విద్యార్థులనే లోపలికి అనుమతిస్తామని భద్రతాసిబ్బంది చెప్పారు. కానీ, మేం పట్టు పట్టడంతో అందరినీ పంపించారు. గేటు దాటి లోపలికి వెళ్లగానే.. ఆమె ఇంట్లోంచి బయటకు వచ్చి మమ్మల్ని కలిసి, ఏం కావాలని అడిగారు. ఆమె రాజీనామా చేయాలని మేం డిమాండ్ చేశాం" అని ఆయన వివరించారు. అప్పట్లో ఆయన ఇందిరకు కొద్ది దూరంలో నిలబడి.. తాము తీసుకెళ్లిన మెమొరాండంను చదివి వినిపిస్తున్న ఫొటో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది.

కాకినాడ.. ఏచూరికెంతో ఇష్టం

- కడియంలోని జేగురుపాడులో ఆయన తల్లి జననం
- ఉద్యోగరీత్యా కాకినాడలో స్థిరనివాసం
- ఇంటికి ఏచూరి టవర్స్‌గా నామకరణం

కాకినాడ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి కాకినాడ అంటే చాలా ఇష్టం. తమ ఇంటి పేరుతో ఆయన తల్లి కల్పకం 'ఏచూరి టవర్స్' అనే అపార్ట్‌మెంట్ల సముదాయం నిర్మించారు. ఏచూరి తల్లిదండ్రులు కాకినాడలోనే ఉండేవారు. ఆయన తల్లి స్వస్థలం తూర్పుగోదావరి జిల్లా కడియంలోని జేగురుపాడు. ఉద్యోగ రీత్యా కాకినాడలోనే ఉంటూ అక్కడే స్థిరపడ్డారు. ఏచూరి టవర్స్‌లోనే ఆమె నివాసం ఉండేవారు. తండ్రి మరణానంతరం తల్లి కోసం పలుసార్లు సీతారాం ఏచూరి కాకినాడకు వచ్చేవారు. అదే సమయంలో జిల్లా పార్టీ కార్యక్రమాల్లో కూడా పాల్గొనేవారు. 2010లో కాకినాడలో సీపీఎం జిల్లా కార్యాలయం ప్రారంభోత్సవం జరిగినప్పుడు ఆయన హాజరయ్యారు. తల్లి మరణానికి ముందే ఏచూరి టవర్స్‌ను విక్రయించేసినట్లు అక్కడున్న వారు తెలిపారు. అయినా ఇప్పటికీ సదరు అపార్ట్‌మెంట్‌కు ఏచూరి టవర్స్ పేరు కొనసాగుతోంది. ఏచూరి కుటుంబం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం కేశవరంలో కూడా కొంతకాలం నివాసం ఉంది. 'ఏచూరి సీతారామారావు విద్యాపీఠం' పేరిట ఇక్కడ విద్యాలయం నిర్వహించారు. రెండు దశాబ్దాల క్రితం ఆ పీఠాన్ని కుటుంబసభ్యులు వేరేవారికి విక్రయించారు. బాల్యంలో సీతారాం ఏచూరి ఇక్కడకు వచ్చేవారని స్థానికులు తెలిపారు.



కాకినాడలో ఏచూరి టవర్స్ పేరుతో ఉన్న ఇల్లు

ప్రధాని, సీజేఐ భేటీపై అనుమానాలున్నాయ్!

(మొదటి పేజీ తరువాయి)

దంపతులు స్వాగతం పలికారు. ఈ ఫొటోలు, వీడియోను మోదీ తన సోషల్ మీడియా ఖాతాలో పోస్ట్ చేశారు. ఈ అంశాన్ని ప్రతిపక్షాలతో పాటు సుప్రీంకోర్టు న్యాయవాదులు కొందరు తప్పుపట్టారు. ప్రధాని మోదీతో కలిసి సీజేఐ తన నివాసంలో గణపతికి హారతి ఇచ్చారని, అయితే రాజ్యాంగ పరిరక్షకులు రాజకీయ నాయకులను కలవడంపై ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారని శివసేన (ఉద్ధవ్) నేత సంజయ్ రౌత్ వ్యాఖ్యానించారు. 'మా కేసు సీజేఐ ముందు విచారణ జరుగుతోంది. మాకు న్యాయం జరుగుతుందా? అన్నది అనుమానంగా ఉంది. ఎందుకంటే ఈ కేసులో కేంద్ర ప్రభుత్వం కూడా భాగస్వామి. ఆ ప్రభుత్వానికి నరేంద్ర మోదీ నేతృత్వం వహిస్తున్నారు' అని రౌత్ పేర్కొన్నారు. మరో నేత ప్రియాంక చతుర్వేది కూడా విమర్శలు గుప్పించారు. మోదీ, సీజేఐల కలయికను త్వరలో మహారాష్ట్రలో జరగబోయే ఎన్నికలకు ముడిపెడుతూ అనుమానాలు వ్యక్తం చేశారు. ఎన్సీపీ నేత సుప్రియా సూలే కూడా ప్రధాని వీడియో క్లిప్ చూసి ఆశ్చర్యపోయినట్లు చెప్పారు. అయితే సీజేఐపై తనకు పూర్తి నమ్మకం ఉందన్నారు. రాజ్యసభ సభ్యుడు, సీనియర్ న్యాయవాది కపిల్ సిబాల్ స్పందిస్తూ.. అత్యున్నత స్థానాల్లో వ్యక్తులు తమ వ్యక్తిగత కార్యక్రమాన్ని ప్రచారం చేసుకోకూడదన్నారు. సీజేఐ వ్యక్తిత్వంపై తనకు అపార గౌరవం ఉందని చెప్పారు. కానీ, సోషల్ మీడియాలో వైరల్ అయిన వీడియో క్లిప్‌ను చూసి ఆశ్చర్యపోయినట్లు తెలిపారు. సీజేఐ స్వతంత్రతపై నమ్మకం పోయిందని, ఈ విషయాన్ని సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ ఖండించాలని న్యాయవాది ఇందిరా జైసింగ్ పేర్కొన్నారు. వినాయక పూజ అనేది వ్యక్తిగతమని.. ప్రధాని, సీజేఐ వంటి ఉన్నతస్థాయి వ్యక్తులు ఆ ఫొటోలను బహిరంగపర్చడం సరికాదని ఆర్జేడీ ఎంపీ మనోజ్ షా అన్నారు. ఇక ప్రతిపక్షాలపై బీజేపీ, దాని మిత్రపక్షాలు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డాయి. ప్రతిపక్షాలు తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ధ్వజమెత్తాయి. సర్వోన్నత న్యాయస్థానం పట్ల వారు చేస్తున్న వ్యాఖ్యలు అత్యంత ప్రమాదకరమని పేర్కొన్నాయి. బీజేపీ ఎంపీ, పార్టీ అధికార ప్రతినిధి సంబిత్ పాత్రా గురువారం ఢిల్లీలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ప్రతిపక్షాల తీరుపై మండిపడ్డారు. గతంలో ప్రధాని మన్మోహన్‌సింగ్ ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు అప్పటి సీజేఐ హాజరవలేదా? అని ప్రశ్నించారు. ప్రధాని వెళ్లి సీజేఐని కలిస్తే అభ్యంతరం లేదని, గణపతిపూజలో పాల్గొనడమే వారికి బాధగా ఉందని వ్యాఖ్యానించారు. "ప్రధాని మోదీ సీజేఐని కలిస్తే మీకు అభ్యంతరం. కానీ, రాహుల్ గాంధీ పాక్ ఆక్రమిత కశ్మీరుకు మద్దతు పలికే అమెరికా చట్ట సభ సభ్యుడు ఇల్హాన్ ఒమర్‌ను కలిస్తే మాత్రం అభ్యంతరం వ్యక్తం చేయరు. ఇదెక్కడి విడ్డూరం" అని పాత్రా ప్రతిపక్షాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

తీవ్ర విషాదం

- లోకేశ్, పల్లా, బాలకృష్ణ

ఏచూరి మరణం తీవ్ర విషాదాన్ని నింపిందని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. 'ఏచూరి మృతితో ఒక ప్రజా పోరాట యోధుడిని కోల్పోయాం. ప్రజా ఉద్యమాలకు జీవితం అంకితం చేసిన మహా నేతకు కన్నీటి నివాళులర్పిస్తున్నాను.

అమర్ రహే కామ్రేడ్ సీతారాం ఏచూరి' అని గురువారం ఆయన ఎక్స్‌లో ట్వీట్ చేశారు. సీతారాం ఏచూరి మరణం కమ్యూనిస్టు ఉద్యమాలకు తీరని లోటని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, మండలిలో టీడీపీ పక్ష నేత యనమల రామకృష్ణుడు, మాజీ ఎంపీ కంభంపాటి రామ్మోహనరావు, సీడబ్ల్యూసీ సభ్యుడు ఎన్.రఘువీరారెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ తదితరులు పేర్కొన్నారు.

లోకం తీరు



మంచి స్నేహితుడిని కోల్పోయా

సీతారాం ఏచూరిజీ నాకు మంచి స్నేహితుడు. మన దేశం గురించి లోతైన ఆలోచనలు చేసేవారు. ఈ విషాద సమయంలో ఆయన కుటుంబ సభ్యులకు నా సానుభూతిని తెలియజేస్తున్నాను.

\- రాహుల్ గాంధీ

సీపీఎం మూల స్తంభం

సీపీఎంకు ఏచూరి మూలస్తంభం లాంటి వారు. ఆచరణాత్మక ధోరణితో ప్రజల గళాన్ని వినిపించే వారు. ఆయన బహుభాషా గ్రంథకర్త. మంచి పార్లమెంటేరియన్. మూడు దశాబ్దాలకు పైగా ఆయనతో మంచి అనుబంధం ఉంది.

\- జైరాం రమేశ్

వ్యక్తిగతం-రాజకీయాల సమతూకం

వ్యక్తిగత సమీకరణాలను.. అస్థిరమైన రాజకీయ సిద్ధాంతాలతో సమతూకం వేస్తూ.. అద్వితీయ పాత్ర పోషించగల వ్యక్తి సీతారాం ఏచూరి. ఆయన ఓ మేధావి. తన ఆదర్శాలతో ప్రజల పక్షాన నిలిచారు. ఆయన మరణం ఉదారవాద శక్తులకు తీరని లోటు. ఆయనకు ఇదే జోహార్.

\- మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ అధ్యక్షుడు

జాతీయ రాజకీయాలకు తీరని లోటు

ఏచూరి మృతి జాతీయ రాజకీయాలకు తీరని లోటు. ఆయన మరణవార్త తెలిసి బాధపడ్డాను. ఆయన కుటుంబ సభ్యులకు నా సంతాపాన్ని తెలుపుతున్నాను.

\- మమతాబెనర్జీ, పశ్చిమబెంగాల్ సీఎం

వామపక్ష రాజకీయాలకు తీరని లోటు

ఏచూరి మరణం వామపక్ష రాజకీయాలకు తీరని లోటు. ఆయన దోపిడీ రహిత సమాజం కోసం పోరాడేవారు. ఆయనతో నాకు దశాబ్దాల అనుబంధం ఉంది. సమకాలీన వామపక్ష ఉద్యమాల్లో ఆయన అత్యంత విశిష్టమైన వ్యక్తి. ఏచూరి భార్య సీమ, కుమార్తె అఖిల, కుమారుడు డానిష్‌కు నా సానుభూతి.

\- డి.రాజా, సీపీఐ ప్రధాన కార్యదర్శి

అవిశ్రాంత పోరాట యోధుడు

ఏచూరి అవిశ్రాంత పోరాట యోధుడు. అభ్యుదయ భావాలు మెండుగా ఉన్న నిండైనా రాజకీయవేత్త. నమ్మిన సిద్ధాంతాల కోసం రాజీలేని పోరాటం చేసిన యోధుడు. ప్రతిపక్షాల ఐక్యతకు కృషి చేసిన జాతీయ నేత. తెలుగు ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ ముందుండి గళం విప్పారు.

\- మాజీ సీజేఐ ఎన్వీ రమణ

చాలా బాధకలిగించింది

ఏచూరి మరణ వార్త చాలా దుఃఖాన్ని కలిగించింది. ఏచూరి తనకు ఆత్మీయ సన్నిహితుడు. సీపీఎంలో సైద్ధాంతిక బలంతో తర్కబద్ధంగా విషయాలను చక్కగా వివరించే మేధావి - గవర్నర్ దత్తాత్రేయ

ఏచూరి మరణంపై చంద్రబాబు, పవన్ దిగ్భ్రాంతి

అమరావతి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మరణంపై సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఏచూరి మరణం తీవ్ర మనో వేదన కలిగించిందని సీఎం పేర్కొన్నారు. గురువారం సాయంత్రం ఆయన దీనిపై ఒక ట్వీట్ చేస్తూ.. 'భారత రాజకీయాల్లో ఆయన ఒక పెద్ద శిఖరం. కింది స్థాయి నుంచి ఎదిగి దేశ రాజకీయాల్లో అత్యంత గౌరవనీయ స్థానం పొందారు. పార్టీలతో సంబంధం లేకుండా దేశ రాజకీయాల్లోని వివిధ పక్షాల వారితో ఆయన చర్చించే అంశాలు.. ఆయనకు వాటిపై ఉన్న లోతైన పరిజ్ఞానం.. పార్టీతో సంబంధం లేకుండా ఆయనకు గుర్తింపును, గౌరవాన్ని ఇచ్చాయి. ఆయన కుటుంబానికి, వామపక్షవాదులకు, ఆయన పార్టీ వారికి నా ప్రగాఢ సంతాపం వ్యక్తం చేస్తున్నాను. ఆయనకు నా నివాళి' అని చంద్రబాబు అన్నారు. ఏచూరి ఆస్పత్రిలో ఉన్న సమయంలో చంద్రబాబు ఫోన్ చేసి ఆయన సతీమణి సీమతో మాట్లాడారు. ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకొని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఏచూరి కోలుకుంటారని భావించానని, అయితే మరణవార్త తెలిసి దిగ్భ్రాంతికి గురయ్యానని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీతారాం ఏచూరి మరణం పేద, కార్మిక వర్గాలకు తీరని లోటు అని తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని దేవుని ప్రార్థిస్తున్నానని పేర్కొంటూ.. ఏచూరి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఏచూరి మృతి దేశ రాజకీయాలకు తీరని లోటు అని శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు నర్సీపట్నంలో అన్నారు.

యూటీఎఫ్ విచారం

ఏచూరి మృతి పట్ల యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్.వెంకటేశ్వర్లు, ప్రసాద్ విచారం వ్యక్తంచేశారు. దేశంలోని లౌకిక ప్రజాస్వామ్య శక్తులను ఏకం చేయడంలోఏచూరి ప్రముఖ పాత్ర పోషించారని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కె.ప్రసన్నకుమార్, ఎ.అశోక్ తెలిపారు.

ఆరోగ్య బీమాతో 6కోట్ల మందికి ప్రయోజనం

▸ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్



అమరావతి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): 70 ఏళ్లు పైబడిన వారందకీ రూ.5 లక్షల ఉచితంగా ఆరోగ్య బీమా కల్పిస్తూ కేబినెట్ ఆమోదించడాన్ని ప్రతి ఒక్కరూ స్వాగతిస్తారని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయుష్మాన్ భారత్ ప్రధానమంత్రి జన్‌ధన్ ఆరోగ్య యోజన పథకం విస్తరణతో దేశంలో ఆరుకోట్ల మంది వయోధికులకు ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. మొత్తంగా 4.5 కోట్ల కుటుంబాలకు గొప్ప ఊరటనిస్తుందని తెలిపారు. సామాజిక, ఆర్థిక తారతమ్యాలకు తావు లేకుండా ఉచిత ఆరోగ్య బీమా ద్వారా ప్రతి ఒక్కరికీ లబ్ధి ఇవ్వాలనే ఉదాత్తమైన పథకాన్ని ప్రవేశపెడుతున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీకి ధన్యవాదాలు తెలిపారు.

క్యాంపు కార్యాలయంగా పవన్ నివాసం

ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మంగళగిరిలోని తన నివాసాన్ని క్యాంపు కార్యాలయంగా వినియోగించుకోవాలని నిర్ణయించారు. ఈ మేరకు ఆయన చంద్రబాబుకు లేఖ రాశారు. ఇప్పటివరకు విజయవాడలోని ఇరిగేషన్ భవనాన్ని క్యాంపు కార్యాలయంగా కేటాయించినందుకు ధన్యవాదాలు తెలిపారు. మంగళగిరిలోని తన నివాసాన్ని క్యాంపు కార్యాలయంగా వినియోగించుకోనున్న క్రమంలో విజయవాడలో కేటాయించిన ఇరిగేషన్ భవనం ఫర్నిచర్‌తో సహా వెనక్కి తీసుకోవాలని సీఎంకు రాసిన లేఖలో పవన్ కోరారు.

16న గుజరాత్‌కు చంద్రబాబు

▸ రీ-ఇన్వెస్ట్-24 సదస్సుకు హాజరు.. ముఖ్య అతిథిగా ప్రధాని మోదీ

అమరావతి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ నెల 16న గుజరాత్ వెళ్లనున్నారు. గాంధీనగర్‌లో 16 నుంచి 18వ తేదీదాకా రీ-ఇన్వెస్ట్-24 సదస్సు జరుగనుంది. ప్రధాని మోదీ ముఖ్యఅతిథిగా హాజరయ్యే ఈ సమావేశంలో తొలిరోజు చంద్రబాబు రాష్ట్రంలో అమలు చేయనున్న సోలార్ .. సోలార్-విండ్, సోలార్, విండ్, హైడ్రో పంప్డ్ స్టోరేజీ విద్యుదుత్పత్తి ప్రాజెక్టులకు ఇస్తున్న ప్రాధాన్యం, ప్రోత్సాహకాలు, త్వరలోనే రూపకల్పన చేయనున్న విధాన నిర్ణయాలపై కీలకోపన్యాసం చేస్తారు. ఈ సందర్భంగా ప్రధానితో చంద్రబాబు ప్రత్యేకంగా భేటీ అయ్యే అవకాశాలున్నాయని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. గాంధీనగర్ సదస్సుకు రావాలని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషీ సీఎంకు ఆహ్వానం పంపారు. దీనిపై ఆయన ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్‌తో గురువారమిక్కడ వెలగపూడి సచివాలయంలో సమావేశమయ్యారు. సదస్సులో చేయాల్సిన ప్రసంగంపై చర్చించారు.

జిల్లా అధ్యక్ష పదవి నాకొద్దు

▸ జగన్‌కు తేల్చిచెప్పిన బాలినేని!

▸ జనసేన వైపు మాజీ మంత్రి చూపు?



ఒంగోలు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఓటమి భారంతో ఆపసోపాలు పడుతున్న ప్రకాశం జిల్లా వైసీపీలో సరికొత్త సంక్షోభం ఏర్పడింది. ఆ పార్టీ కీలక నేత, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి తనకు పార్టీలో పదవులొద్దని.. అసలే పనీ చేయలేనని తమ పార్టీ అధినేత వైఎస్ జగన్‌కే తేల్చిచెప్పారు. దీంతో దిక్కుతోచని మాజీ సీఎం.. జిల్లా పార్టీ నాయకులందరినీ శుక్రవారం తాడేపల్లి రావాలని కబురు పంపారు. ఈ పరిణామం.. బాలినేని జనసేనలో చేరే ఆలోచనలో ఉన్నారన్న ఊహాగానాలకు కూడా బలం చేకూరుస్తోంది. గత ఎన్నికల్లో జిల్లాలో పార్టీ పరాజయానికి నైతిక బాధ్యత వహిస్తూ వైసీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి రాజీనామా చేశారు. తిరుపతి జిల్లాకు చెందిన, గత ఎన్నికల్లో ఒంగోలు లోక్‌సభ అభ్యర్థిగా పోటీచేసి ఓడిపోయిన చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని జిల్లా అధ్యక్షుడిని చేయాలని తొలుత జగన్ భావించారు. ఇది తెలుసుకుని స్థానికేతరుడిని తమపై ఎలా రుద్దుతారని బాలినేని, మరికొందరు నాయకులు నిలదీశారు. దీంతో వెనక్కి తగ్గిన జగన్.. బాలినేనికి ఫోన్ చేసి తనను కలవాలని సూచించారు. బుధవారం సాయంత్రం తాడేపల్లిలో జగన్‌ను బాలినేని కలిశారు. జిల్లా అధ్యక్షుడిగా మిమ్మల్ని నియమిస్తానని అనగా, బాలినేని తిరస్కరించినట్లు సమాచారం. తనకు జిల్లా అధ్యక్ష పదవి వద్దని, పైగా పార్టీ కార్యక్రమాల్లో కూడా పాల్గొననని ఆయన తేల్చిచెప్పినట్లు తెలిసింది. దీంతో తక్షణమే జిల్లా నాయకులతో సమావేశం కావాలని జగన్ నిర్ణయించారు. శుక్రవారం తాడేపల్లిలో జగన్‌తో జరిగే భేటీకి రావాలని గత ఎన్నికల్లో గెలుపొందిన దర్శి, యర్రగొండపాలెం ఎమ్మెల్యేలు బూచేపల్లి శివప్రసాదరెడ్డి, తాడిపర్తి చంద్రశేఖర్ తదితరులకు సమాచారం పంపింది. బాలినేని,, జనసేనలో చేరే ఆలోచనలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.

ఆర్టీసీ చైర్మన్ రాజీనామా ఆమోదం

అమరావతి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ఆర్టీసీ బోర్డు చైర్మన్, ఏడుగురు డైరెక్టర్ల రాజీనామాలను ఆమోదిస్తూ రవాణాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఆర్టీసీ చైర్మన్‌గా ఎ.మల్లికార్జునరెడ్డి జూన్ 6న రాజీనామా చేశారు. మిగతా డైరెక్టర్లు కూడా జూన్ నెలలోనే రాజీనామా చేశారు.

17 నుంచి 'స్వచ్ఛతా హి సేవా' కార్యక్రమం

అమరావతి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా పరిశుభ్రతను పెంపొందించడమే లక్ష్యంగా ఈ నెల 17 నుంచి అక్టోబరు 2 వరకూ 'స్వచ్ఛతా హి సేవా' పరిశుభ్రత కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ ఆదేశించారు. దీనిపై గురువారం సచివాలయంలో వివిధ శాఖల కార్యదర్శులతో రాష్ట్ర స్థాయి తొలి స్టీరింగ్ కమిటీ సమావేశం, కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్వచ్ఛతా హి సేవా సన్నాహక కార్యక్రమం 14 నుంచి ప్రారంభమవుతుందని, స్వచ్ఛతను ప్రోత్సహించడంపై ప్రజల్లో అవగాహన కలిగించాలని సీఎస్ ఆదేశించారు.

రవాణాశాఖలో బదిలీ మార్గదర్శకాల మార్పు

అమరావతి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): రవాణాశాఖలో బదిలీల కోసం గతంలో రూపొందించిన మార్గదర్శకాలను స్వల్పంగా మార్చారు. ఒకేచోట ఐదేళ్లు పూర్తి చేసుకున్న ఉద్యోగులు బదిలీలకు అర్హులంటూ గతంలో ఆ శాఖ ముఖ్యకార్యదర్శి కాంతిలాల్ దండే మార్గదర్శకాలు జారీ చేశారు. ఐదేళ్లు పూర్తి చేసుకున్న వారితో పాటు మిగతా ఉద్యోగులు కూడా బదిలీలకు అర్హులేనని తాజాగా ఆదేశాలిచ్చారు. దీంతో ఆ శాఖలో ఉద్యోగులంతా సర్వీసు కాలంతో సంబంధం లేకుండా బదిలీలకు అర్హులయ్యారు.

సెరికల్చర్ డైరెక్టర్‌కు అదనపు బాధ్యతలు

హిందూపురం కిరికెరలోని ఏపీ స్టేట్ సెరికల్చర్ రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ ఇనిస్టిట్యూట్ రెగ్యులర్ డైరెక్టర్‌గా రాష్ట్ర పట్టు పరిశ్రమ శాఖ డైరెక్టర్ కే శ్రీనివాసులుకు ప్రభుత్వం పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించింది.

సెబ్ జీవోలు రద్దు

అమరావతి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(సెబ్) ఏర్పాటుకు సంబంధించి 2020లో జారీచేసిన మరో నాలుగు జీవోలను ప్రభుత్వం రద్దు చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీచేసింది. సాధారణ పరిపాలన శాఖలోని సెబ్ విభాగం జారీ చేసిన 12 జీవోలను బుధవారం రద్దు చేయగా, సెబ్ ఏర్పాటుకు ఇచ్చిన నాలుగు జీవోలను ఇప్పుడు రద్దు చేసింది. దీంతో సెబ్ పూర్తిగా ఉనికిని కోల్పోయింది.

నేడు ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం

విశాఖపట్నం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): బంగ్లాదేశ్ ఈశాన్య ప్రాంతంలో కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం ప్రభావంతో ఉత్తర బంగాళాఖాతంలో శుక్రవారం అల్పపీడనం ఏర్పడనుంది. ఇది పశ్చిమ వాయవ్యంగా పయనించి 15వ తేదీకల్లా బెంగాల్‌కు ఆనుకుని వాయవ్య బంగాళాఖాతంలో ప్రవేశించి వాయుగుండంగా బలపడుతుందని వాతావరణ శాఖ తెలిపింది. కాగా, గురువారం రాష్ట్రంలో అనేకచోట్ల ఎండ తీవ్రత కొనసాగింది. కావలిలో 38.2 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. రానున్న 24 గంటల్లో ఉత్తర కోస్తాలో పలుచోట్ల, దక్షిణ కోస్తా, రాయలసీమల్లో చెదురుమదురుగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది.

'విజయ'కు పాడి రైతు సాయం

▸ విజయవాడలోని ఫ్యాక్టరీ పునరుద్ధరణకు చేయూత



కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులుకు విరాళం చెక్కులు అందజేస్తున్న గన్నవరం పాల సొసైటీ అధ్యక్షుడు పాలడుగు వెంకటరామవరప్రసాద్, దావాజిగూడెం పాల సొసైటీ అధ్యక్షుడు గొంది నరేంద్ర, ఎండీ ఈశ్వరబాబు, తదితరులు

హనుమాన్‌జంక్షన్ రూరల్, సెప్టెంబరు 12: దశాబ్దాలుగా పాడి రైతుల అభివృద్ధికి సేవలందించిన విజయవాడలోని కృష్ణ మిల్క్ యూనియన్ పాల ఫ్యాక్టరీ ముంపు బారిన పడి భారీగా నష్టపోయింది. సంస్థ పునరుద్ధరణకు పాడి రైతులు స్వచ్ఛందంగా చేయూత అందిస్తున్నారు. వీరవల్లిలోని కామధేను (పాల ఫ్యాక్టరీ) ఆవరణలో గురువారం గన్నవరం పాల సొసైటీ అధ్యక్షుడు పాలడుగు వెంకటరామవరప్రసాద్ (నాని) ఆధ్వర్యంలో రూ.1,01,116, దావాజిగూడెం పాల సొసైటీ అధ్యక్షుడు గొంది నరేంద్ర ఆధ్వర్యంలో రూ.1,01,116 విరాళాల చెక్కును చైర్మన్ చలసాని ఆంజనేయులుకు అందజేశారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పాడి రైతులు నెలవారి బిల్లుల్లో రెండు రోజుల పాలసేకరణ విలువ సుమారు రూ.10 లక్షల విరాళాన్ని ఎంపీఏ అసోసియేషన్ అధ్యక్షుడు ఘంటా నాగేశ్వరరావు ద్వారా చైర్మన్ చలసానికి అందజేశారు. 'ఫ్యాక్టరీ పునరుద్ధరణకు పశ్చిమ గోదావరి జిల్లా పాడి రైతులతో పాటు అన్ని పాల సొసైటీల సభ్యులు చేయూత అందిస్తున్నారు. ఇది సమష్టితత్వానికి నిదర్శనం. అందరి ఆకాంక్షల మేరకు త్వరలోనే విజయవాడ పాల ఫ్యాక్టరీ రైతు సేవకు పునరంకితం అవుతుంది' అని చైర్మన్ చలసాని అన్నారు.

పారిశ్రామిక పార్కుల్లో
రైతుల భాగస్వామ్యం

▸ ఎంఎస్ఎంఈ, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖలపై సీఎం సమీక్ష

▸ సరికొత్త పారిశ్రామిక పాలసీ రూపొందించాలి: చంద్రబాబు



సచివాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న సీఎం చంద్రబాబు.. చిత్రంలో మంత్రులు టీజీ భరత్, కొండపల్లి శ్రీనివాస్

అమరావతి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): రైతులు, ప్రైవేటు వ్యక్తుల భాగస్వామ్యంతో పారిశ్రామిక పార్కులు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. భూములున్న రైతులే రాష్ట్రవ్యాప్తంగా వీటిని ఏర్పాటు చేసుకుని.. వాటిలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలను నెలకొల్పేందుకు ప్రభుత్వ పరంగా తగిన ప్రోత్సాహం అందించాలని భావిస్తోంది. డ్వాక్రా సంఘాలను ఎంఎస్ఎంఈలతో అనుసంధానం చేసి, డ్వాక్రా మహిళలు కూడా సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలను నెలకొల్పేలా ప్రోత్సహించనుంది. పుణె వంటిచోట్ల ఇలాంటి విధానం అమల్లో ఉందని పరిశ్రమల శాఖ అధికారులు సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారు. అక్కడి విధానాలను అధ్యయనం చేసి, రైతుల భాగస్వామ్యంతో ఎంఎస్ఎంఈలను నెలకొల్పేందుకు మెరుగైన విధానాలను అమలు చేయాలని ఆదేశించారు. గురువారం రాష్ట్ర సచివాలయంలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, ఆహార శుద్ధి పరిశ్రమల శాఖలపై చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల స్థాపనకు అపారమైన అవకాశాలు, అనువైన పరిస్థితులు ఉన్నాయని సీఎం తెలిపారు. ఉద్యాన పంటలు, ఆక్వా కల్చర్ ఉత్పత్తులకు ఆహారశుద్ధి పరిశ్రమల ద్వారా అదనపు విలువ చేకూరుతుందని, తద్వారా రైతులకు ఆదాయ వనరులు పెరుగుతాయని వివరించారు. రైతులు పండించే పంటలకు వాళ్లే వాల్యూ ఎడిషన్ ఇచ్చుకునే పరిస్థితి కల్పించే విధంగా సరికొత్త పారిశ్రామిక పాలసీని రూపొందించాలని ఆదేశించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించే పంటలకు ఎక్కువ డిమాండ్ ఉంటుందని, వాటిని ప్రోత్సహించాలని సూచించారు. టమాటా, మామిడి, మిరప, పసుపు, ఆక్వా ఉత్పత్తులకు అవిపండే ప్రాంతంలోనే ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేస్తే రైతులకు మేలు జరుగుతుందని పేర్కొన్నారు. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం సృష్టించిన అనేక సమస్యలు, సవాళ్లతో కుదేలైన ఎంఎస్ఎంఈ రంగాన్ని తిరిగి గాడిలో పెడతామని తెలిపారు. రాష్ట్రంలోని ఎంఎస్ఎంఈలకు క్రెడిట్ గ్యారెంటీ కోసం రూ.100 కోట్లు కేటాయిస్తామని చంద్రబాబు ప్రకటించారు. రాష్ట్రంలో ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ఏడు పారిశ్రామిక క్లస్టర్లను త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. ఆటోనగర్లను ఆధునీకరించాలని, పెండింగ్‌లో ఉన్న ఎంఎస్ఎంఈ పార్కులను కూడా త్వరితగతిన పూర్తిచేసి, వాటిలో అవసరమైన మౌలిక వసతులు, సౌకర్యాలు కల్పించి పరిశ్రమల ఏర్పాటును వేగవంతం చేస్తామని వివరించారు. పరిశ్రమల ఏర్పాటుకు ప్రతిబంధకంగా మారిన నిబంధనలను తొలగించి, పెట్టుబడిదారులకు సులభతరంగా అనుమతులు ఇవ్వాలని ఆదేశించారు. నిర్దేశిత సమయంలో సంబంధిత విభాగాలు, అధికారులు స్పందించకపోతే.. ఆటోమేటిక్‌గా అనుమతులు పొందేవిధానాన్ని అమల్లోకి తీసుకురావాలని సూచించారు. ప్యాకింగ్, డిజిటల్, కామర్స్, మార్కెటింగ్ సదుపాయాలు కల్పిస్తే చిన్న పరిశ్రమల ఉత్పత్తులకు డిమాండ్ లభిస్తుందని సీఎం తెలిపారు.

రూ.150 కోట్లతో అమరావతిలో టెక్నో సెంటర్

▸ యువతకు నైపుణ్య శిక్షణ: కొండపల్లి

రాష్ట్రంలో పెద్దఎత్తున పరిశ్రమలను నెలకొల్పడంతో పాటు వాటిలో స్థానిక యువతకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. సీఎం సమీక్ష సమావేశం ముగిసిన అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా బీటెక్, ఐటీఐ, పాలిటెక్నిక్ విద్యార్థులకు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా వృత్తి నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా విశాఖపట్నం జిల్లా అచ్యుతాపురం సమీపంలోని పూడిలో కేంద్రం నిధులతో ఒక టెక్నాలజీ సెంటర్ ఏర్పాటు చేయగా.. అక్కడ శిక్షణ కార్యక్రమాలు కొనసాగుతున్నాయని వివరించారు. అటువంటి మరో టెక్నాలజీ సెంటర్‌ను రూ.250 కోట్లతో అమరావతిలో ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. ఈ రెండు సెంటర్లను అనుసంధానం చేసి రాష్ట్రవ్యాప్తంగా హబ్ అండ్ స్పోక్ మోడల్‌లో మరో 10 శిక్షణ కేంద్రాలు (స్కిల్ సెంటర్లు) ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. గత ప్రభుత్వం పరిశ్రమలకు చెల్లించాల్సిన రూ.1,500 కోట్ల ఇన్సెంటివ్‌ల బకాయిలను చెల్లించేందుకు కసరత్తు చేయాలని ఆర్థికశాఖకు సీఎం చంద్రబాబు సూచించారని తెలిపారు. మొత్తం 26 జిల్లాల్లోనూ పరిశ్రమల కేంద్రాలను ప్రయోజనకరంగా తీర్చిదిద్దనున్నట్లు పేర్కొన్నారు.

జోగి రాజీవ్, సర్వేయర్ రమేశ్‌ను
కస్టడీలోకి తీసుకొని విచారించాలి

▸ వారి నుంచి కీలక సమాచారం రాబట్టాలి

▸ ఏసీబీ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను కొట్టివేయండి

▸ హైకోర్టులో ఏసీబీ అధికారుల పిటిషన్

అమరావతి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): అగ్రిగోల్డ్ భూములను ఆక్రమించి, ప్లాట్లు వేసి విక్రయించారనే ఆరోపణపై నమోదైన కేసులో మాజీ మంత్రి జోగి రమేశ్ కుమారుడు జోగి రాజీవ్, మండల సర్వేయర్ అజ్మీరా రమేశ్‌లను కస్టడీకి అప్పగించేందుకు నిరాకరిస్తూ ఏసీబీ ప్రత్యేక కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ ఏసీబీ అధికారులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆ ఉత్తర్వులను కొట్టివేయాలని కోరారు. నిందితుల నుంచి కీలక సమాచారం రాబట్టాల్సి ఉందని, వారిని కస్టడీలోకి తీసుకొని విచారించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. తమ వాదనలు ఏసీబీ కోర్టు పట్టించుకోలేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. వారిని కస్టడీకి ఇస్తూ ఉత్తర్వులివ్వాలని కోరారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయమూర్తి జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి వ్యాజ్యంలో ప్రతివాదులుగా ఉన్న జోగి రాజీవ్, సర్వేయర్ అజ్మీరా రమేశ్‌కు నోటీసులు జారీ చేశారు. విచారణను వారం రోజులకు వాయిదా వేశారు. నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి ఉమ్మడి కృష్ణా జిల్లా, అంబాపురం గ్రామం పరిధిలోని 2,160 చదరపు గజాల సీఐడీ జప్తుచేసిన అగ్రిగోల్డ్ భూములను ఆక్రమించి, ప్లాట్లు వేసి విక్రయించారనే ఆరోపణలతో జోగి రమేశ్ కుటుంబ సభ్యులు, మరికొందరిపై ఏసీబీ అధికారులు కేసు నమోదుచేశారు. ఈ కేసులో జోగి రాజీవ్, అజ్మీరా రమేశ్‌కు విజయవాడ ఏసీబీ ప్రత్యేక కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఏసీబీ కోర్టు ఉత్తర్వులను కొట్టివేయాలని కోరుతూ ఏసీబీ అధికారులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.



వారి బెయిళ్లు రద్దు చేయండి..

మరోవైపు ఇదే కేసులో జోగి రాజీవ్, అజ్మీరా రమేశ్‌కు బెయిల్ మంజూరు చేస్తూ విజయవాడ ఏసీబీ ప్రత్యేక కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయాలని కోరుతూ ఏసీబీ అధికారులు వేసిన పిటిషన్‌ను విచారణ నిమిత్తం తగిన బెంచ్ ముందు ఉంచాలని రిజిస్ట్రీని హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి గురువారం ఉత్తర్వులు ఇచ్చారు.

ఫిర్యాదుల ఆధారంగా ఏం చర్యలు తీసుకున్నారు..?

▸ ఆ వివరాలు చెప్పాలని పోలీసులకు హైకోర్టు ఆదేశం

అమరావతి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కృష్ణా జిల్లా గన్నవరం మండలం సూరంపల్లి గ్రామం పరిధిలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో జప్తులో ఉన్న తమ యంత్ర సామాగ్రి, టేకు చెట్లు చోరీకి గురవుతున్నాయని, వాటిని రక్షించేందుకు చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసినప్పటికీ పోలీసులు పట్టించుకోవడం లేదని అగ్రిగోల్డ్ యాజమాన్యం హైకోర్టును ఆశ్రయించింది. ఎఫ్ఐఆర్ నమోదు చేసేలా పోలీసులను ఆదేశించాలని కోరింది. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం అగ్రిగోల్డ్ యాజమాన్యం, బ్యాంకు అధికారులు ఇచ్చిన ఫిర్యాదుల ఆధారంగా ఏం చర్యలు తీసుకున్నారో చెప్పాలని పోలీసులను ఆదేశించింది. విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి ఉత్తర్వులు ఇచ్చారు.



కంటైనర్ కింద నుజ్జునుజ్జయిన కారు

ప్రాణాలు తీసిన కంటైనర్

▸ మలుపులో అదుపుతప్పి ఇన్నోవాపై ఒరిగిన లారీ.. కారు లోపలున్న ముగ్గురు దుర్మరణం

▸ ఒకరికి తీవ్ర గాయాలు.. రుయా ఆస్పత్రికి తరలింపు

▸ తిరుపతి జిల్లా భాకరాపేట ఘాట్ రోడ్డులో ప్రమాదం.. మృతులంతా కర్ణాటక వాసులు

చంద్రగిరి, సెప్టెంబరు 12: టమాటా లోడుతో వస్తున్న కంటైనర్ లారీ.. ఘాట్ రోడ్డు మలుపులో అదుపు తప్పి ఇన్నోవా కారుపై ఒరిగి పడింది. దీంతో ఇన్నోవా కారు అణిగిపోయి అందులో ఉన్న ముగ్గురు దుర్మరణం పాలయ్యారు. ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. తిరుపతి జిల్లా చంద్రగిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని భాకరాపేట ఘాట్ రోడ్డులో గురువారం మధ్యాహ్నం ఈ ఘోరం జరిగింది. మృతులు, క్షతగాత్రుడిని కర్ణాటక రాష్ట్రం చిక్కబళ్లాపూర్‌కు చెందిన వారిగా గుర్తించారు. అన్నమయ్య జిల్లా కలకడ నుంచీ టమాటా లోడుతో కంటైనర్ లారీ చెన్నై బయల్దేరింది. అది పీలేరు మీదుగా తిరుపతికి వస్తూ మార్గమధ్యంలో భాకరాపేట ఘాట్ రోడ్డు మొదటి మలుపులో అదుపు తప్పి పక్కనే ఎదురు వెళుతున్న ఇన్నోవా కారుపై ఒరిగిపోయింది. దీంతో కంటైనర్ కింద ఇన్నోవా కారు అణిగిపోయి అందులో ప్రయాణిస్తున్న నలుగురిలో రమేశ్ మూర్తి (34), మంజునాధ (38), మునివెంకటరెడ్డి (58) అక్కడికక్కడే మృతిచెందగా.. తీవ్రంగా గాయపడిన తేజేశ్ కుమార్‌ను రుయా ఆస్పత్రికి తరలించారు. వీరంతా తిరుమల వెళ్లి తిరుగు ప్రయాణంలో ప్రమాదానికి గురయ్యారు. పోలీసులు కంటైనర్‌ను తొలగించడానికి సమయం పట్టడంతో మధ్యాహ్నం 2.30 గంటల నుంచీ సాయంత్రం 5గంటల వరకూ ట్రాఫిక్ భారీగా స్తంభించింది.

అమరావతిలో ప్రపంచ బ్యాంకు, ఏడీబీ బృందాలు

▸ టిడ్కో ఇళ్లు, కొండవీటివాగు పరిశీలన

తుళ్లూరు, సెప్టెంబరు 12: రాజధాని అమరావతిలో వరల్డ్ బ్యాంకు, ఆసియా డెవలప్‌మెంట్ బ్యాంకు (ఏడీబీ) బృందాలు గురువారం పర్యటించాయి. ముందుగా తుళ్లూరులోని టిడ్కో ఇళ్ల సముదాయాలను పరిశీలించాయి. అనంతరం వారు మందడంలో డ్వాక్రా మహిళలతో మాట్లాడారు. వారి జీవన ప్రమాణాలను అడిగి తెలుసుకున్నారు. వెంకటపాలెంలో రైతులతో సంభాషించారు. అమరావతి అభివృద్ధికి నిధులు కేటాయించడానికి సిద్ధంగా ఉన్నట్టు వారికి తెలియజేశారు. అమరావతిలో వరద ప్రభావం ఎప్పుడూ లేదని.. మొన్న వచ్చిన వరద కూడా రాజధానిని తాకలేదని రైతులు వివరించారు. వందేళ్లలో ఈ ప్రాంతం ఎప్పుడూ వరద కారణంగా ఇబ్బంది పడింది లేదన్నారు. రాయపూడి రెవెన్యూలో నిర్మించిన ఎమ్మెల్యే భవనాలను బృందాలు పరిశీలించాయి. తర్వాత ఉండవల్లి కరకట్ట వద్ద ఉన్న కొండవీటి వాగు ఎత్తిపోతల పథకాన్ని చూశారు.

నిలిచిన స్టాంపు పేపర్ల సరఫరా

▸ పెండింగ్ బిల్లులు చెల్లిస్తేనే పంపిస్తాం.. హైదరాబాద్, నాసిక్ ప్రెస్‌ల స్పష్టీకరణ

అమరావతి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి స్టాంపు పేపర్ల సరఫరా నిలిచిపోయింది. స్టాంపు పేపర్లు ఎక్కువ శాతం నాసిక్‌లోని ఇండియన్ సెక్యూరిటీ ప్రెస్ నుంచి సరఫరా అవుతాయి. స్వల్పస్థాయిలో అయితే హైదరాబాద్‌లోని సెక్యూరిటీ ప్రింటింగ్ ప్రెస్ నుంచి పంపుతారు. గత ప్రభుత్వంలో నాసిక్ ప్రెస్ నుంచి రూ.90 కోట్లు విలువైన రూ.50, రూ.100 స్టాంపులను తెప్పించారు. కానీ, వాటికి బిల్లులు చెల్లించలేదు. అలాగే పేదలకు ఇళ్ల పట్టాల కోసం, ఇళ్ల రిజిస్ట్రేషన్ కోసం హైదరాబాద్ ప్రెస్ నుంచి రూ.10, రూ.20 విలువైన స్టాంపు పేపర్లు తెప్పించారు. వీటి విలువ దాదాపు రూ.20 కోట్లు. పెండింగ్ బిల్లులు చెల్లించాలి. వాటిలో కనీసం సగమైనా చెల్లిస్తేనే తిరిగి స్టాంపుపేపర్ల సరఫరాను పునరుద్ధరిస్తామని ఈ రెండు ప్రెస్‌ల అధికారులు స్పష్టం చేశారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఎరుపు, ఒడుపు, ఏచూరి

తాను చేయగలిగినది చాలా ఎక్కువ ఉన్న చారిత్రక సందర్భంలో సీతారాం ఏచూరి నిష్క్రమించారు. రానున్న రోజులలో ఆయన లోటు పదే పదే తెలిసివస్తుంది. "ఈ దేశం గురించి బాగా అవగాహన ఉన్నవాడు, ఇండియా భావనకు రక్షకుడు" అని కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీ అర్పించిన నివాళిలో సీతారాం వ్యక్తిత్వంలోని వర్తమాన ప్రాసంగికతే ప్రతిబింబిస్తుంది. పదేళ్ల మితవాద, మతవాద ఉధృతిలో క్షీణతను, శిథిలతను ఎదుర్కొంటున్న క్లిష్ట సమయంలో, ఆమోదనీయత, వ్యవహారదక్షత కలిగిన సీతారాం వంటి నాయకుడు లేకపోవడం కమ్యూనిస్టు పార్టీలకు గట్టి దెబ్బ. మొన్నటి లోక్‌సభ ఎన్నికలలో మార్క్సిస్టు పార్టీ నాలుగే స్థానాలు గెలుచుకోగలిగినా, ఏచూరి పలుకుబడి అంతకు అనేక రెట్లు మించినది. ప్రతిపక్ష 'ఇండియా కూటమి' నిర్మాణంలో ఆయన పాత్ర కీలకమయినది. పాక్షికంగా అయినా, వామపక్షాలు కాంగ్రెస్‌తో ముందస్తు పొత్తుతో ఎన్నికలకు వెళ్లడం 2024లోనే మొదలు, అందులో ఏచూరి తిప్పిన చక్రం పెద్దది.

సీపీఎం ఆంతరంగిక రాజకీయాల చర్చకు ఇది సందర్భం కాదు కానీ, ప్రకాశ్ కారత్ సైద్ధాంతికతలో ఖచ్చితంగా ఉంటారని, సీతారాం ఏచూరి పట్టువిడుపులతో వ్యవహరిస్తారని పేరు. కానీ, విధాన పరమైన పట్టింపులు ఆయనకూ ఉండేవి. జ్యోతిబసును ప్రధాని కాకుండా అడ్డుకోవడం వంటి సందర్భాలలో కారత్ దీ, ఏచూరిదీ ఒకే పట్టు. 1996 నుంచి కాంగ్రెస్‌తో కూడిన సంకీర్ణ ప్రభుత్వాల ఏర్పాటులో సీపీఎం అగ్రనేతలు ముఖ్యపాత్ర వహించారు కానీ, నేరుగా పొత్తులు ఉండేవి కావు. కాంగ్రెస్‌తో కలసి పనిచేసే విషయంలో కారత్ గట్టి వ్యతిరేకత చూపేవారు, 2019 సాధారణ ఎన్నికలకు ముందు పొత్తు అవకాశాలను అడ్డుకున్నారు కూడా. అమెరికాతో అణు ఒప్పందం సందర్భంగా వామపక్షాలు మన్మోహన్ ప్రభుత్వం నుంచి వైదొలగిన సందర్భంలో, ఏచూరి వైఖరి వేరుగా ఉన్నదని, కేరళ యూనిట్ అండతో కారత్ ఆ నిర్ణయానికి కారకుడని భావించేవారు. ఏచూరి తీరులోని సౌమ్యత, సడలింపు ధోరణి ఆయనకు అన్ని పార్టీలలో మిత్రులను సంపాదించి పెట్టింది. ఇటీవలి కాలంలో రాహుల్ గాంధీకి ఆయన స్నేహం పెరిగింది. వారిద్దరూ అనేక విషయాల మీద సుదీర్ఘంగా చర్చించుకునేవారు.

సీపీఎంలో పుట్టి పెరిగి ఆ పార్టీకి ప్రధాన కార్యదర్శి అయినవారు ప్రకాశ్ కారత్, సీతారాం ఏచూరి. ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ చీలిపోయిన తరువాత, పద్నాలుగేళ్ల పాటు పుచ్చలపల్లి సుందరయ్య మార్క్సిస్టు పార్టీకి ప్రధానకార్యదర్శిగా ఉన్నారు. ఆ పదవిలోకి వచ్చిన రెండో తెలుగు వ్యక్తి సీతారాం. 1977లో జెఎన్‌యు విద్యార్థి సంఘానికి అధ్యక్షుడిగా ఎస్ఎఫ్ఐ తరఫున ఎన్నికైన ఏచూరి, ఓడిపోయి కూడా యూనివర్సిటీ చాన్సలర్ పదవికి రాజీనామా చేయని ఇందిరాగాంధీని నిలదీయడంతో జాతీయస్థాయి ప్రసిద్ధి పొందారు. సోషలిస్టు శిబిరం విచ్ఛిన్నమై, నూతనార్థిక విధానాలు, మతతత్వ రాజకీయాల జమిలి ప్రవేశం జరిగిన 1990 దశకారంభంలో ఆయన పార్టీ పోలిట్ బ్యూరో సభ్యుడిగా ఎన్నికయ్యారు. పార్లమెంటరీ కమ్యూనిస్టు పార్టీలలో సైద్ధాంతిక పోరాటం వెనుకపట్టుపట్టి, మనుగడ కోసం తడుముకోవలసిన దశలో నాయకత్వంలోకి వచ్చిన యువకుడు ఏచూరి. మారుతున్న ప్రపంచంతో మెలగడానికి కొత్త పద్ధతులు వెదుక్కుని తన స్థానాన్ని స్థిరపరుచుకున్న రాజకీయవాది ఆయన. 2005 నుంచి పన్నెండేళ్ల పాటు రాజ్యసభ సభ్యుడిగా ఉన్న సమయంలో చేసిన ప్రసంగాలు సీతారాం అధ్యయనానికి, అవగాహనకు అద్దం పట్టేవి.

నూతన ఆర్థిక విధానాలను తీవ్రంగా విమర్శించి, తామే పేదల ప్రయోజనాలను కాపాడగలిగేది అని చెప్పగలిగిన కమ్యూనిస్టులు, మతవాదుల ముందు మాత్రం క్రమంగా బలహీనపడుతూ వచ్చారు. మతతత్వ రాజకీయాలు కమ్యూనిస్టు పార్టీలను పునాదుల నుంచి పెకిలించే ప్రయత్నం చేస్తూ వచ్చాయి. కార్మికులు, కష్టజీవులు, రైతులు, రైతుకూలీలు అంటూ మాట్లాడిన కమ్యూనిస్టులకు, హిందువులు, ముస్లిములు, క్రైస్తవులు వంటి శ్రేణీకరణతో వ్యవహరించడం కష్టమైంది. ఆకర్షణ తగ్గి, అంకితభావం కలిగిన కార్యకర్తలు లేక, భావోద్వేగాలతో కలగలసిన మతవాదాన్ని ఎదుర్కొనలేక బలహీనపడుతున్న వామపక్షాలకు, పాలకపక్షాలలోనే మెరుగైనవారిని ఎన్నుకుని అండాదండా పొందవలసిన అగత్యం ఏర్పడింది. కమ్యూనిస్టుల మద్దతు పొందేవారికి కాసింత గౌరవం, మద్దతు ఇచ్చేవారికి నాలుగు సీట్లు, పరస్పర అవశ్యకతలుగా కొనసాగుతున్నాయి. ప్రస్తుత పరిస్థితులలో సమాజాన్ని తీవ్ర విభజనల పాలుచేసి, మతభావాల మాటున విపరీతమైన అధికారాన్ని సాధించి, నియంతృత్వాన్ని, వీలయితే ఫాసిజాన్ని స్థాపించాలనుకునే శక్తులను ఎదుర్కొనడానికి, ఈ దేశచరిత్ర గురించిన అవగాహన, భవిష్యత్ కార్యక్రమం గురించి ఆచరణాత్మకత కలగలసిన, సంకీర్ణ ప్రత్యామ్నాయాలు నిర్మించగలిగిన సీతారాం ఏచూరి వంటి నాయకులు ఎంతో అవసరం.

సమ్మిళితమే సుస్థిరం

మనం ఇప్పుడు ఒక చారిత్రక చౌరస్తాలో ఉన్నాం. క్లిష్టమైన పరివర్తన సమయమిది. ఆర్థికాభివృద్ధిని సుస్థిరంగా సాధించలేకపోవడమంటే పర్యావరణ విపత్తు దిశగా శీఘ్రగతిన వెళుతున్నట్టే; సమ న్యాయవిరుద్ధమైన పురోగతి మరింత పేదరికం, మరింత వెనుకబాటుతనం, మరింత సామాజిక ఆగ్రహావేశాలకు తప్పక లోనుచేస్తుంది. అందుబాటులో లేని అభివృద్ధి, మరింత స్పష్టంగా చెప్పాలంటే సమాజంలోని అన్ని వర్గాలకు సమరీతిలో సమకూరని అభివృద్ధి సుస్థిరమైనది కాదు, కాబోదు. కనుక సమ న్యాయ బద్ధమైన, సుస్థిరమైన అభివృద్ధి సాధనే మన భవిష్యత్తు నిర్మాణానికి దిక్సూచి కావాలి.


■ సునీతా నారాయణ్

మట్టివాసన

ఢిల్లీ వాయు కాలుష్యాన్నే పరిగణనలోకి తీసుకోండి. ఆ కాలుష్యాన్ని తగ్గించడంలో మన ప్రయత్నలోపం ఉందా? లేదు. బొగ్గు ఆధారిత విద్యుదుత్పాదక కేంద్రాలు అన్నిటినీ మూసివేశాం. పెట్ కోక్ (కార్బన్ సమృద్ధిగా ఉండే ఘన పదార్థం. కాలుష్య కారకమైనందువల్లే అమెరికా దీనిని ఎగుమతి చేస్తోంది) దిగుమతిని నిషేధించాం. స్వచ్ఛమైన ఇంధనాలు, నవీన వాహన సాంకేతికతలనే ఉపయోగించుకోవడానికి పూర్తి ప్రాధాన్యమిస్తున్నాం. ఇటువంటి చర్యల తరువాత కూడా కాలుష్య సంక్షోభాన్ని తగ్గించడంలో వెనుకబడే ఉన్నాం. ఢిల్లీలో వాయు కాలుష్యం గత మూడు సంవత్సరాలలో, అంతకు మునుపటి మూడు సంవత్సరాలతో పోలిస్తే 25 శాతం మేరకు తగ్గినట్టు నా సహచరులు అంచనా వేశారు. ఇంకా 65 శాతం మేరకు తగ్గిస్తేగానీ ఢిల్లీవాసులు నిర్మలమైన గాలిని పీల్చగల పరిస్థితి రాదు.

ఇందుకు కారణమేమిటో మరి చెప్పనవసరం లేదు. ఢిల్లీ వాసులలో 20 శాతం మంది కార్లలో తమ ఉద్యోగ కార్యాలయాలకు వెళుతుంటారు. ఇంచుమించు 25 శాతం మందికి సొంత కార్లు ఉన్నాయి. అయితే 90 శాతం రోడ్ స్థలాలు ఈ వాహనాల యజమానులకే ఉపయోగపడుతుంటాయి. 20 శాతం మంది అవసరాలను తీర్చడమే ఎక్కడలేని రద్దీ, కాలుష్యానికి కారణమవుతుంటే నగరవాసులు అందరికీ స్వచ్ఛమైన ఉపరితల స్థలాలు, నిర్మలమైన వాయు తలాలను సమకూర్చడం ఎలా సాధ్యమవుతుంది? ఇటువంటి విపత్కర పరిస్థితుల కారణంగానే పేదల పర్యావరణ ఉద్యమాలు ప్రజ్వరిల్లుతున్నాయి.

వాస్తవమేమిటంటే సంపన్నులూ స్వచ్ఛమైన గాలిని పీల్చవలసి ఉంది. అందరికీ నిర్మలమైన గాలి లభించేలా చేసేందుకు నగర ప్రజల చలనశీలత (మొబిలిటీ) తీరుతెన్నులను మార్చివేయవలసి ఉన్నది. అదనంగా మరికొన్ని బస్సులు, ట్రామ్‌లు, మెట్రోలను చేర్చడం వల్లే ఆ మార్పులు సిద్ధించవు. పేదలు, ధనికులకు అనుకూలంగా ఉండే చలనశీలత వ్యవస్థలను అభివృద్ధిపరచవలసి ఉన్నది. సదరు సదుపాయాలు అందరికీ అందుబాటులో ఉండాలి. అవి సౌకర్యవంతంగా ఉంటూ భద్రతనివ్వాలి.



ప్రగతి ఫలాలు అందరికీ సమరీతిలో లభ్యం కాని పరిస్థితుల్లో సుస్థిరాభివృద్ధి సాధ్యం కాదు. సమస్త ప్రజలకు అందుబాటులో ఉండే సమ్మిళిత వృద్ధి మాత్రమే సుస్థిరమైనది.

మన దేశంలో ఇప్పటికీ చాలా చాలా కుటుంబాలు ఆహారం వండుకోవడానికి ఎండుకట్టెలు, పిడకలు మొదలైన వాటినే ఉపయోగిస్తున్నారు. పేదరికమే ఇందుకు ప్రధాన కారణం. వాయు కాలుష్యానికి అవి ఎంతైనా కారణమవుతున్నాయి. ఆ కాలుష్యం పేదలను అనారోగ్యం పాలు చేస్తోంది. మరి పేదలు, ధనికులు ఒకే వాయు ఆవరణంలో ఉంటున్నారన్న వాస్తవాన్ని విస్మరించకూడదు. మనం పీల్చే గాలిని నిర్మలం చేయాలంటే సంపన్నులు కాలుష్యకారక వాహనాలను త్యజించేలా చేయాలి. అలాగే పేద కుటుంబాలు కాలుష్యకారక ఇంధనాలకు స్వస్తి చెప్పేలా చేయాలి. నిర్మలమైన గాలికి ఈ ఇంధన పరివర్తన ఎంతైనా అవసరం. మరి సమ్మిళిత అభివృద్ధి లేకుండా సుస్థిరాభివృద్ధి అనేది అసాధ్యం.

నిరంతరాయ అభివృద్ధి సాధించాలంటే పేద మహిళల అవసరాలు తీర్చడానికి ప్రాధాన్యమివ్వాలి. శిలాజేతర మలిన ఇంధనాలకు బదులుగా శిలాజేతర స్వచ్ఛ ఇంధనాలను ఉపయోగించుకునే అవకాశాలను వారికి సమృద్ధిగా కల్పించాలి. ఈ విషయంలోనే ప్రపంచానికి సమర్థ నాయకత్వం అవసరం. ఇంధన పరివర్తన విషయంలో పేదలకు అవకాశాలు సమృద్ధిగా సమకూర్చేందుకు పేద దేశాలకు ఇతోధిక ఆర్థిక సహాయం అందించాలి. ఢిల్లీ వాసులు ఎదుర్కొంటున్న వాయు కాలుష్యం భూతాపాన్నీ అధికం చేస్తోంది. వాతావరణ మార్పును నిరోధించడంపై ప్రపంచ దేశాల మధ్య ఒప్పందం నిష్పాక్షికంగా, న్యాయబద్ధంగా లేనిపక్షంలో భూతాపాన్ని తగ్గించడం సాధ్యం కాదని 1990లో నేనూ, నా సహచరుడు అనిల్ అగర్వాల్ 'గ్లోబల్ వార్మింగ్ ఇన్ అన్‌ఈక్వల్ వరల్డ్' అన్న మా రచనలో వాదించాం. ఆ సమస్య అలానే ఉన్నది కనుక మా వాదన ఇప్పటికీ సహేతుకమైనదే. వాతావరణ మార్పుకు పరిష్కారాలు అందరి అవసరాలను తీర్చగలిగేవిగా ఉండాలి. లేనిపక్షంలో అవి సఫలమవవు.

వాతావరణ వైపరీత్యాలను నియంత్రించడం కష్టసాధ్యమవుతోంది. ప్రతీ సంవత్సరమూ అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మరుసటి ఏడాది అంతకు మించిన ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. అటవీ దావానలాలు పెరుగుతున్నాయి. మరణాంతక చలిగాడ్పులు, వేడి గాడ్పులు అంతకంతకూ అధికమవుతున్నాయి. వీటన్నిటికీ మించి ఒక భయానక వాస్తవాన్ని మనం ఎదుర్కొంటున్నాం. 2030 సంవత్సరం నాటికి భూతాపం 1.5 డిగ్రీ సెంటీగ్రేడ్‌కు మించకూడదు. మరి ఇందుకు భూతాపాన్ని అదుపుచేసే కాలుష్యకారక ఉద్గారాలను శీఘ్రగతిన తగ్గించవలసిన అవసరమున్నది. మనుగడకు అవసరమైన ప్రాథమిక ఇంధన అవసరాలు తీరని ప్రజలు కోట్ల సంఖ్యలో ఉన్నారు. వారి అభ్యున్నతికి స్వచ్ఛమైన ఇంధనాలు సమకూర్చాలి. కాలుష్యకారక హరిత గృహ వాయువుల ఉద్గారాలు సాధ్యమైనంతవరకు తక్కువ స్థాయిలో ఉండే ఆర్థిక వ్యవస్థలను అభివృద్ధి పరచుకోవలసిన అవసరమున్నది. ప్రాకృతిక విపత్తులు తరచు సంభవిస్తున్నాయి. వాటి తీవ్రత సైతం అధికంగా ఉంటోంది. వాతావరణ మార్పు విషమ పర్యవసానాల వల్లే ఇది జరుగుతోంది. దీనివల్ల పేదలు నిరుపేదలవుతున్నారు. వారి జీవితాలు పలు విధాల ఛిద్రమవుతున్నాయి. ప్రపంచ దేశాలు అన్నీ పరస్పర ఆధారితాలుగా ఉన్నాయి. ఎడతెగని ప్రాకృతిక విపత్తులతో జీవన భద్రత కోల్పోతున్నవారు ప్రత్యామ్నాయ జీవనాధారాలకు సుదూర ప్రాంతాలు, దేశాలకు వలస వెళ్లడం అనివార్యమవుతోంది. వలసలు పెరుగుతున్నకొద్దీ వాటిని అడ్డుకోవడమూ తీవ్రమవుతోంది. ఫలితంగా అభద్రతా భావజనితమైన హింసాకాండ ప్రజ్వరిల్లుతోంది.

ఇదొక విధ్వంసక విషవలయం దీన్ని మనం రూపుమాపాలి. విశ్వీకరణ అయిన ప్రస్తుత ప్రపంచంలో అన్ని దేశాలు అనివార్యంగా పరస్పరాధారితమై ఉన్నాయి. ఈ వాస్తవాన్ని మనం గుర్తించి తీరాలి. ప్రగతి ఫలాలు అందరికీ సమరీతిలో లభ్యం కాని పరిస్థితుల్లో సుస్థిరాభివృద్ధి సాధ్యం కాదు. సమస్త ప్రజలకు అందుబాటులో ఉండే సమ్మిళిత వృద్ధి మాత్రమే సుస్థిరమైనది. పర్యావరణ విపత్తు కేవలం అధునాతన సాంకేతికతల మూలంగా కాక, రాజకీయ స్వార్థాలు, ఉదాసీనతల వల్లే సంభవిస్తున్నాయనే వాస్తవాన్ని గుర్తించి, అందుకు అనుగుణంగా పరిష్కారాలను రూపొందించి అమలుపరచనంతవరకు సుస్థిరాభివృద్ధి సిద్ధించదు. సమన్యాయ, హక్కుల రాజకీయాలను నిరర్థకం చేస్తూ పర్యావరణ భద్రత, సుస్థిరాభివృద్ధిని ఆశించడం వల్ల ప్రయోజనమేముంది?

('సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్' డైరెక్టర్ జనరల్, 'డౌన్ టు ఎర్త్' సంపాదకురాలు)

మీ పిల్లలకు 'చందమామ' ఇస్తున్నారా?

ఒక అందమైన కానుకను అందుకున్నాను. రమణీయంగా రూపొందించిన, 'సమయ్ పోస్ట్' నుంచి అందిన బంగీ అది. అందులో 14 పుస్తకాలు ఉన్నాయి. 'లోకపు భాగ్య విధాతలు' అయిన బాలల కోసం గుల్జార్ రాసిన కథల పుస్తకాలు అవి. రమ్యమైన బొమ్మలతో అలెన్ షా ఆ కథలకు వన్నెలద్దాడు. జీవన సౌందర్యాన్ని, మూగ వేదనను అనితరసాధ్యంగా తన పాటలలో వర్ణించే, పలికించే కవి గుల్జార్ మన ప్రశస్త బాల సాహిత్య సృజనకారులలో ఒకరని ఎంతమందికి తెలుసు? బహుశా చాలా మందికి తెలియదు.



బాలలకోసం 'సమయ్ పోస్ట్' గతంలో ప్రచురించిన పుస్తకాలు కూడా నన్ను సమ్ముగ్ధం చేశాయి. పెద్ద బొమ్మల పుస్తకాలు, పోస్టర్లు, కవితలు ఉన్న కార్డులు, కథల పుస్తకాలు, చిన్న నవలలతో పాటు ప్లూటో, సైకిల్ అనే బాలల పత్రికలను కూడా ఆ సంస్థ ప్రచురిస్తోంది. న్యూఢిల్లీలో ఈ ఏడాది ఆరంభంలో జరిగిన వరల్డ్ బుక్ ఫెయిర్‌లో అవన్నీ అశేష బాల బాలికలు, వారి తల్లిదండ్రులను విశేషంగా ఆకట్టుకున్నాయి. మేమూ (నా భార్య, నేను) అబ్బురపడ్డాము. అవును, బాల సాహిత్య వికాసం మమ్ములను ముగ్ధులను చేసింది. అప్పటికీ ఇప్పటికీ ఎంత తేడా!.

మా పిల్లల బాల్యంలో హిందీ బాల సాహిత్య పుస్తకాలు, నా చిన్నతనంలో మేము చదివిన (బొమ్మల కంటే కథనాలు అధికంగా, ప్రధానంగా ఉండే) అక్బర్ – బీర్బల్, చాచా చౌదరి, తెనాలి రామ, పంచతంత్ర, వెటల్ లేదా అమర్ చిత్ర కథ లాంటి కామిక్స్ కంటే కొద్దిగా, అతికొద్దిగా మాత్రమే మెరుగ్గా ఉండేవి. అప్పుడప్పుడూ తళతళలాడుతుండే అందమైన సోవియట్ పుస్తకాలు లభించినప్పుడు మేము ఎంతగా ఆనందభరితులయ్యేవాళ్లమో! సరే, చందమామ, చంపక్, పరాగ్, లాట్ పాట్ లాంటి మేగజైన్లను విధిగా చదువుతుండేవాళ్లం.

కమలా భాసిన్ రాసిన 'మలు భలు'ను మా పిల్లలు అమితంగా ఇష్టపడేవారు. రాత్రిపూట పడుకునే ముందు వారు ఆ కథలను వినడానికి చెవి కోసుకునేవారు. మనోరంజకమైన మహారాష్ట్ర జానపద గాథ ఆధారంగా తూలికా బుక్స్ వారు ప్రచురించిన 'ఇక్కి డొక్కి', కరాడి కథల ఆడియో బుక్స్ వారికి బాగా నచ్చేవి. వివిధ భారతీయ భాషలలోని కథలు కథ బుక్స్ ద్వారా వారిని అలరించేవి. అయినా మేము కొత్త పుస్తకాల కోసం అన్వేషిస్తుండేవాళ్లం. ఈ సందర్భంగా ఒక విషయాన్ని తప్పక చెప్పవలసి ఉంది. మన దేశంలో ప్రచురితమయిన పిల్లల పుస్తకాలలో కథా కథనం, బొమ్మలు, ముద్రణ ప్రమాణాలు ఐరోపా, అమెరికా నుంచి వచ్చే పుస్తకాలతో పోల్చలేనివిగా ఉండేవి. ప్రతి విషయంలోను మన పుస్తకాల నాణ్యత నాసిరకంగా ఉండేదని చెప్పక తప్పదు.

ఇది చాలా శోచనీయమైన విషయం. ఎందుకంటే మనకు సమున్నతమైన మౌఖిక, లిఖితపూర్వక కల్పనా కథల, పురా గాథల, కథన కౌశల్య వారసత్వం ఉన్నది. అయినా మన పుస్తకాలు జూలియా డొనాల్డ్ సన్ రాసిన 'ది గ్రఫెలో' తదితర పుస్తకాలకు ఏ మాత్రం సాటిరావు కదా. ఈ సాంస్కృతిక పోరాటంలో హ్యారీ పాటర్ మనలను పూర్తిగా చిత్తు చేసింది. బంగారు కోటలో ఫెలూదా సాహసాలను హాగ్వార్ట్స్‌లోని మంత్ర తంత్రాలు వెనక్కి నెట్టివేశాయి. బాల సాహిత్య గుణ విశేషాలు జాతి జీవన శీలానికి ప్రమాణం అయితే ఆ రీత్యా మన సాహిత్య సృజనాత్మక ప్రస్థానం ప్రశస్తంగా లేదని చెప్పక తప్పదు.

> **బాలల జనాభా రీత్యా చూస్తే పిల్లల పుస్తకాల ప్రచురణ, వినియోగం చాలా తక్కువగా ఉన్నాయి. దేశంలో ప్రచురణ అవుతున్న మొత్తం పుస్తకాలలో బాలల పుస్తకాలు ఒక శాతం మాత్రమే. సుప్రసిద్ధ రచయితలు తప్పకుండా పిల్లల కోసం ఎక్కువగా రాయాలి. ప్రచురణకు ప్రైవేట్ వ్యక్తులు ఉదారంగా తోడ్పడాలి. తద్వారా నాణ్యమైన పుస్తకాలు రావడానికి భరోసా ఉంటుంది.**

రెండు నెలల క్రితం నేను చెన్నైలోని తూలికా బుక్స్ కార్యాలయానికి వెళ్లాను బాల సాహిత్యంలో కొత్త పుంతలకు దోహదం చేసిన సంస్థ అది. బాల సాహిత్యం తీరుతెన్నులలో గుణాత్మకమైన మార్పు వచ్చిందో లేదో తెలుసుకోవడానికే నేను అక్కడకు వెళ్లాను. మార్పులు వచ్చాయి, సందేహం లేదు. ఇక్కిడొక్కి లాంటి తొలి ప్రచురణల సాఫల్య స్ఫూర్తితో తూలికా బుక్స్ తొమ్మిది భారతీయ భాషలలో వందలాది కొత్త పుస్తకాలను ప్రచురించింది, ఇంకా ప్రచురిస్తోంది. భారతీయ బాల సాహిత్యంలో వచ్చిన, వస్తోన్న మార్పులను తూలికా బుక్స్ వ్యవస్థాపకురాలు రాధికా మీనన్ వివరించారు. చెప్పవలసిన విషయమేమిటంటే ఆ మార్పులు ప్రధానంగా ఆంగ్లంలో ప్రచురితమవుతోన్న బాల సాహిత్యంలో మాత్రమే. భారతీయ విలువలు, వాస్తవికతను ప్రతిబింబిస్తూ నూతనత్వం ఉట్టి పడుతున్న ప్రాయోగిక బాల సాహిత్య పుస్తకాలను కొన్ని గ్లోబల్ సంస్థలతో పాటు ఏక్ తార, ఏకలవ్య, ప్రథమ్, కథ, కరాడి టేల్స్, తార, పికెల్ యోక్, డక్ బిల్, టాకింగ్ క్లబ్ మొదలైన చిన్న, స్వతంత్ర సంస్థలు కూడా ప్రచురిస్తున్నాయి.


■ యోగేంద్ర యాదవ్

శైలజా మీనన్, సంధ్యారావు సంపాదకత్వంలో వెలువడిన 'Children Books : An Indian Story' అన్న పుస్తకం ఆ కొత్త ధోరణులను విపులంగా వివరించింది, నిశితంగా విశ్లేషించింది. గత మూడు దశాబ్దాలలో బాల సాహిత్యం సర్వతోముఖంగా విస్తరించింది. రచయితల, చిత్రకారుల, ప్రచురణకర్తల సంఖ్య గణనీయంగా పెరిగింది. పాఠకులూ పెరిగారు. పాఠ్య పుస్తకాలే కాకుండా ఇతర పుస్తకాలనూ కొనగల, చదివే అభిరుచి ఉన్నవారి సంఖ్య పెరుగుతోంది. అలాగే గ్రాఫిక్ నవలలు సహా పలు సాహిత్య ప్రక్రియలలో బాల సాహిత్యం వికసిస్తోంది. పుస్తకాల రూపకల్పన, అనువాదం, ముద్రణలో ప్రమాణాల మెరుగుదల స్పష్టంగా కనిపిస్తోంది. ఇదే సమయంలో భారతీయ బాలల జనాభా రీత్యా చూస్తే పిల్లల పుస్తకాల ప్రచురణ, వినియోగం వాస్తవ అవసరాల కంటే చాలా చాలా తక్కువగా ఉన్నాయని శైలజా మీనన్, సంధ్యారావు స్పష్టం చేశారు. భారతదేశంలో ప్రచురణ అవుతున్న మొత్తం పుస్తకాలలో (పాఠ్యగ్రంథాలేతర) బాలల పుస్తకాలు కేవలం 1 శాతం మాత్రమే. వాటి ప్రచురణ కర్తలు, వినియోగదారులు ఇప్పటికీ చాలవరకు 'మధ్య', 'ఉన్నత' కులాల పట్టణ భారతీయులే.

బాల సాహిత్య జగత్తులో పురోగతి అనేది ఇంగ్లీష్ పుస్తకాలకే పరిమితమైనది. హిందీ ఒక పాక్షిక మినహాయింపు. ఏక్ తార, ఏకలవ్య (చంపక్ మ్యాగజైన్ ప్రచురణకర్త)లు కల్పనా సాహిత్యం, బొమ్మల పుస్తకాలను విరివిగా ప్రచురిస్తున్నాయి. వివిధ భారతీయ భాషలలో తాము ప్రచురిస్తున్న పుస్తకాలలో భాగంగా ప్రథమ్ బుక్స్, కథ, తూలిక మంచి హిందీ పుస్తకాలను అందిస్తున్నాయి. ఇతర భారతీయ భాషలలో గొప్ప బాలసాహిత్య వారసత్వం (గుజరాతీలో గిజూ భాయి బధేకా), ప్రముఖ రచయితలు (బెంగాలీలో సుకుమార్ రే), బాల సాహిత్యోద్యమాలు (కేరళలో కెఎస్ఎస్‌పి) ఉన్నా వర్తమాన బాల సాహిత్య పరిస్థితులు మెరుగ్గా లేవు. స్నేహితులు చెప్పిన దాని ప్రకారం నేనీ అభిప్రాయాన్ని వ్యక్తం చేశాను. ఇది తప్పయితే నేను అమితంగా సంతోషిస్తాను. మొత్తం మీద ఆంగ్లేతర భారతీయ భాషలలో బాల సాహిత్య నవతరంగం చాలా బలహీనంగా ఉన్నదని చెప్పక తప్పదు.

నవ తరంగం అన్నానా? అవును, భారతీయ భాషల బాల సాహిత్యంలో ఆ కొత్త కెరటాన్ని ఒక సాంస్కృతిక ఉద్యమంగా సంఘటితం చేసుకోవల్సిన అవసరమున్నది భావి తరాల బాలలకు మంచి భవిష్యత్తును సమకూర్చేందుకు ఇది అత్యవసరం. ఇందుకు మీరు, నేను చేయాల్సిన నాలుగు పనులను కూడా పేర్కొంటాను. ఒకటి– తల్లిదండ్రులుగా మనం మన పిల్లలకు పుస్తకాలు కొనాలి. పుట్టినరోజు కానుకలుగా పుస్తకాలను ఇచ్చే అలవాటును పెంచుకోవాలి. భారతీయ పుస్తకాలను కొనుగోలు చేయడానికి ప్రాధాన్యమివ్వాలి. జాతీయవాద భావోద్వేగంతో నేనిది సూచించడం లేదు. తమ పరిసరాలను ప్రతిబింబించే కథలు చదవడానికి, బొమ్మలు చూడడానికి పిల్లలు బాగా ఇష్టపడతారు. కేవలం పుస్తకాలు కొనడంతోనే సరిపోదు. వాటిని పిల్లలకు చదివి వినిపించాలి. పిల్లలు స్వయంగా వాటిని చదివేలా ప్రోత్సహించాలి. వారు తమ 'మాతృభాష'లో పుస్తకాలు చదివేలా చూడాలి. మాతృభాషలో మాత్రమే పిల్లలు చక్కగా నేర్చుకోగలుగుతారు, గ్రహించగలుగుతారు.

రెండు– సుప్రసిద్ధ రచయితలు తప్పకుండా పిల్లల కోసం మరింత ఎక్కువగా రాయాలి. ఆ రచనలు ఉపదేశాత్మకంగా ఉండకూడదు. నిస్సందేహంగా మన కాలం మహోన్నత హిందీ రచయితలలో ఒకరైన వినోద్ కుమార్ శుక్లా తన దృష్టిని బాల సాహిత్య సృజనపై కేంద్రీకరించారు. ఇతర రచయితలు కూడా ఆయన్ని ఆదర్శంగా తీసుకోవాలి. మూడు– భారతీయ భాషలలో బాల సాహిత్య పుస్తకాల ప్రచురణకు 'పౌర సమాజం', ప్రైవేట్ వ్యక్తులు ఉదారంగా తోడ్పడాలి. తద్వారా మాత్రమే నాణ్యమైన పుస్తకాలు రావడానికి భరోసా ఉంటుంది. రచనలో శిక్షణకు కార్యగోష్ఠులు నిర్వహించాలి. రచయితలకు, చిత్రకారులకు ఆర్థిక తోడ్పాటు నందించాలి. సాహిత్య అకాడమీ ప్రశస్త బాల సాహిత్య రచనలకు ఒక పురస్కారాన్ని ఏర్పాటు చేసింది. భారతీయ భాషలలో బాల సాహిత్య రచయితలు, చిత్రకారులు, ఎడిటర్లు, ప్రచురణకర్తలను ప్రోత్సహించేందుకు పలు అవార్డులను నెలకొల్పాల్సిన అవసరం ఉన్నది తమ తమ మాతృభాషలకు ఎంతో ప్రాధాన్యమిచ్చే పంజాబీ, తెలుగు, తమిళ్, బెంగాలీ ప్రవాసులు ఈ విషయంపై శ్రద్ధ చూపాలి.

నాలుగు– ప్రభుత్వాలు పౌర గ్రంథాలయాలకు నిధులు సమృద్ధిగా సమకూర్చి బాల సాహిత్య పుస్తకాలు పెద్ద ఎత్తున కొనుగోలు చేసేందుకు దోహదం చేయాలి. కర్ణాటకలో గ్రామీణ పౌర గ్రంథాలయాల పునర్జాగృతికి అనుసరిస్తున్న కార్యక్రమాన్ని ఇతర రాష్ట్రాలలో ముఖ్యంగా హిందీ రాష్ట్రాలలో ఆదర్శంగా తీసుకుని పౌర గ్రంథాలయాల సంస్కృతిని పెంపొందించాలి.

ఉచిత పాఠ్య పుస్తకాలకు చేస్తున్న వ్యయంలో స్వల్ప మొత్తాన్ని కన్నులపండువైన, ఆనందకరమైన బాల సాహిత్య పుస్తకాలను పాఠశాల గ్రంథాలయాలకు, అంగన్‌వాడీలకు పంపిణీ చేసేందుకు వినియోగిస్తే 'లోకపు భాగ్య విధాతలు' మరింత విజ్ఞానవంతులుగా, శేముషీసంపన్నులుగా వికసిస్తారు.

(వ్యాసకర్త 'స్వరాజ్ ఇండియా' అధ్యక్షుడు)

వరద శాపానికి కేంద్రం సత్వర సాయమే వరం!

నింగిని, నేలను ఏకం చేస్తూ కురిసిన వర్షాలకు వచ్చిన వరదలతో ఆంధ్రప్రదేశ్ పీకల్లోతు కష్టాల్లో కూరుకుపోయింది. జనం జీవితాలు తలకిందులయ్యాయి. వరదల విధ్వంస తీవ్రత మాటలకు అందనిది. నీట మునిగిన ఇళ్లు, పొలాలను తలచుకుంటేనే బాధితుల గుండెలవిసిపోతున్నాయి. బుడమేరు వరద ప్రభావం ప్రధానంగా విజయవాడ నగరంపైనే ఉంది. పది రోజులపాటు ముంపునీటిలోనే చాలా కాలనీలు తేలియాడాయి. సింగ్‌నగర్, కృష్ణా హోటల్ సెంటర్, వాంబే కాలనీ, న్యూ రాజరాజేశ్వరిపేట, పాయకాపురం, ప్రశాంతినగర్, సుందరయ్యనగర్, కండ్రిక, రాజీవ్‌నగర్, జక్కంపూడి కాలనీ, అంబాపురం తదితర ప్రాంతవాసులు జలదిగ్బంధంలో చిక్కుకున్నారు. వారి ఇళ్లు, బిల్డింగ్‌లు పాక్షికంగా లేదా పూర్తిగా దెబ్బతినడంతో పాటు కట్టుబట్టలతో నిరాశ్రయులయ్యారు. రెక్కాడితే కానీ డొక్కాడని పేదలు, చిన్నాచితకా ఉద్యోగ, వ్యాపారాలతో బతుకు బండిని నెట్టుకొచ్చే మధ్యతరగతి ప్రజలు, చిన్న సన్నకారు రైతులు దారుణంగా దెబ్బతిన్నారు. ఇళ్లలో సామాగ్రి పూర్తిగా నాశనమైంది. దుస్తుల నుంచి గృహోపకరణాల వరకు నీట మునిగిపోయాయి. వంట సామాన్లు, గ్యాస్ స్టౌవ్‌లు నీటితో నిండిపోయాయి. పిల్లల పుస్తకాలు, సర్టిఫికెట్లు వరదపాలయ్యాయి. ద్విచక్ర వాహనాలు వరద నీటిలో కొట్టుకుపోయాయి. కొన్ని బురదలో కూరుకుపోయాయి. ఒక్కో ఇంటికి కనీసం లక్ష రూపాయల నుంచి రెండు లక్షల వరకు ఆర్థిక నష్టం జరిగినట్లు సమాచారం. వరదలతో చిన్న పరిశ్రమలు చితికిపోయాయి. యంత్రాలు నీట మునిగి దెబ్బతిన్నాయి. ముంపు ప్రాంతాల్లో చిన్న పరిశ్రమలపై చాలా మంది ఆధారపడి జీవిస్తున్నారు. దీనివల్ల యజమానులకు ఆర్థిక నష్టంతో పాటు కూలీల జీవనోపాధికి గండి పడింది. సింగ్‌నగర్ పరిసర ప్రాంతాల్లో దుకాణాలు, ఫ్యాన్సీ షాపులు నడుపుకునే వారికీ నష్టం వాటిల్లింది. వారి దుకాణాలను వరద నీరు ముంచెత్తడంతో విలువైన సరుకులు నీటమునిగాయి.



ఏపీలో వరదనష్టాన్ని అంచనా వేసేందుకు ప్రత్యేక బృందాన్ని పంపించాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు విజ్ఞప్తికి కేంద్రం వేగంగా స్పందించింది. రాష్ట్రంలో పర్యటించిన కేంద్ర బృందం– జనం కడగండ్లను ప్రత్యక్షంగా పరిశీలించింది. మళ్లీ రెండు రోజుల పాటు వరద ప్రభావిత ప్రాంతాల్లో కేంద్ర బృందం పర్యటించి నష్టం అంచనా వెయ్యడానికి మరోసారి రాష్ట్రానికి వచ్చింది. ప్రభుత్వ ప్రభుత్వేతర సంస్థలు, పార్టీలు, వ్యక్తులు, మానవతావాదులు వరద ప్రాంత ప్రజలకు సహాయ చర్యలు చేపడుతున్నారు. వేల కోట్ల ఆస్తి నష్టం జరిగినట్లు కేంద్ర ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి. కాబట్టి రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని పరిగణనలోకి తీసుకొని కేంద్ర ప్రభుత్వం నిబంధనలు, నివేదికల పేరిట ఆలస్యం చెయ్యకుండా సత్వరం ఆర్థిక సాయం అందిస్తే వరద బాధితులకు వరం అవుతుంది.

విజయవాడలో అనేక ప్రాంతాల్లో నిలిచిన వరద నీటికి లక్షలాది మంది నిర్వాసితులు కాగా, అపార నష్టం వాటిల్లింది. రోడ్లు, మౌలిక సదుపాయాలూ దెబ్బతిన్నాయి. పంటల నష్టం జరిగి రైతులు నిండా మునిగిపోయారు. దెబ్బతిన్న మౌలిక వసతుల్ని బాగు చెయ్యడం, చిట్టచివరి వ్యక్తికి కూడా సాయం అందేలా చూడడం, జన జీవనం, ఉపాధి కార్యక్రమాలు తిరిగి మామూలు పరిస్థితికి వచ్చేలా తోడ్పాటు అందించాలి. వీటన్నిటికీ నిధులు అవసరం. కాబట్టి కేంద్రం సత్వరం సాయం అందించాల్సి ఉంది. విపత్తు తీవ్రత దృష్ట్యా దీనిని జాతీయ విపత్తుగా ప్రకటించాలి. రాష్ట్ర విభజన తర్వాత రాష్ట్రం ఎదుర్కొంటున్న అతి పెద్ద విపత్తు ఇదే. వరద సహాయం అందించడంపై కేంద్ర ప్రభుత్వం ఉదారంగా వ్యవహరించాలి. కేంద్ర మంత్రులు, బృందాలు పర్యటించినా ఇప్పటివరకు తక్షణ సహాయం ప్రకటించ లేదు. గత పది రోజులుగా వరద ప్రాంతాల్లో ప్రజలు నరకయాతన పడుతున్నారు. తక్షణ సహాయంతో పాటు వరద ముంపు నుంచి శాశ్వత నివారణ చర్యలపై కేంద్రప్రభుత్వం దృష్టి పెట్టాలి. ప్రజల ఆవేదనను అర్థం చేసుకొని కేంద్రం వేగంగా ఆర్థిక సహాయం అందించాలి. వరద బాధితుల సమస్యలు పరిష్కరించాలి. దెబ్బతిన్న వాహనాలకు ఇన్సూరెన్స్ చెల్లింపు విషయంపై స్పష్టమైన ఆదేశాలివ్వాలి.

పెట్టుబడులను కోల్పోయిన రైతులకు ఉదారంగా సాయం చెయ్యడం కేంద్ర ప్రభుత్వ బాధ్యత. అరకొర నిధులు విడుదల చేసి చేతులు దులుపుకోకుండా, కేంద్ర ప్రభుత్వం మానవీయంగా వ్యవహరించాలి. నిబంధనలతో ముడిపెట్టకుండా సత్వరం నిధులు విడుదల చేస్తే ప్రకృతి వైపరీత్యాలకు తల్లడిల్లుతున్న రాష్ట్రాలు త్వరితగతిన కోలుకుంటాయి.

• నీరుకొండ ప్రసాద్

ఆత్రేయత్వంలో ఇబ్సెన్ ఛాయలు

ఆత్రేయ పాటల్ని జనం ఇష్టపడితే, నాటక ప్రక్రియను ఆయన ఇష్టపడ్డారు. విద్యార్థి దశ నుంచే రంగస్థలం మీద నటునిగా, నాటికల రచయితగా రాణించిన ఆత్రేయ, అనంతర కాలంలో ఆధునికాంధ్ర వచన నాటకశిల్పిగా ప్రసిద్ధులయ్యారు. అయినా నాటకరంగాన్ని విడిచిపెట్టి సినిమా రంగంలో స్థిరపడి చివరి వరకు అక్కడే కొనసాగడానికి కారణం... సినిమా అనితరసాధ్యమైన ప్రభావం, ప్రాచుర్యం కలిగిన మాధ్యమం కావడమే.

లభ్యమవుతున్న ఆత్రేయ నాటకాలు 10, నాటికలు 15 మాత్రమే. నాటకాల రచనా కాలాన్ని బట్టి వరసగా– గౌతమ బుద్ధ, అశోక సమ్రాట్, పరివర్తన, వాస్తవం, ఈనాడు, ఎన్.జి.ఓ, విశ్వశాంతి, కప్పలు, భయం, మనసు–వయసు (తిరుపతి) అనేవి. నాటికలు– అశ్వఘోషుడు, మాయ, కాపలావాని దీపం, ప్రగతి, వరప్రసాదం, చావకూడదు, కళ కోసం, చస్తే ఏం, ఆత్మార్పణ, అంత్యార్పణ, ఓటు నీకే, అంతర్యుద్ధం, ఎవరు దొంగ, ఒక్క రూపాయి, తెరచిన కళ్లు అనేవి. వీటిని ఆత్రేయ మరణానంతరం 'మనస్విని' ట్రస్ట్ మద్రాసు వారు ప్రముఖ నటులు డా. కొంగర జగ్గయ్య సంపాదకత్వంలో 'ఆత్రేయ సాహితి' పేరుతో ప్రచురించారు. ఇది మొత్తం ఏడు సంపుటాలు కాగా, మూడు సంపుటాలను నాటక సాహిత్యం కోసం కేటాయించారు. ఆత్రేయ సాహితి నాటక విభాగానికి అట్ట వెనుక మాటలు రాసిన జగ్గయ్య "తెలుగు నాటకాన్ని మరో మలుపు తిప్పి కొత్త ఒరవళ్లు దిద్దిన ఆచార్యులు ఆత్రేయ. మధ్యతరగతి జీవితాల అంతర్మథనానికి అద్దం పట్టిన 'ఆంధ్రా ఇబ్సెన్' అన్నారు. హెన్రిక్ ఇబ్సెన్ నార్వే దేశస్థుడు. 'ఎనిమీ ఆఫ్ ది పీపుల్', 'ఏ డాల్స్ హౌస్' మొదలైన సంచలనాత్మక స్వాభావికవాద నాటకాలను రచించాడు. ఇబ్సెన్ నాటకాలు ప్రపంచవ్యాప్తంగా అన్ని భాషలలోనూ అనువదితమయ్యాయి, అనుసరించబడ్డాయి. ఇబ్సెన్ రచనల్ని తెలుగులో ఇతర నాటక రచయితల్లా ఆత్రేయ వినియోగించుకోలేదు. కానీ, తన నాటకాల్లో స్వాభావికవాదానికి పెద్దపీట వేశారు. పౌరాణిక నాటకాలు, పద్యనాటకాలు, సంస్కరణాత్మక నాటకాలు రాజ్యమేలుతున్న నలభయ్యవ దశకంలో ఆత్రేయ సామాజిక స్పృహ గల వచన నాటకాల్ని రాసి అర్వాచీన అభ్యుదయ నాటక రచనలకు మార్గదర్శకులయ్యారు. ఆత్రేయ నాటకాల ప్రత్యేకత ఏమిటి? అంత గొప్పవా ఆత్రేయ నాటకాలు అనేవి సాధారణంగా సామాన్యుడికి కలిగే సందేహాలు. వాటికి ఆత్రేయ ఒక నాటికలో సమాధానం ఇచ్చారు. ఆ నాటిక పేరు– ఒక రూపాయి. నలుగురు నిరుద్యోగులు ఒక్క రూపాయి సంపాదిస్తే తాత్కాలికంగా సమస్య చల్లారుతుందని, అది సంపాదించడం కోసం చేసే ప్రయత్నం ఆ నాటిక ఇతివృత్తం. ఆ నలుగురు మిత్రుల్లో జగ్గు అనే కుర్రాడు– 'ఒరేయ్ వేణూ, నువ్వు ఆత్రేయ నాటకాలు కాని చదివావేమిట్రా? అయినదానికీ కానిదానికీ చస్తా చస్తానంటావేమిట్రా?' అంటాడు. దానికి వేణు చెప్పిన సమాధానం ఇది– "ఆ మాట అనడానికి ఆత్రేయ కావాలా ఏమిటి? మనం రోజుకు పదిసార్లు అనేది, అనుకొనేదే రాశాడు. ఆయన గొప్పతనం ఏమీ లేదు" అని. అవును ఆత్రేయ గొప్ప వస్తువులతో నాటకాలు రాయలేదు. సమకాలీన జీవితాలకు అద్దం పట్టారు– అంతే! సంస్కరణలూ నీతులూ అంటే నేల విడిచి సాము చెయ్యకుండా, నిత్యజీవన సమస్యల్ని, కలతలనూ, కన్నీళ్లనూ పరామర్శించి అశాంతితో అసంతృప్తితో వేగిపోతున్న ప్రజలకు సమాజం అడ్డుకోత పటాన్ని చూపించారు. గొంగళి పురుగుల్లా పిరికితనంతో ముడుచుకుపోతున్న మధ్యతరగతి మనస్తత్వాల్లో చైతన్యం రగిలించారు. మంచి నాటకాలు సామాజికుల చేత ఆలోచింపచెయ్యాలి కాని, తప్పనిసరిగా పరిష్కారాలకు నిర్దేశింపనవసరం లేదని ఆయన అభిప్రాయం. సాహిత్యానికి ముడి పదార్థం జీవితమనే మూలసూత్రం ఆధారంగా రచనలు చెయ్యడం వల్లనే ఆత్రేయ నాటక సాహిత్యం కాలానికి వెలిసిపోకుండా సజీవంగా నిలిచింది. ఆత్రేయ స్వాభావికవాద నాటకాలకు కప్పలు, ఎన్.జి.ఓ., భయం మొదలైన నాటకాలను, ఎవరు దొంగ, వరప్రసాదం మొదలైన నాటికలనూ ఉదాహరణలుగా పేర్కొనవచ్చు.

> **షేక్స్‌పియర్ ఇతరుల నుండి వెండిని గ్రహించి బదులుగా బంగారాన్ని ఇచ్చేవాడన్నట్టు– ఆత్రేయ వస్తువేదైనా దానిని సొంతం చేసుకొని తెలుగుతనాన్ని అద్దడం వల్లనే ఆయన అక్షరశిల్పి అనిపించుకున్నారు. ఆత్రేయ నాటకశిల్ప నైపుణ్యాన్ని ప్రశంసిస్తూ 'అనుకరణలైనా, అనుసృజనమైనా ఆత్రేయత్వం వాటి మూలసత్యం' అని సినారె అన్నారు.**



షేక్స్‌పియర్ ఇతరుల నుండి వెండిని గ్రహించి బదులుగా బంగారాన్ని ఇచ్చేవాడన్నట్టు– ఆత్రేయ వస్తువేదైనా దానిని సొంతం చేసుకొని తెలుగుతనాన్ని అద్దడం వల్లనే ఆయన అక్షరశిల్పి అనిపించుకున్నారు. ఆత్రేయ నాటకశిల్ప నైపుణ్యాన్ని ప్రశంసిస్తూ డా. సి.నా.రె. 'అనుకరణలైనా, అనుసృజనమైనా ఆత్రేయత్వం వాటి మూలసత్యం' అన్నారు.

సినీ రచనతో విసిగి వేసారిన ఆత్రేయ, తన చివరి రోజుల్లో ఇచ్చిన ఇంటర్వ్యూలతో తనకిష్టమైన ప్రక్రియ నాటకం అనీ, మొబైల్ థియేటర్ ద్వారా ప్రజల్లోకి వెళ్లి, వాళ్లలో చైతన్యాన్ని, విప్లవాన్ని రగిలిస్తానని అంటుండేవారు. ఆంధ్ర తెలంగాణ వివాదం ఇతివృత్తంగా 'ఎర్రమల్లెలు', దేవుడు పేర జరుగుతున్న దుర్మార్గాలను చిత్రిస్తూ 'దేవుడు నాస్తికుడయ్యాడు', నక్సల్‌బరీ ఉద్యమం మీద 'ఆఖరి నాటకం' రాస్తానని ఊరించేవారు. 'అనుకున్నామని జరగవు అన్నీ' అని ఆయనే అన్నట్టు ఆఖరి దశలో అన్నవేమీ రాయకుండానే ఈ లోకాన్ని విడిచి వెళ్లిపోయారు. కాని వర్తమాన సమస్యల మీద స్పందించి వాటికి నాటక రూపాల్ని ఇవ్వాలని ఆవేశపడిన ఆత్రేయను 'ఆంధ్రా ఇబ్సెన్' అనడంలో అతిశయోక్తి ఏముంది?

■ డా. పైడిపాల

(నేడు ఆత్రేయ వర్ధంతి)



కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను చూసి కలెక్టర్ సృజన నుంచి వివరాలు తెలుసుకుంటున్న కేంద్రబృంద సభ్యులు (ఇన్‌సెట్‌లో) ప్రకాశం బ్యారేజీ వద్ద గేట్లు దెబ్బతిన్న వైనాన్ని తెలుసుకుంటూ..

నిండా మునిగాం.. సాయం చేయండి

కేంద్ర బృందానికి కలెక్టర్ సృజన వినతి

- కృష్ణా, బుడమేరు వరదలకు, భారీ వర్షాలకు రూ.కోట్లలో నష్టం
- 49,342 మంది రైతులు నష్టపోయారు
- ఆపన్నహస్తం ఇచ్చి ఆదుకోవాలని వేడుకోలు
- కలెక్టరేట్‌లో ఫొటో ఎగ్జిబిషన్, పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరణ

ప్రకాశం బ్యారేజీ, బుడమేరు డైవర్షన్ చానల్ గండ్ల పరిశీలన

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : వర్షాలు, వరదలు.. జిల్లాను అతలాకుతలం చేశాయని, భారీనష్టం వాటిల్లిందని కేంద్రబృందానికి కలెక్టర్ సృజన వివరించారు. కేంద్ర హోం వ్యవహారాల శాఖ జాయింట్ సెక్రటరీ అనిల్ సుబ్రహ్మణ్యం నేతృత్వంలోని కేంద్రబృందం గురువారం జిల్లాలో పర్యటించింది. వ్యవసాయ, రైతు సంక్షేమం, నాగపూర్ డైరెక్టర్ ఏఎల్ వాఘ్మేర్, రోడ్లు, రవాణా, హైవేస్ చీఫ్ ఇంజనీర్ రాకేష్‌కుమార్, ఆర్థిక శాఖ, న్యూఢిల్లీ కన్సల్టెంట్ ఆర్‌బీ కౌల్, గ్రామీణాభివృద్ధి శాఖ డిప్యూటీ సెక్రటరీ ప్రదీప్ కుమార్, నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్, ఇస్రో శాస్త్రవేత్త ఎస్వీ ఎస్వీ శర్మలు ఈ బృందంలో సభ్యులుగా ఉన్నారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లో ఫొటో ఎగ్జిబిషన్, పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా నష్టాన్ని కేంద్ర బృందానికి వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ 24 గంటల వ్యవధిలో 26 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైందని, ప్రకాశం బ్యారేజీకి 11.43 లక్షల క్యూసెక్కుల వరద నీరు వచ్చిందని, అలాగే ఒక్కసారిగా వచ్చిన 40 వేల క్యూసెక్కులతో బుడమేరుకు వరద రావటంతో నగరంలోని మొత్తం 32 డివిజన్లు జలమయమయ్యాయని తెలిపారు. ప్రాథమిక అంచనాల మేరకు జిల్లావ్యాప్తంగా 49,342 మంది రైతులు నష్టపోయారన్నారు. రైతులను తక్షణం ఆదుకోవటం కోసం రూ.69.74 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ అవసరమని పేర్కొన్నారు. ఉద్యాన శాఖకు సంబంధించి 5,227 హెక్టార్లలో నష్టం ఏర్పడిందన్నారు. ఆయిల్‌పామ్‌కు రూ.21.73 కోట్ల నష్టం వాటిల్లిందన్నారు. పశు సంవర్ధక శాఖ పరిధిలో రూ.69.41 లక్షల నష్టం సంభవించిందని చెప్పారు. కృష్ణానది పునరుద్ధరణ పనులకు రూ.635 కోట్లు అవుతుందని చెప్పారు. బుడమేరు గండ్ల పనులకు రూ.36.98 కోట్లు, మునేరు నష్టాలను పూడ్చేందుకు రూ.53.27 కోట్లు అవసరమన్నారు. ఇరిగేషన్ ఆస్తులకు రూ.730 కోట్ల మేర నష్టం వాటిల్లినట్టు చెప్పారు. జిల్లాలో ఆర్‌అండ్‌బీ సర్కిల్ పరిధిలో 690 కిలోమీటర్ల మేర రహదారులు దెబ్బతిన్నాయన్నారు. రోడ్ల పునరుద్ధరణ పనులకు రూ.189 కోట్లు కావాలని చెప్పారు. విద్యుత్‌కు సంబంధించి ఈహెచ్‌టీ సబ్‌స్టేషన్లు, 33/11 కేవీ సబ్‌స్టేషన్లు, 33 కేవీ ఫీడర్లు, స్తంభాలకు భారీగా నష్టం సంభవించిందని, రూ.45.14 కోట్ల మేర నష్టం ఉందన్నారు. గ్రామీణ నీటి సరఫరా శాఖ పరిధిలో 58 తాగునీటి పథకాలకు సంబంధించి నష్టం వాటిల్లిందని, రూ.114 కోట్లు అవసరమని చెప్పారు.

వరద ప్రాంతాల్లో పర్యటన

కేంద్రబృందం క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపింది. ముందుగా ప్రకాశం బ్యారేజీ వద్దకు వెళ్లిన బృందం.. అక్కడి గేట్లను బోట్లు ఢీకొట్టిన ప్రాంతాన్ని పరిశీలించింది. ఆ తర్వాత బుడమేరు డైవర్షన్ చానల్ (బీడీసీ)ను, గండ్లు పడిన ప్రాంతాలను పరిశీలించింది. అనంతరం కేంద్రబృందం జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్‌తో చర్చించింది. అనంతరం ఇబ్రహీంపట్నం వెళ్లిన కేంద్రబృందం ఈలప్రోలులో వరికి జరిగిన నష్టాన్ని పరిశీలించింది.

ధైర్యం కోల్పోవద్దు.. అన్నివిధాలా అండగా ఉంటాం..

క్షేత్రస్థాయిలో పరిశీలన తర్వాత జిల్లాలో జరిగిన నష్టం భారీగా ఉందని ప్రాథమికంగా అంచనా వేస్తున్నామని కేంద్రబృందం పేర్కొంది. సమగ్ర నష్ట అంచనా సర్వే నివేదికను కూడా పొందుపరచాల్సిందిగా జిల్లా యంత్రాంగాన్ని కోరింది. మనోధైర్యం కోల్పోవద్దని, నష్టాన్ని అంచనా వేశామని, కేంద్రం దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తామన్నారు.

● విద్యాలయానికి విధేయులు



● అన్నార్తులు





ఏరు కాదు.. ఊరే.. : అంబాపురంలో ఇంకా తొలగని వరద నీరు

అయ్యో..!

ఇంకా వదలని కన్నీటి వరద

- మురుగు నిండిన నీటితో బాధితుల కష్టాలు
- చాలా ప్రాంతాల్లో ఇంకా తొలగని నీరు
- వరద తొలగిన చోట అస్తవ్యస్త పరిస్థితులు



తొలగని కష్టాలు : జక్కంపూడి వద్ద మోకాలు లోతు నీరు



అక్షరం కోసం ఆరాటం పాయకాపురంలో పుస్తకాలు ఆరబెట్టుకుంటూ..

వరద తగ్గుతున్నా.. బాధితుల కళ్లల్లో కన్నీటి వరద మాత్రం ఇంకా ఎగిసిపడుతూనే ఉంది. కలలన్నీ కళ్ల ముందే కొట్టుకుపోగా, ఆశలన్నీ నీరుగారి, కన్నీటితో కాలం గడుపుతున్న బాధితులు.. రేపటి పరిస్థితి ఏమిటోనని భయంభయంగా కాలం వెళ్లదీస్తున్నారు. అస్తవ్యస్తమైన ఇళ్లను చూసుకుంటూ గుండెలవిసేలా విలపిస్తున్నారు. వరద ప్రభావిత ప్రాంతాలైన అజిత్‌సింగ్‌నగర్, వాంబేకాలనీ, కండ్రిక, కబేళా, విద్యాధరపురం, వైఎస్సార్ కాలనీ, అంబాపురం ప్రాంతాల్లో పరిస్థితి దారుణంగా ఉంది. ఎవరిని కదిలించినా కష్టాల కథలే.. నష్టాలపై అంచనాలే. దారుణంగా నాశనమైన రహదారులు, బురదమయమైన పరిసరాలతో నగరం కరువు ప్రాంతంగా మారిపోయింది. చాలా ప్రాంతాల్లో వరద నీరు ఇంకా ఉండటంతో పరిస్థితి సాధారణ స్థితికి చేరుకోలేదు. గుప్పెడు మెతుకుల కోసం, గుక్కెడు నీటి కోసం బాధితులు చేస్తున్న ఆక్రందనలు అందరికీ కంటతడి పెట్టిస్తున్నాయి. ప్రభుత్వ సాయం, దాతల దాతృత్వం కాస్త ఊరట కలిగిస్తోంది. - విజయవాడ, ఆంధ్రజ్యోతి



వరద తోడు.. నీటిలోనే గూడు : కండ్రికలో పరిస్థితి ఇదీ..



హతవిధీ.. ఏమిటీ వీధి : సీఎస్‌సీ చర్చి రోడ్డు ఇలా..



కన్నీరే మిగిలింది : కండ్రికలో విలపిస్తున్న మహిళ

నత్తనడకన

పంట నష్టపరిహారం జాబితా తయారీలో జాప్యం



వర్షాలు, వరదల తాకిడికి దెబ్బతిన్న పంట

- 10వ తేదీతో ముగిసిన గడువు
- ఇంకా కొనసాగుతున్న పంటనష్టం అంచనా
- ఎకరాకు రూ.10 వేల పరిహారం
- ఈ-క్రాప్ నమోదు కూడా నెమ్మదిగానే..

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : ఇటీవల కురిసిన భారీ వర్షాలు, బుడమేరు వరద కారణంగా జిల్లాలో 25 మండలాల పరిధిలోని 425 గ్రామాల్లో వరికి నష్టం జరిగినట్లు వ్యవసాయ శాఖ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. సాగుకు సంబంధించి 44,521 హెక్టార్లలో వరిపైరు నీటమునిగిందని, పంటనష్టం రూ.385.24 కోట్లుగా ఉందని వ్యవసాయ శాఖ ప్రభుత్వానికి నివేదికను పంపింది. నెల రోజులు, 45 రోజుల వయసున్న వరిపైరు దుబ్బుచేసే దశకు చేరుకుంది. రైతులు ఇప్పటికే.. మొదటి, రెండు కోటాలుగా ఎరువులను చల్లారు. ముందస్తుగా వరినాట్లు వేసిన పొలంలో ఎకరాకు కనీసం రూ.20 వేల వరకు పెట్టుబడిగా పెట్టారు. వారం రోజులకు పైబడి నీటిలోనే ఉండిపోవడంతో పైరు కుళ్లిపోయి, నేలవాలిపోతోంది. దీంతో నష్టం అధికంగానే ఉంటుందంటున్నారు. ఉద్యాన పంటలకు సంబంధించి జిల్లాలో 18 మండలాల పరిధిలోని 81 గ్రామాల్లో 4,070.26 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నట్లుగా అధికారులు తేల్చారు. ఉద్యాన పంటలకు రూ.107.82 కోట్ల మేర నష్టం జరిగినట్లు ప్రాథమికంగా అంచనా వేశారు. వరిసాగు, ఉద్యాన పంటలకు సంబంధించి గ్రామస్థాయిలో పనిచేసే వ్యవసాయ శాఖ అసిస్టెంట్లు, వీఆర్వోలు పంటనష్టం అంచనాల జాబితాలను తయారుచేయాల్సి ఉంది. ప్రభుత్వం ఇచ్చిన ప్రత్యేక ఫార్మాట్‌లో వీటిని తయారుచేసిన అనంతరం గ్రామసభ నిర్వహించాలి. ఏమైనా మార్పులు, చేర్పులు ఉంటే సరిచేయాలి. అనంతరం ఈ జాబితాలను మండల వ్యవసాయ శాఖ కార్యాలయానికి పంపాలి. మండల వ్యవసాయ శాఖ అధికారులు, తహసీల్దార్లు.. ఆ తర్వాత డివిజన్ స్థాయిలో ఆర్డీవోలు, వ్యవసాయ శాఖ ఏడీలు పరిశీలించాక వ్యవసాయ శాఖ కార్యాలయానికి, కలెక్టర్‌కు ఈ జాబితాలను పంపాలి. ఈ ప్రక్రియ మొత్తం పూర్తికావడానికి కనీసం 10 రోజులకు పైగా సమయం పడుతుంది. ఇప్పటివరకు నష్టం అంచనాల జాబితాల తయారీ ఇంకా పూర్తికాలేదు. పూర్తయ్యేదశలో ఉందని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. అయితే, కొద్దిరోజులుగా గ్రామస్థాయిలో సిబ్బంది వరద సహాయక చర్యల్లో ఉండటం, ఇతర కారణాలతో జాబితాల తయారీ మరింత ఆలస్యమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి.

> జిల్లాలో పంట నష్టపరిహారం జాబితాల తయారీ నత్తనడకన సాగుతోంది. వరదలు, భారీవర్షాల కారణంగా ఈ ఏడాది ఖరీఫ్‌లో రైతులు పంటలు కోల్పోగా, పరిహారం అందించేందుకు ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసింది. ఈనెల 10వ తేదీ తుది గడువు విధించినా జాబితాల తయారీ ఇంకా నత్తనడకన సాగుతోంది. ఎప్పటికి పూర్తవుతుందో తెలియని పరిస్థితి ఏర్పడింది.

పెరిగిన పరిహారం

భారీవర్షాలు, వరదల కారణంగా వరిపైరు దెబ్బతింటే ఎకరాకు రూ.10 వేల చొప్పున పంట నష్టపరిహారంగా అందిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. గతంలో ఎకరాకు రూ.6,800ను పరిహారంగా అందించేవారు. ఈ మొత్తాన్ని రూ.10వేలకు పెంచుతూ కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. పైరు బాగుంటే అవసరమైన ఎరువులను నష్టపరిహారంగా ఇచ్చే అవకాశం ఉందని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు.



జాబితాల్లో పేర్లు రాయాలని ఒత్తిడి

పంట నష్టపరిహారం జాబితాలను తయారు చేస్తున్న సమయంలో వ్యవసాయ, రెవెన్యూ విభాగాలకు చెందిన సిబ్బందిపై ఒత్తిడి పెరుగుతోంది. మెరక ప్రాంతాల్లోని పొలాల్లో పంటలు దెబ్బతినకున్నా.. నష్టపరిహారం జాబితాల్లో తమపేర్లు చేర్చాలని రైతులు స్థానిక రాజకీయ నాయకుల ద్వారా ఒత్తిడి తెస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చే నగదు కదా.. మీరు ఇవ్వరు కదా.. అని చెప్పి అందరి రైతుల పేర్లు రాయాలని సిబ్బందిపై ఒత్తిడి తెస్తుండటం గమనార్హం. ఈ విధానం జిల్లాలోని అన్ని ప్రాంతాల్లోనూ కొనసాగుతోంది.

ఈ-క్రాప్ నమోదు అంతంతమాత్రమే..

పంట నష్టపరిహారం, పంటబీమా, రైతు భరోసా, ఎరువులకు సంబంధించిన సబ్సిడీ, ఇతరత్రా రాయితీలు రైతులకు అందాలంటే తప్పనిసరిగా ఈ-క్రాప్‌లో పంటల వివరాలను నమోదు చేయాలి. ఈనెల 15వ తేదీలోగా నమోదును పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈలోగా వరదలు, భారీవర్షాలు కురవడంతో రెవెన్యూ, వ్యవసాయశాఖ సిబ్బంది యావత్తూ వరద సహాయక చర్యల్లో బిజీగా ఉండటంతో ఈ-క్రాప్ ప్రక్రియకు బ్రేక్ పడింది. ఈనెల 15 నాటికి పూర్తిచేసి, 19 నుంచి 24వ తేదీ వరకు గ్రామసభలు నిర్వహించాల్సి ఉంది. 25 నుంచి 28వ తేదీ వరకు పరిష్కరించాలి. తుది జాబితాలను ఈనెల 30 నాటికి ప్రకటించాల్సి ఉంది. ఈ-క్రాప్ నమోదు ప్రక్రియ పూర్తికాకుండానే నష్టం అంచనాలను తయారుచేసినా ఎంతమేర ఉపయోగం ఉంటుందనే అంశంపై స్పష్టత లేదు. ఈ-క్రాప్‌లో పంటల వివరాలు నమోదు చేయని విషయాన్ని నష్టపరిహార జాబితాలో నమోదు చేస్తే బాగుంటుందనే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం ఇందుకు అనుగుణంగా అనుమతులు ఇస్తుందంటున్నారు.

నవహారతుల ట్రయల్‌రన్ విజయవంతం



వన్‌టౌన్, సెప్టెంబరు 12 : కృష్ణానదికి నవహారతుల ట్రయల్‌రన్ విజయవంతమైంది. దుర్గామల్లేశ్వర దేవస్థాన అర్చకులు, ఈవో రామారావు నేతృత్వంలో గురువారం దుర్గాఘాట్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ ప్రస్తుతం నవహారతులను ఐదు సెట్లతో నిర్వహించామని, ఇంకా మరికొన్ని సెట్లు తయారు చేయించనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ వైదిక సిబ్బంది, ఈఈ లింగం రమాదేవి, డీఈ రవీంద్రనాథ ఠాగూర్, ఇంజనీరింగ్ సభ్యులు పాల్గొన్నారు. దేవస్థానంలో అక్టోబరు 3 నుంచి జరగనున్న దసరా మహోత్సవాల్లో ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు, చండీయాగం, శ్రీచక్రనవావరణార్చన తదితర పూజలు, వేదసభ, అర్చకసభల నిర్వహణపై గురువారం ఈవో రామారావు ఆలయ అర్చకులతో సమావేశం నిర్వహించారు.

జగ్గయ్యపేట మున్సిపాలిటీలో వైసీపీకి షాక్

7లో

- మున్సిపల్ చైర్మన్ రాజీనామా
- కౌన్సిలర్ వెంకట్రావుతో కలిసి నేడు టీడీపీలో చేరిక

సూపర్ హీరోల ప్రేమకథ

సుధీర్‌బాబు కథానాయకుడిగా నటిస్తున్న కుటుంబ కథా చిత్రం 'మా నాన్న సూపర్ హీరో'. అభిలాష్ రెడ్డి కంకర దర్శకత్వంలో సునీల్ బలుసు నిర్మిస్తున్నారు. అక్టోబర్ 11న విడుదలవుతోంది. గురువారం నిర్వహించిన కార్యక్రమంలో మేకర్స్ హీరో నాని చేతుల మీదుగా టీజర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా



సుధీర్‌బాబు మాట్లాడుతూ 'ఇది మార్వెల్ సూపర్‌హీరో సినిమా కాదు. ఈ సినిమాలో హీరోకి ఉండే పవర్ పేరు ప్రేమ. ఇద్దరు సూపర్ హీరోల మధ్య జరిగే లవ్ స్టోరీ ఇది. కుటుంబంతో కలసి ఎంజాయ్ చేస్తూ చూసేలా ఉంటుంది' అన్నారు. అభిలాష్ మాట్లాడుతూ 'తండ్రీ కొడుకుల అనుబంధం నేపథ్యంలో రాసుకున్న అద్భుతమైన కథతో ఈ చిత్రాన్ని తెరకెక్కించాను. మా టీం చాలా కష్టపడింది. అందరూ ఎంజాయ్ చేస్తారు' అని చెప్పారు. ఒక మంచి చిత్రంలో భాగమైనందుకు చాలా ఆనందంగా ఉందని హీరోయిన్ ఆర్న తెలిపారు. ఇలాంటి సినిమా చేసినందుకు గర్వంగా ఉందని సునీల్ చెప్పారు.



ఆంధ్రప్రదేశ్‌లో వరద బాధితులను ఆదుకునేందుకు రూ. 50 లక్షల విరాళం ప్రకటించిన సినీ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ గురువారం సీఎం చంద్రబాబునాయుడును కలసి చెక్కును అందజేశారు. అలాగే రూ. 50 లక్షలు విరాళంగా ప్రకటించిన వెంకట్ అక్కినేని, రూ. 15 లక్షల సాయం ప్రకటించిన సిద్ధు జొన్నలగడ్డ, రూ. 5 లక్షలు విరాళంగా ప్రకటించిన విష్వక్‌సేన్ సీఎంను కలసి చెక్కులు అందజేశారు.

ఫ్యామిలీతో చూడతగ్గ చిత్రం

'ఈ సినిమాతో అందరికీ ఎమోషనల్ కనెక్షన్ ఉంది. సినిమా ఎప్పుడు రిలీజ్ అవుతుందా అనే ఆసక్తితో అందరూ పని చేశారు. నేను సలహాలు ఇవ్వడం వరకే కానీ నిజానికి కష్టపడింది మాత్రం టీమే. వీళ్ల కష్టానికి తగిన ఫలితం మంచి హిట్ ద్వారా వస్తుందని బలంగా కోరుకుంటున్నాను' అన్నారు దర్శకుడు మారుతి. రాజ్ తరుణ్ హీరోగా నటించిన 'భలే ఉన్నాడే' చిత్రం శుక్రవారం విడుదలవుతున్న సందర్భంగా జరిగిన ప్రీ రిలీజ్ ఫంక్షన్‌లో ఆయన పాల్గొన్నారు. జె. శివసాయి వర్ధన్ దర్శకత్వంలో ఎన్వీ కిరణ్‌కుమార్ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ కార్యక్రమంలో రాజ్‌తరుణ్ మాట్లాడుతూ 'మా సినిమాకు అతి ముఖ్యమైన వ్యక్తి దర్శకుడు శివసాయి. మారుతిగారు చెప్పిన పాయింట్‌ను అద్భుతంగా తెరకు ఎక్కించారు. పని రాక్షసుడు. నన్ను చాలా కొత్తగా



చూపించాడు. గ్రేట్ డైరెక్టర్ సింగీతం గారితో కలసి పని చేయడం గొప్ప అనుభూతి' అన్నారు. తన పదిహేనేళ్ల కలను నిజం చేసిన మారుతికి దర్శకుడు శివసాయి కృతజ్ఞతలు తెలిపారు. ఫ్యామిలీతో చూడతగ్గ చిత్రమిదని నిర్మాత కిరణ్‌కుమార్ చెప్పారు.

పాటల ప్రపంచాన్ని వదిలి వెళ్లిపోయిన గురుచరణ్



'ముద్దబంతి నవ్వులో మూగ బాసలు', 'బోయవాని వేటుకు గాయపడిన కోయిల', 'మునిముని నవ్వుల లోన..' 'నీక్కావాల్సింది నా దగ్గర ఉంది' వంటి మెలోడీ సాంగ్స్ రాసిన గురుచరణ్ (77) ఇక లేరు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన గురువారం ఉదయం కన్నుమూశారు. గురుచరణ్ అసలు పేరు మానాపురం రాజేంద్రప్రసాద్. ఎన్టీఆర్, శోభన్‌బాబు నటించిన పలు చిత్రాలకు దర్శకత్వం వహించిన పాత తరం దర్శకుడు మానాపురం అప్పారావు తనయుడే ఈ రాజేంద్రప్రసాద్. వాళ్ల అమ్మగారు ఎం.ఆర్. తిలకం కూడా నటీమణే. (ఎన్టీఆర్ నటించి, నిర్మించిన 'ఉమ్మడి కుటుంబం' చిత్రంలో 'పోవు చున్నావా యమధర్మ రాజా' పాట పాడింది ఆవిడే) ఎం.ఎ. చదివిన గురుచరణ్ ప్రముఖ గీత రచయిత ఆచార్య ఆత్రేయ దగ్గర శిష్యరికం చేశారు. గురువు మీద గౌరవంతో 'గురుచరణ్' అని తన పేరు మార్చుకుని, ఆ పేరుతోనే పరిశ్రమలో కొనసాగారు. మోహన్‌బాబు నిర్మించిన 'అల్లుడు గారు' గీత రచయితగా గురుచరణ్ తొలి చిత్రం. 'ముద్దబంతి నవ్వులో మూగ బాసలు' ఆయన రాసిన తొలి పాట. గురుచరణ్ అంటే మోహన్‌బాబుకు ఎంతో అభిమానం. తను నిర్మించిన ప్రతి చిత్రంలోనూ గురుచరణ్‌తో కనీసం ఒక పాటన్నా రాయించేవారు. రెండు వందలకు పైగా పాటలు రాసిన గురుచరణ్ కొన్ని అనువాద చిత్రాలకు మాటలు కూడా రాశారు. గురుచరణ్‌కు భార్య, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు.

నిదుర కుదురు చెదిరిపోయే



వైవిధ్యమైన చిత్రాలతో ప్రేక్షకులను అలరిస్తూ వరుస విజయాలను సొంతం చేసుకుంటున్నారు సుహాస్. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'జనక అయితే గనక'. సంగీర్తన కథానాయిక. శిరీష్ సమర్పణలో దిల్‌రాజు ప్రొడక్షన్స్ పతాకంపై హర్షిత్‌రెడ్డి, హన్షిత రెడ్డి నిర్మించారు. సందీప్‌రెడ్డి బండ్ల దర్శకత్వం వహించారు. దసరా సందర్భంగా అక్టోబర్ 12న ఈ చిత్రం విడుదలవుతోంది. గురువారం చిత్రబృందం 'నువ్వే నాకు లోకం... నిదుర కుదురు చెదిరిపోయే' అంటూ సాగే గీతాన్ని విడుదల చేసింది. దూరమైన భార్యను గుర్తు చేసుకుంటూ భర్త మనసు పడే బాధను వర్ణిస్తూ సాగే ఈ గీతానికి కృష్ణకాంత్ సాహిత్యం అందించారు. విజయ్ బుల్గానిన్ స్వరాలు సమకూర్చారు. కార్తిక్ హృద్యంగా ఆలపించారు.

అప్‌డేట్స్

దాండియా ఆడుతూ..



కిరణ్ అబ్బవరం హీరోగా నటిస్తున్న భారీ పీరియాడికల్ థ్రిల్లర్ 'క' చిత్రంలో నయన్ సారిక, తన్వీ రామ్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఇందులో తన్వీ రామ్ పోషిస్తున్న రాధ పాత్ర ఫస్ట్ లుక్ విడుదల చేశారు. దాండియా ఆడుతూ అందంగా కనిపిస్తూ తన్వీ రామ్ అందరినీ ఆకట్టుకుంటోంది. 'క'లో ఆమెది కీలకమైన పాత్ర. జంట దర్శకులు సుజీత్, సందీప్ దర్శకత్వంలో విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో చింతా గోపాలకృష్ణారెడ్డి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ భాషల్లో త్వరలో ఈ సినిమా విడుదల కానుంది.

ప్రకృతిని కాపాడే బందీ



ఆదిత్య ఓం నటించిన 'బందీ' చిత్రం త్వరలో విడుదల కానుంది. తిరుమల రఘు స్వీయ దర్శకత్వంలో వెంకటేశ్వరరావుతో కలసి ఈ సినిమాను నిర్మించారు. ఈ చిత్రం టీజర్ విడుదల చేసిన అనంతరం రఘు మాట్లాడుతూ 'ఒకే ఒక్క పాత్రతో రూపుదిద్దుకున్న చిత్రమిది. ప్రకృతిని నాశనం చేసే కార్పొరేట్ కంపెనీలకు లీగల్ అడ్వైజర్‌గా ఉండే పాత్రను ఆదిత్య ఓం పోషించారు. అటువంటి వ్యక్తిని అడవుల్లో వదిలేస్తే ఏలా ఉంటుందనే ఆసక్తికరమైన కథనంతో ఈ చిత్రం రూపుదిద్దుకుంది. మా హీరో ఇప్పుడు 'బిగ్‌బాస్'లో ఉన్నారు. ఆయన సక్సెస్ అయి వస్తాడని ఆశిస్తున్నాం. త్వరలో చిత్రాన్ని విడుదల చేస్తాం' అని చెప్పారు. అమెరికాలో ఈ సినిమాను డిస్ట్రిబ్యూట్ చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్లు వీఎఫ్‌ఎక్స్ హెడ్ జాకబ్ చెప్పారు.



చంద్రబాబుకు చెక్కులు అందిస్తున్న దాతలు

విరాళాల వెల్లువ

పెనమలూరు: అకాల వర్షాలతో అతలాకుతలమైన నగర ప్రాంత వరద బాధితులకు బాసటగా దాతలు మంచిమనస్సుతో విరాళాలకు ముందుకొస్తున్నారు. గురువారం తాడిగడపకు చెందిన ప్రాంక్విన్ ఫార్ములేషన్స్ అధినేత సాగి కృష్ణంరాజు రూ.15లక్షల చెక్కును, బొబ్బా గోపాలకృష్ణ రూ.10లక్షల చెక్కును ముఖ్యమంత్రి చంద్రబాబుకు స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్ సమక్షంలో అందజేశారు. టీడీపీ నేతలు అనుమోలు ప్రభాకరరావు, దేవినేని రాజా, గొంది శివరాంకృష్ణప్రసాద్, పీతా గోపీచంద్, పువ్వాడ సుధాకర్, గొంది రేవంత్ పాల్గొన్నారు.

మంటాడ సర్పంచ్ రూ.50వేల విరాళం

పమిడిముక్కల: వరదబాధితుల సహాయార్థం మంటాడ సర్పంచ్ మోటేపల్లి వీరమ్మ రూ.50వేల ఆర్థిక సాయం ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజాకు అందజేశారు. టీడీపీ నేతలు కుమ్మరి రామారావు, మోటేపల్లి బ్రహ్మేశ్వరరావు, జక్కా శ్రీనివాసరావు, పండలనేని రాజకుమార్, సర్పంచ్‌తో పాటు ఉన్నారు.

జగ్గయ్యపేట మున్సిపాలిటీలో వైసీపీకి షాక్

వైసీపీకి రాఘవేంద్ర రాజీనామా.. కౌన్సిలర్ వెంకట్రావుతో కలిసి నేడు లోకేష్ సమక్షంలో టీడీపీలో చేరిక

జగ్గయ్యపేట, సెప్టెంబరు 12: మునిసిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, 31వ వార్డు కౌన్సిలర్ గింజుపల్లి వెంకట్రావు గురువారం వైసీపీకి రాజీనామా చేశారు. శుక్రవారం టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేష్ సమక్షంలో టీడీపీలో చేరనున్నారు. ఈ సందర్భంగా టీడీపీలో చేరేందుకు టీడీపీ విజయవాడ పార్లమెంట్ అధ్యక్షుడు నెట్టెం రఘురాం, ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్యతో కలిసి చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర తన నివాసంలో విలేకర్లతో మాట్లాడారు. వైసీపీ అధినేత జగన్ వైఖరితో విసుగు చెంది పార్టీకి రాజీనామా చేశామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సహాయక చర్యల్లో పాల్గొన్న విధానం ఆకట్టుకుందన్నారు. ఈ విపత్తు సమయంలో మాజీ సీఎం జగన్ స్పందన దారుణంగా ఉందన్నారు. చైర్మన్ రాఘవేంద్ర టీడీపీలో చేరాలన్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని టీడీపీ విజయవాడ పార్లమెంట్ అధ్యక్షుడు నెట్టెం రఘురాం చెప్పారు. మున్సిపల్ చైర్మన్‌గా రాఘవేంద్ర కొనసాగుతారని ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాఘవేంద్రను శుక్రవారం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ వద్ద అధికారికంగా పార్టీలో చేరతారన్నారు. మరికొంత మంది వైసీపీ కౌన్సిలర్లు పార్టీలో చేరతారన్నారు. మాజీ చైర్మన్ శ్రీరాం సుబ్బారావు, వైస్ చైర్మన్ నూకల కుమార్‌రాజా, అచంట సునీత, జీ దుర్గాప్రసాద్, టీడీపీ కౌన్సిలర్లు కన్నెబోయిన రామలక్ష్మి, కంచేటి గీతారాణి, గెల్లా సంధ్యారాణి, సోముల స్వప్న, నకిరికంటి వెంకటి, పేరం సైదేశ్వరరావు, శాంతకుమారి పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు.



చైర్మన్ రాఘవేంద్రను అభినందిస్తున్న టీడీపీ కౌన్సిలర్లు, తాతయ్య, నెట్టెం

చైర్మన్ చేరికను ఆపేందుకు యత్నం

ఇదిలా ఉండగా చైర్మన్ రంగాపురం రాఘవేంద్రను టీడీపీలో చేరకుండా ఆపేందుకు చివరి వరకు మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను విఫలయత్నం చేశారు. రాఘవేంద్ర ఇంటికి వెళ్లి ఆపాలని యత్నించారు. టీడీపీ నేతలు ముందుగానే జాగ్రత్త పడి రాఘవేంద్ర ఇంటికి వెళ్లి ఆయనతో రాజీనామా ప్రకటన చేయించారు. రాఘవేంద్రను నిలువరించలేని ఉదయభాను టీడీపీ తీర్థం పుచ్చుకుంటారని భావించిన ముగ్గురు మహిళా కౌన్సిలర్లను ఆపగలిగారు.

యేనుగుగడ్డ వాగు వరదతో కకావికలం



కంచికచర్ల, సెప్టెంబరు 12: యేనుగుగడ్డ వాగు వరద మూడు మండలాలపై తీవ్ర ప్రభావం చూపింది. గతంలో ఎన్నడూ లేనంతగా ఉధృతంగా విరుచుకుపడటంతో జరిగిన నష్టం అంతా ఇంతా కాదు. పలుచోట్ల గండ్లు పడటంతో వేలాది ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. రోడ్లు నామరూపాల్లేకుండా ధ్వంసమయ్యాయి. మూడు రోజులపాటు ఏకధాటిగా కురిసిన భారీ వర్షాలకు వాగు ఇంతకు ముందు ఎన్నడూ లేనివిధంగా ఉధృతంగా ప్రవహించింది. వాగుకు ఇరువైపులా కిలోమీటర్ల దూరం వరద ముంచెత్తింది. వేలాది ఎకరాల పంట భూములపై పదడుగుల ఎత్తున వరద పారింది. మాగాణి వరి, పత్తి, మొక్కజొన్న, మిర్చి పంటలు కకావికలమయ్యాయి. పలు చోట్ల పైర్లు కుళ్లిపోయాయి. ఆయా గ్రామాల రైతులకు రూ.కోట్లలో నష్టం వాటిల్లింది. ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాల్సిందిగా బాధిత రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. పెద్దాపురం వద్ద భారీ గండి పడి వరద పరిటాల చెరువుకు చేరటంతో పూర్తిగా నిండిపోయి రెండు చోట్ల గండ్లు పడ్డాయి. గొట్టుముక్కల గ్రామం నుంచి వెళ్లే కట్టెలడొంక రోడ్డు కిలోమీటర్ల దూరం కోసుకుపోయింది. తక్షణమే కట్టెలడొంక రోడ్డుతో పాటుగా మిగతా రోడ్లకు కూడా మరమ్మతులు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తెస్తాం: గొల్లు కృష్ణ

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 12: కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తెచ్చేందుకు కృషి చేస్తామని డీసీసీ నూతన అధ్యక్షుడు గొల్లు కృష్ణ అన్నారు. శుక్రవారం పీసీసీ అధ్యక్షురాలు షర్మిల నుంచి విజయవాడలో గొల్లు కృష్ణ డీసీసీ అధ్యక్ష పదవికి చెందిన నియామక అందుకున్నారు. ఈ సందర్భంగా మచిలీపట్నం డీసీసీ కార్యాలయంలో కార్యకర్తలతో మాట్లాడారు. త్వరలో డీసీసీ నూతన కమిటీ, మండల కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సందర్భంగా కృష్ణను బందరు కాంగ్రెస్ నేత అబ్దుల్ మతీన్ అభినందించారు.

బాధిత రైతులతో చెలగాటం

- అధికారిక సమాచారం ఇవ్వని అధికారులు
- ఆర్బీకేలో కూర్చుని ఎన్యుమరేషన్ నమోదు

తోట్లవల్లూరు, సెప్టెంబరు 12: మండలంలోని వరద బాధిత రైతులతో అధికారులు చెలగాటమాడుతున్నారు. ఎక్కడ ఎవరిని ఎలా కలవాలో, పంట నష్టం నమోదు చేస్తున్నారో లేదో తెలియని అయోమయం. గురువారం నలుగురు అధికారులు నాలుగు రకాలుగా సమాధానాలిచ్చారు. 10వ తేదీ నుంచే పంటల ఎన్యుమరేషన్ జరుగుతోందని మండల వ్యవసాయాధికారి జి నాగేశ్వరరావు, 5వ తేదీ నుంచి ఎన్యుమరేషన్ మొదలు పెట్టామని ఉద్యానాధికారి చందు జోసఫ్ తెలిపారు. రెండు రోజుల నుంచి ఎన్యుమరేషన్ చేస్తున్నట్టు వీఆర్వో అసదుల్లా తెలిపారు. తహసీల్దార్ ఎం కుసుమకుమారీ మాత్రం ఎన్యురేషన్‌కు 4రోజుల క్రితమే టీంలను వేశామని, రైతులకు తెలుసన్నారు. మళ్లీ అరగంటలో కాదు కాదు ఈ-క్రాప్ పూర్తవలేదని, అందరు ఈ-క్రాప్ చేయించుకోవాలని అధికారులకు తెలిపామని, తరువాతే ఎన్యుమరేషన్ జరుగుతుందని చెప్పారు. అధికారుల్లోనే ఇలాంటి గందరగోళం నెలకొంది. రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. ఇదిలా ఉండగా సిబ్బంది ఆర్బీకేల్లో కూర్చుని ఈ-క్రాప్, ఎన్యుమరేషన్ చేస్తున్నట్టు రైతులు చెపుతున్నారు. ఈ-క్రాప్ ఆర్బీకేల్లో చేసినా పంటల ఎన్యురేషన్‌కు ఫీల్డుకి వెళ్లాలి. కానీ కొందరు అధికారులు, సిబ్బంది లంకల్లో మొత్తం పంటలు పోయాయిగా మీరేం సాగు చేశారో చెప్పాలని అడుగుతున్నట్టు తెలుస్తోంది. గతంలో వరదలు వచ్చినపుడు ఇలాగే భారీగా అక్రమాలు జరిగాయి. ఇపుడు ఆర్బీకేల్లో కూర్చుని నమోదు చేయటంతో మరోసారి అక్రమాలు జరిగే అవకాశం ఉంది. నిజమైన రైతుకి పరిహారం అందేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.



తోట్లవల్లూరు (సౌత్)ఆర్బీకే

వేగంగా నిత్యావసర కిట్ల పంపిణీ

- స్పెషలాఫీసర్ వినూత్న

నందిగామ, సెప్టెంబరు 12: వరద బాధితులకు అందిస్తున్న నిత్యావసరాల కిట్ పంపిణీ వేగంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రభుత్వం అనంతపురం జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ వినూత్నను స్పెషలాఫీసర్‌గా నియమించారు. గురువారం డివిజన్‌లోని పలు మండలాలో పర్యటించిన ఆమె పంపిణీ వేగవంతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. నందిగామ ఆర్‌డీవో కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించిన ఆమె కిట్‌ల దిగుమతి వివరాలు అడిగి తెలుసుకున్నారు. డివిజన్‌లోని 7 మండలాలకు 16286 వరద ప్రభావిత కుటుంబాలను అధికారులు గుర్తించారు. 16286 కిట్‌లను ప్రభుత్వం ఆయా మండలాలకు చేర్చింది. అధికారులు యుద్ధప్రాతిపదికన పంపిణీ చేస్తున్నారు. గురువారం ఉదయం నుంచి దాదాపు అన్ని మండలాలలో పంపిణీ ప్రక్రియ ప్రారంభం కాగా, పెనుగంచిప్రోలు మండలంలో సాయంత్రం వరకూ ప్రారంభం కాలేదు. చందర్లపాడుకు 1311, జగ్గయ్యపేట 2162, కంచికచర్ల 8713, నందిగామ 1923, పెనుగంచిప్రోలు 1585, వత్సవాయి 549, వీరులపాడు 43 కుటుంబాలకు ప్రభుత్వం కిట్‌లు పంపిణీ చేస్తుంది. అయితే నిత్యావసరాలు త్వరగా పంపిణీ చేయాలన్న ప్రభుత్వ సంకల్పానికి ఈ-పోస్ పరికరాలు అడ్డంకిగా మారాయి. సాంకేతిక లోపాలతో పంపిణీ నత్తనడకన సాగుతుంది. నందిగామ డివిజన్‌లో మొత్తం 165 ఇళ్లు దెబ్బతిన్నట్టు అధికారులు తెలిపారు. చందర్లపాడు మండలంలో పూర్తిగా 5, పాక్షికంగా 26 దెబ్బతిన్నాయి. జగ్గయ్యపేట మండలంలో పూర్తిగా 35, పాక్షికంగా 22, కంచికచర్లలో పూర్తిగా 35, పాక్షికం 3, నందిగామలో పూర్తిగా 5, పాక్షికంగా 7, పెనుగంచిప్రోలులో పూర్తిగా 4, పాక్షికంగా 7, వత్సవాయిలో పాక్షికంగా 12, వీరులపాడు పాక్షికంగా 4 ఇళ్లు దెబ్బతిన్నట్టు అధికారులు గుర్తించారు.



నందిగామ పట్టణంలోని నిత్యావసరాల కిట్ పంపిణీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న స్పెషల్ ఆఫీసర్ వినూత్న

నందిగామ రూరల్: వరద ముంపునకు గురైన బాధితులకు కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో గురువారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో ముంపునకు గురైన 1923 బాధిత కుటుంబాలకు ఆర్డీవో రవీంద్రరావుతో కలిసి ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య సరుకులను పంపిణీ చేశారు. తహసీల్దార్ సురేష్‌బాబు, మున్సిపల్ కమిషనర్ రమణబాబు, పీడీఎస్ డీటీ రమణమూర్తి, ఆర్‌ఐ వేణుకుమారి, నేనతలు యేచూరు రాము, మారం అమరయ్య, శాఖమూరు స్వర్ణలత, వీరాస్వామి పాల్గొన్నారు. అంబారుపేట, ఐతవరం గ్రామాల్లో వరద ముంపునకు నీట మునిగిన పంట పొలాలను స్పెషలాఫీసర్ వినూత్న పరిశీలించారు.

దుర్గమ్మకు కానుకల రూపేణ రూ.82,03,392 రాక

వన్‌టౌన్: దుర్గగుడిలో హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను గురువారం మహామండపంలోని 6వ అంతస్తులో లెక్కించారు. 15 రోజులకు గాను అమ్మవారికి కానుకల రూపేణ రూ.82,03,392లు లభించాయి. అలాగే 145 గ్రాముల బంగారం, కిలో 875 గ్రాముల వెండి లభించాయి. యూఎస్‌ఏ డాలర్లు 136, 20 ఇంగ్లండ్ ఫౌండ్లు, 40 కెనడా డాలర్లు, 0.25 కువైట్ దీనార్లు, 10 స్కాట్లాండ్ పౌండ్లు, 20 హాంకాంగ్ డాలర్లు, 51 ఖతార్ రియాల్స్ విదేశీ కరెన్సీ హుండీల్లో వచ్చాయి. అలాగే ఆన్‌లైన్ ఈ-హుండీలో రూ.1,03,034 వచ్చాయి. ఈవో కేఎస్ రామారావు, డిప్యూటీ ఈవో లీలాకుమార్, అధికారులు, ఏఈవోలు, సిబ్బంది, ప్రత్యేక పోలీసు, వన్‌టౌన్ పోలీసు సిబ్బంది, సేవాదార్లు, లెక్కింపులో పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నిమజ్జనోత్సవాలు

కోడూరు: గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పలు దేవాలయాల వద్ద ఏర్పాటు చేసిన గణపతి విగ్రహాలను గురువారం నిమజ్జనం నిర్వహించారు. కోడూరు అయ్యప్పస్వామి దేవాలయం, హరిపురం రామాలయం వద్ద ఏర్పాటు చేసిన గణపతి విగ్రహాలు కమిటీ వారి పర్యవేక్షణలో నిమజ్జనం నిర్వహించారు. బడే బావన్నారాయణ, ఇంకొల్లు అశోక్, బండే శ్రీనివాసరావు, పిల్లి మల్లిఖార్జునరావు, తాతా పోతురాజు, ఉల్లి శేషగిరిరావు, స్థానిక పార్టీ నేతలు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పంటరక్షణకు ప్రభుత్వ చర్యలు

- ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్

జగ్గయ్యపేట రూరల్, సెప్టెంబరు 12: కాచవరం సప్లై చానల్ కింద సాగు చేసిన 10వేల ఎకరాల వరిపంటను రక్షించుకునేందుకు ప్రభుత్వం సహకారం అందిస్తుందని, రైతులు నష్టపోకుండా యుద్ధ ప్రాతిపదికన సాగునీరు అందించేందుకు కృషి చేస్తున్నట్టు ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ భరోసా కల్పించారు. ఇటీవల పాలేటికి వచ్చిన వరద ఉధృతికి కొట్టుకుపోయిన కట్టు కాచవరం చెక్‌డ్యాం ప్రాంతాన్ని గురువారం ఆయన పరిశీలించారు. భారీ వర్షాలు, వరదల కారణంగా పాలేరు నదిలో ఏర్పాటు చేసిన చెక్‌డ్యాంతో పాటు ఎస్కేప్ గేట్‌లు వరదకు కొట్టుకుపోయాయి. 7.5 కి.మీల మేర పరిధిలో కాల్వకు 24 గండ్లు పడటంతో పాటు కాల్వ గట్లు రెండు వైపులా పాక్షికంగా దెబ్బతిన్నాయి. కిలోమీటర్ల మేర ఇసుక మేట వేసింది. ఇప్పటికే వ్యవసాయ మంత్రి భరోసా ఇచ్చారని మళ్లీ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పనులు చేసేందుకు సహకరిస్తామన్నారు.



కాచవరం సప్లై చానల్‌లో ఎస్కేప్ గేట్‌లు కొట్టుకుపోయిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

నిధులు కేటాయించాలని ఎంపీకి వినతి

కూచిపూడి, సెప్టెంబరు 12: మొవ్వ మండలం చినముత్తేవిలోని ఐనంపూడి డ్రైన్‌పై నిర్మించిన వంతెనతోపాటు గ్రామంలోని గేదెల కోడు డ్రైన్‌పై నిర్మించిన వంతెనలు పూర్తిగా శిథిలావస్థకు చేరి ప్రమాదభరితంగా ఉన్నాయని, నిధులు కేటాయించాల్సిందిగా గ్రామస్థులు, కూటమి నేతలు ఎంపీ వల్లభనేని బాలశౌరికి వినతిపత్రం అందజేశారు. మంచినీటి ఓవర్ హెడ్ ట్యాంక్, పైపులైన్ల నిర్మాణాలు చేపట్టాల్సి ఉందని, అసంపూర్తిగా ఉన్న గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి నిధులు కేటాయించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. నిమ్మకూరు నుంచి 333 ఆర్టీసీ సర్వీసును చిన్నముత్తేవి వరకు పొడిగించాలని కోరారు. అధికారులు అంచనాలు రూపొందిస్తే సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఎంపీ బాలశౌరి గ్రామస్థులకు తెలిపారు. పోతుల నాగేంద్రం, కొమ్ము అర్జునరావు, పోతుల మహేష్ చంద్ర, క్రొవి చెన్నకేశవతోపాటు పలువురు గ్రామస్థులు, కూటమి నేతలు ఎంపీని కలసిన వారిలో ఉన్నారు.

తూర్పు బజారుకు తాగునీటి సరఫరా

పెనుగంచిప్రోలు, సెప్టెంబరు 12: భారీ వర్షాలతో పెనుగంచిప్రోలు మునేటికి 10రోజులపాటు వరద నీరు భారీగా ప్రవహించింది. దీంతో గ్రామానికి రక్షిత మంచినీటి సరఫరా నిలిచిపోయింది. తూర్పు బజార్‌కు వెళ్లే పైపులైనుకు గురువారం నాటికి సర్పంచ్ వేల్పుల పద్మకుమారి, పంచాయతీ కార్యదర్శి జి.శ్యామ్ కుమార్ పర్యవేక్షణలో మరమ్మతు పనులు పూర్తయ్యాయి. దీంతో తూర్పు బజారు గురువారం సాయంత్రం నుంచి తాగునీటి సరఫరాను అందుబాటులోకి తెచ్చారు. మునేటికి అవతల వైపున విద్యుత్ అంతరాయం ఉండటంతో ప్రత్యామ్నాయం ఏర్పాట్లు చేస్తున్నట్టు ఈవో శ్యామ్ కుమార్, సర్పంచ్ వేల్పుల పద్మ కుమారి తెలిపారు.

బుడమేరులో ఆక్రమణలు తొలగించాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

గుడివాడ: బుడమేరులో ఆక్రమణలు తొలగించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ అన్నారు. నందివాడ మండలం పుట్టగుంట వద్ద నీటమునిగిన పంటపొలాలను గురువారం ఆయన సీపీఐ నేతలతో కలిసి పరిశీలించారు. భారీవరదల కారణంగా పంటపొలాలన్నీ నీటమునిగాయని, జాతీయవిపత్తుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ఎకరానికి రూ.30వేల పంటనష్టపరిహారం అందించాలన్నారు. కేంద్రమంత్రి శివరాజ్ చౌహాన్ వాస్తవ పరిస్థితులను గమనించినా, నష్టపరిహారంపై స్పష్టమైన హామీ ఇవ్వలేదన్నారు. బుడమేరు పరిసర ప్రాంత భూములను బడాబాబులు ఆక్రమించుకుని చేపల చెరువులుగా మార్చేశారని, దీంతో వరద పోయేదారిలేక గ్రామాలన్నీ జలదిగ్బంధనంలో చిక్కుకున్నాయన్నారు. ప్రకాశంబ్యారేజీ వద్దకు పడవలను వదలడం హేయమైన చర్యన్నారు. సీపీఐ నేత అక్కినేని వనజ పాల్గొన్నారు.

వృద్ధులకు గొడుగుల పంపిణీ

గుడ్లవల్లేరు: లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు ఆధ్వర్యంలో నిరుపేద వృద్ధులకు అన్నదానం, గొడుగుల పంపిణీ గురువారం నిర్వహించారు. పెసరమిల్లి గ్రామానికి చెందిన దివంగత టీడీపీ నేత వద్రే ఈశ్వరరావు జ్ఞాపకార్థం, ఆయన సతీమణి మామిడికోళ్ల సర్పంచ్ వద్రే విజయలక్ష్మి, వారి కుటుంబ సభ్యులచే అన్నదాన, గొడుగుల పంపిణీ ఏర్పాటు చేశారు. క్లబ్ అధ్యక్షకార్యదర్శులు శశికళ, మేరుగు పెరుమాళ్లు, వద్రే ఈశ్వరరావు కుమారుడు హైదరాబాద్‌కు చెందిన వాణిజ్యవేత్త వద్రే గంగాధర్, మామిడికోళ్ల ఉపసర్పంచ్ తోట రాధిక, రామశాస్త్రులు, వెంకటరావు, మోహనరావు, పరందామయ్య, సుబ్బారావు చౌదరి, వల్లభనేని వెంకట్రావు, వెనిగళ్ల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఘనంగా విక్కుర్తి జన్మదిన వేడుకలు

చల్లపల్లి: పారిశ్రామికవేత్త విక్కుర్తి శ్రీనివాసరావు జన్మదిన వేడుకలు చల్లపల్లి సీయోను వృద్ధాశ్రమంలో ఘనంగా జరిగాయి. అనాథ వృద్ధుల నడుమ శ్రీనివాస్ కేక్‌కట్ చేశారు. అనంతరం వృద్ధులకు అన్నదానం చేశారు. చల్లపల్లి ఉప సర్పంచ్ ముమ్మనేని నాని, ఆశ్రమ నిర్వాహకుడు శీలం భాస్కరరావు శ్రీనివాస్‌ను దుస్సాలువాతో ఘనంగా సత్కరించారు. జనసేన నేత ఉరిమి మణికాంత్, స్థానిక నేతలు విక్కుర్తి శ్రీనివాస్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నారాయణ రావున గర్ మసీదు కమిటీ అధ్యక్షుడు షరీఫ్, హరికృష్ణ, బర్మా శ్రీను పాల్గొన్నారు.

వరద బాధితులకు జనసేన సాయం

మోపిదేవి: మండలంలోని వరద ప్రభావిత గ్రామమైన కె.కొత్తపాలెం గ్రామంలో ఎన్‌ఆర్‌ఐల సహకారంతో 500 కుటుంబాలకు సహాయాన్ని ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ చేతులమీదుగా అందించారు. ఎన్‌ఆర్‌ఐ చందన ప్రదీప్ ఆర్థిక సహకారంతో నరసరావుపేట జనసైనికుల ఆధ్వర్యంలో రూ.2 లక్షలు విలువైన దుస్తులను బాధిత కుటుంబాలకు పంపిణీ చేశారు. సర్పంచ్ కొక్కిలిగడ్డ మాధవి, మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యుడు చందన రంగారావు, జనసేన నరసారావుపేట నియోజకవర్గ నేతలు వెంకటేశ్వరరావు, ముత్యాల మహేష్, రామకృష్ణ, తహసీల్దార్ ఎం.శ్రీవిద్య, టీడీపీ మండలాధ్యక్షుడు నడకుదుటి జనార్ధనరావు, జనసేన అధ్యక్షుడు పూషడపు రత్నగోపాల్, పార్టీ నేతలు రత్నగిరి, నాగేశ్వరరావు, మత్తి వంశీ ఉన్నారు.

కాంగ్రెస్ సీనియర్ నేత చిన్నం మృతి

పామర్రు: పట్టణ సీనియర్ కాంగ్రెస్ పార్టీ నేత, ఆర్యవైశ్య ప్రముఖుడు చిన్నం రాధాకృష్ణమూర్తి (75) గురువారం అనారోగ్యంతో కన్నుమూశారు. మండలంలో సీనియర్ కాంగ్రెస్ నేతగా కొనసాగుతున్న ఆయన కాంగ్రెస్ పార్టీలో వివిధ హోదాల్లో పనిచేశారు. మాజీ ఎంపీ కావూరి సాంబశివరావుకు సన్నిహితుడిగా ఉండేవారు. రాధాకృష్ణ మృతదేహన్ని కాంగ్రెస్ టీడీపీ, జనసేన, వైసీపీ నేతలు సందర్శించి పూలమాలలతో నివాళుర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆర్యవైశ్యసంఘ నేతలు చిన్నం ఆదినారాయణ, బొగ్గవరపు జాలయ్య, మనేపల్లి రఘురామ్ సంతాపాన్ని తెలిపారు.

మాజీ ఎంపీటీసీ రఫీ ఆకస్మిక మృతి

ఉయ్యూరు: తెలుగుదేశం పార్టీ నేత, మాజీ ఎంపీటీసీ ఎండీ రఫీ (ఎల్‌ఫీ రఫీ) (47) గురువారం ఉదయం ఆకస్మిక మృతిచెందారు. ఇటీవల అనారోగ్యానికి గురై చికిత్స పొంది కోలుకుంటున్న రఫీ బుధవారం రాత్రి విజయవాడ ఓ ప్రైవేట్ హాస్పిటల్‌తో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఆయన సతీమణి జరీనాబేగం నగరపంచాయతీ 19వ వార్డు మాజీ కౌన్సిలర్. రఫీకి కుమార్తె, కుమారుడు. ఎమ్మెల్యే బోడె ప్రసాద్, మాజీమంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, మాజీ చైర్మన్లు పూర్ణచంద్రరావు, ఖుద్దూస్ రఫీ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

డీఎస్సీ అభ్యర్థుల సవరణలకు చివరి అవకాశం: డీఈవో

మచిలీపట్నం టౌన్: డీఎస్సీ అభ్యర్థులకు టెట్ వివరాలు ఎడిట్ చేసుకునేందుకు, కన్ఫర్మ్ చేసుకునేందుకు 13న మరో అవకాశం కల్పించినట్టు డీఈవో తాహెరా సుల్తానా పేర్కొన్నారు. 13 తర్వాత మార్పులకు ఎలాంటి అవకాశం లేదన్నారు. అభ్యర్థులు వినియోగించుకోవాలన్నారు. విజయవాడ, మచిలీపట్నం, గుడివాడ మునిసిపల్ యాజమాన్యాల్లో పనిచేస్తున్న సెకండరీ గ్రేడ్, పండితుల కామన్ సీనియారిటీ లిస్టును వెబ్‌సైట్‌లో ఉంచామని, ఏవైనా అభ్యంతరాలుంటే శనివారం సాయంత్రం 5 గంటల్లోగా తెలపాలని డీఈవో తాహెరా సుల్తానా

రాయపూడిపై కేసు కొట్టివేత

అవనిగడ్డ: జనసేన పార్టీ కృష్ణా జిల్లా అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాల్‌పై 2017లో పెట్టిన ఎస్సీ, ఎస్టీ కేసును జిల్లా కోర్టు కొట్టివేసింది. అవనిగడ్డ ఏరియా ఆసుపత్రిలో సరైన వైద్యం అందటం లేదని 2017లో ఆసుపత్రి వద్ద నిరాహార దీక్ష చేయగా, రాయపూడి వేణుగోపాల్‌పై ఎస్సీఎస్టీ కేసు పెట్టగా, సుదీర్ఘ విచారణ అనంతరం జిల్లా కోర్టు ఈ కేసును కొట్టి వేసింది. సీనియర్ న్యాయవాది చౌడిశెట్టి బాలాజీ కోర్టులో వాదనలు వినిపించారు.

ఇళ్లమధ్య నీటిని తరలించేందుకు ఏర్పాట్లు

● మంత్రి నారాయణ



వన్‌టౌన్, సెప్టెంబరు 12 : వరద ముంపు ప్రాంతాల్లో ఇళ్ల మధ్య ఉన్న నీటిని బుడమేరులోకి తరలించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని మునిసిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం మంత్రి ఎమ్మెల్యేలు బొండా ఉమామహేశ్వరరావు, కొలికపూడి శ్రీనివాసరావుతో కలిసి పాయకాపురం, ఉడా కాలనీ, జర్నలిస్టు కాలనీ, కండ్రిక, అంబాపురం, తదితర ముంపు ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన పాయకాపురం నుంచి ముస్తాబాద వరకు బుడమేరు ప్రవహించే మార్గాన్ని పరిశీలించారు. స్వల్పంగా ఉన్న వరద నీటిని బయటకు పంపింగ్ చేయటంపై అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, విజయవాడలో మొత్తం 32 డివిజన్లలో వరద నీరు దాదాపు తగ్గిపోయిందన్నారు. ఒకటి, రెండు డివిజన్లలో నీరు కొద్దిగా నిల్వ ఉందని, ఆ నీటిని బయటకు పంపించేందుకు అవసరమైన చోట్ల రోడ్లకు గండ్లు కొడుతున్నామని చెప్పారు. శుక్రవారం సాయంత్రానికి వరద నీరు బయటకు పంపింగ్ చేస్తామని పేర్కొన్నారు. అన్ని డివిజన్లలో శానిటేషన్ కూడా పూర్తిగా వస్తుందన్నారు. వరద ప్రాంతాలలో సాధారణ పరిస్థితి వస్తుందని తెలిపారు. మంత్రి వెంట సంబంధిత విభాగాల అధికారులు ఉన్నారు.




నష్టాలను కేంద్ర బృందానికి చూపుతున్న కొల్లి ఈశ్వరబాబు, చలసాని ఆంజనేయులు

కృష్ణా మిల్క్‌కు సాయం అందించండి

● కేంద్ర బృందాన్ని కలిసిన యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు

చిట్టినగర్, సెప్టెంబరు 12 : లక్షా యాభై వేల కుటుంబాల సంస్థ కృష్ణా మిల్క్ యూనియన్‌కు వరద ముంపుతో అపార నష్టం కలిగిందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యూనియన్‌ను ఆదుకోవాలని చైర్మన్ చలసాని ఆంజనేయులు, ఎండీ కొల్లి ఈశ్వరబాబులు గురువారం ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వరద ముంపు ప్రాంతాల పరిశీలకులు కేంద్ర హోం వ్యవహారాల జాయింట్ సెక్రటరీ అనిల్ సుబ్రమణ్యం, కలెక్టర్ సృజనలను కలిసి వినతి పత్రం అందజేశారు. వరద ముంపు నష్టానికి సంబంధించి ప్యాక్టరీ ఫోటోలను కమిటీకి చూపించారు. ఫ్యాక్టరీ పునరుద్ధరణకు కేంద్ర ప్రభుత్వం తక్షణమే సహాయం అందించాలని చైర్మన్ చలసాని ఆంజనేయులు, ఎండీ కొల్లి ఈశ్వరబాబులు కేంద్ర బృందాన్ని కోరారు.

చంద్రబాబును కలిసిన సత్యసాయి ట్రస్ట్ ప్రతినిధి రత్నాకర్



విజయవాడ, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి) : శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్ సీఎం చంద్రబాబును గురువారం కలిశారు. అనంతరం మంత్రి లోకేష్‌ను కలిశారు. విజయవాడలో సత్యసాయి ట్రస్ట్ చేపడుతున్న సేవా కార్యక్రమాలను ఆయన వివరించారు. ముంపు ప్రాంతాల్లో 100 ట్రక్కుల రిలీఫ్ మెటీరియల్‌ను అందజేశామని వివరించారు.

డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి రూ.5 లక్షలు



వన్‌టౌన్ : వరద బాధితుల సహాయార్థం సీఎం రిలీఫ్ ఫండ్‌కు ప్రముఖ మానసిక వైద్యులు డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి, డాక్టర్ విశాల్, డాక్టర్ స్వప్నలు గురువారం సీఎం చంద్రబాబు నాయుడుని కలిసి రూ.5 లక్షలు విరాళాన్ని అందచేశారు. వరద బాధితులకు సహాయం అందించేందుకు ఈ విరాళాన్ని అందచేసినట్లు రామసుబ్బారెడ్డి తెలిపారు.

రోటరీ అమరావతి క్లబ్ సభ్యుల రూ.3 లక్షలు



ముఖ్యమంత్రి సహాయనిధికి రోటరీ క్లబ్ అమరావతి సభ్యులు గురువారం సీఎం చంద్రబాబును కలిసి రూ.3 లక్షల రూపాయల విరాళాన్ని అందచేశారు. ఈ విరాళమే కాకుండా వరద బాధితుల సహాయార్థం రూ.30 లక్షల వ్యయం చేశారని రోటరీ ఫౌండేషన్ 28వేల డాలర్ల మేరకు డిజాస్టర్ ఫండ్ మంజూరు చేయటం గురించి నామినేట్ అయిన రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ గుత్తికొండ శ్రీరామ్ సీఎంకు వివరించారు. సీఎం చంద్రబాబు వారికి అభినందనలు అందజేశారు. వరద బాధితులకు ఆహారం, నిత్యావసర సరుకులు, దుస్తులు, వైద్య సహాయం అందిస్తున్నట్లు కూడా శ్రీరామ్ తెలిపారు. సహాయ గవర్నర్ డాక్టర్ శ్రీహర్ష, క్లబ్ ప్రెసిడెంట్ డాక్టర్ ప్రఫుల్, కార్యదర్శి వినయ్, డాక్టర్ సుదీప్తి, కిరత్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.

కళ్లే లలిత వీధిలో అన్నదానం



ఆహారం వడ్డిస్తున్న కళ్లే నాగేశ్వరరావు కుటుంబసభ్యులు

వన్‌టౌన్ : అజిత్ సింగ్‌నగర్, కళ్లే లలిత వీధిలో బుడమేరు వరద ముంపు బాధితులకు గురువారం కళ్లే లలిత ట్రస్ట్ డైరెక్టర్ సీతామహాలక్ష్మి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత కళ్లే లలిత చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు సమర్పించారు. ట్రస్ట్ అధ్యక్షుడు నాగేశ్వరరావు వరద బాధితులకు, పేదలకు అన్న సమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ కళ్లే లలిత మృతి చెందినప్పటి నుంచి ప్రతి నెలా 12వ తేదీన క్రమం తప్పకుండా గత 31 నెలలు నుండి పేదలకు అన్నవితరణ చేస్తున్నట్లు తెలిపారు. బుడమేరు వరద ముంపు అందరినీ బాధితులను చేసిందని, తనకు కలిగిన స్థోమతను బట్టి పేదలకు, వరద బాధితులకు ఆహారాన్ని అందచేసినట్టు తెలిపారు. రానున్న రోజుల్లో కూడా ట్రస్ట్ సేవలను కొనసాగిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ముప్పూరి హరీష్, ఎం. జస్విన్, జి.ధృవన్‌లతో పాటు స్థానిక పెద్దలు పలువురు పాల్గొన్నారు.



యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులుకు చెక్కులు అందజేస్తున్న గన్నవరం పాలసొసైటీ అధ్యక్షుడు పాలడుగు వెంకటరామవరప్రసాద్ తదితరులు

కృష్ణామిల్క్ యూనియన్‌కు పాడిరైతుల చేయూత

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : దశాబ్ధాలుగా పాడిరైతుల అభివృద్ధికి సేవలందించిన విజయవాడ పాలఫ్యాక్టరీ మంపుబారిన పడి అపార నష్టం వాటిల్లడంతో తమదైన సంస్థ పునరుద్ధరించేందుకు పాడిరైతులు స్వచ్ఛందంగా చేయూత అందిస్తున్నారు. వీరవల్లి ప్రాజెక్ట్ కామధేను(పాల ఫ్యాక్టరీ) ఆవరణలో గురువారం గన్నవరం పాలసొసైటీ అధ్యక్షుడు పాలడుగు వెంకటరామవరప్రసాద్(నాని) ఆధ్వర్యంలో రూ.1,01,116, దావాజిగూడెం పాలసొసైటీ అధ్యక్షుడు గొంది నరేంద్ర ఆధ్వర్యంలో రూ.1,01,116 విరాళాల చెక్కును చైర్మన్ చలసాని ఆంజనేయులుకు అందజేశారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పాడిరైతులు విపత్కర పరిస్థితుల్లో ఉన్న తమదైన కృష్ణామిల్క్ యూనియన్‌కు చేయూత నందించేందుకు తమ వంతు సహకారంగా నెలవారి బిల్లుల్లో రెండు రోజుల పాలసేకరణ విలువ సుమారు రూ. 10లక్షల విరాళాన్ని ఎంపీఏ అసోసియేషన్ అధ్యక్షుడు ఘంటా నాగేశ్వరరావు ద్వారా చైర్మన్ చలసానికి అందజేశారు. పాల ఫ్యాక్టరీ పునరుద్ధరణకు పశ్చిమ గోదావరి జిల్లా పాడిరైతులతో పాటు అన్ని పాల సొసైటీల సభ్యుల చేయూత సమిష్టితత్వానికి నిదర్శనమని చలసాని ఆంజనేయులు అన్నారు.

నీరు పోయేందుకు.. భారీ గండ్లు



వరద ముంపు ప్రాంతాల్లో పంట పొలాల మధ్య ఉన్న నీటిని బుడమేరులోకి తరలించేందుకు అవసరమైన ఏర్పాట్లు యుద్ధ ప్రాతిపదికన చేస్తున్నారు. మునిసిపల్ మంత్రి నారాయణ ఆదేశాల మేరకు గురువారం ముస్తాబాద వద్ద వరద నీటిని బయటకు పంపింగ్ చేసేందుకు రోడ్లకు గండ్లు కొట్టారు. శుక్రవారం సాయంత్రానికి వరద నీరు బయటకు పోయే ఏర్పాట్లు చేస్తున్నారు.

\- విజయవాడ



కేంద్ర బృందానికి బుడమేరు గురించి వివరిస్తున్న ఈఎన్‌సీ

బీడీసీ గండ్ల పూడిక పనులు పరిశీలించిన కేంద్ర బృందం

జి.కొండూరు,/ఇబ్రహీంపట్నం రూరల్, సెప్టెంబరు 12: శాంతినగర్ - కవులూరు గ్రామాల మధ్య బుడమేరు గండ్లు పూడ్చిపించిన ప్రదేశాన్ని, ఈలప్రోలులో ముంపుకు గురైన పంట పొలాలను ఇంటర్ మినిస్ట్రీయల్ సెంట్రల్ టీమ్ మినిస్ట్రీ ఆఫ్ హోం ఎఫైర్స్ జాయింట్ సెక్రటరీ అనిల్ సుబ్రహ్మణ్యం సారథ్యంలో గురువారం పరిశీలించారు. బీడీసీకి పడిన గండ్లు పూడ్చించిన విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. వచ్చిన వరద వివరాలను నమోదు చేసుకున్నారు. జలవనరులశాఖ ఈఎన్‌సీ, మంత్రి నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్, మాజీమంత్రి ఉమామహేశ్వరరావులు వారికి ఇక్కడ పరిస్థితిని వివరించారు. ఈలప్రోలు గ్రామంలో పంటలు పాడైన విషయాన్ని ఎమ్మెల్యే వారికి వివరించారు.

పోలీసులకు వరద ఫీవర్!

పది రోజులపాటు ముంపు ప్రాంతాల్లో విధులు

జ్వరాల బారిన పడుతున్న కాప్స్

ప్రతీ పీఎస్‌లో ఐదారుగురికి జ్వరాలు





సహాయ కార్యక్రమాల్లో పోలీసు సిబ్బంది (ఫైల్)

(ఆంధ్రజ్యోతి - విజయవాడ) : పోలీసులకు వరద 'ఫీవర్' పట్టుకుంది. పదిరోజులపాటు రేయింబవళ్లు వరదల్లో సేవలు అందించిన పోలీసులకు జ్వరాలు పట్టుకుంటున్నాయి. ఒకరి తర్వాత తీవ్ర జ్వరాలతో బాధపడుతున్నారు. ఈనెల ఒకటో తేదీన బుడమేరు డైవర్షన్ కెనాల్ (బీడీసీ)కి మూడుచోట్ల గండ్లు పడటంతో విజయవాడకు శివారు ప్రాంతంగా ఉన్న అజిత్‌సింగ్‌నగర్, పాయకాపురం, నున్న, అంబాపురం, జక్కంపూడి కాలనీ, కండ్రిక ప్రాంతాలు పూర్తిగా నీట మునిగాయి. అదే రోజున ప్రకాశం బ్యారేజ్‌కు రికార్డు స్థాయిలో 11.47లక్షల క్యూసెక్కుల వరద వచ్చింది. దీనితో రామలింగేశ్వర నగర్, రాణిగారితోట ప్రాంతాలకు నీళ్లు వచ్చాయి. అజిత్‌సింగ్ నగర్ పరిసర ప్రాంతాలు పది రోజులపాటు ముంపులో ఉన్నాయి. వరద సహాయక చర్యల కోసం ఎన్టీఆర్ జిల్లా పోలీసు కమిషనరేట్ పరిధిలో ఉన్న 5వేల మంది సిబ్బందిని రంగంలోకి దింపారు. ఇదికాకుండా వివిధ జిల్లాల నుంచి మరో 5500 మంది సిబ్బందిని విధులకు రప్పించారు. మొత్తంగా ఒక్క పోలీసుశాఖ నుంచే 10,500 మంది సిబ్బంది వరద సహాయక విధుల్లో పాల్గొన్నారు.

వరదలు వచ్చినప్పుడు అజిత్‌సింగ్, వాంబేకాలనీ, పాయకాపురం, రాజీవ్‌నగర్ ప్రాంతాల్లో పీకల్లోతు వరకు నీళ్లు వచ్చాయి. ముంపు ప్రాంతాల్లో బాధితులను బయటకు తీసుకురావడానికి పోలీసులు వర్షాన్ని సైతం లెక్కం చేయకుండా నీళ్లలోకి దిగారు. బోట్లలో ముంపులో ఉన్న ఇళ్ల వద్దకు వెళ్లారు. వృద్ధులు, పిల్లలను భుజాన వేసుకుని వరద నీటిలో నుంచి నడుచుకుంటూ వచ్చారు. మరికొంతమంది ఆహారాన్ని అందజేయడానికి నీటిలోనే వీధుల్లో తిరిగారు. కొందరు పోలీసులు వర్షంలో తడుస్తూ నడిరోడ్డుపై విధులు నిర్వర్తించారు. అజిత్‌సింగ్‌నగర్ ప్రాంతంలో వరద ముంపు ఎక్కువగా ఉండడంతో అందరూ ఈ పరిసర ప్రాంతాల్లో దృష్టి కేంద్రీకరించారు. పోలీసులంతా పగలు, రాత్రి తేడా లేకుండా వర్షంలో, వరద నీళ్లలో విధులు నిర్వర్తించారు. ముంపు ప్రాంతాల్లో సాధారణ పరిస్థితి రావడంతో రెండు రజుల క్రితమే ఎక్కడి పోలీసులు అక్కడికి వెళ్లిపోయారు. ఎన్టీఆర్ పోలీసు కమిషనరేట్ పరిధిలో ఉన్న సిబ్బంది మొత్తం స్టేషన్లలో రిపోర్టు చేశారు. పదిరోజులపాటు 24/7 పనిచేసిన పోలీసులపై ఆ ప్రభావం ఇప్పుడు కనిపిస్తోంది. ఒక్కొక్కరికి విష జ్వరాలు సోకుతున్నాయి. జ్వరం, తలనొప్పి, దగ్గు వంటి లక్షణాలతో బాధపడుతున్నారు.



మ్యాప్ పరిశీలిస్తున్న కలెక్టర్ బాలాజీ, ఎస్పీ గంగాధర్‌రావు

పోలీసు అకాడమీకి స్థల పరిశీలన

గన్నవరం, సెప్టెంబరు 12 : ఆంధ్రప్రదేశ్ పోలీస్ అకాడమి కోసం గన్నవరం మండలం కొండపావులూరు సర్వే నెంబర్ 6ను కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, ఎస్పీ ఆర్.గంగాధర్‌రావులు గురువారం పరిశీలించారు. సర్వే నెంబర్‌లో ఎంత భూమి ఉంది, ఎంత భూమిని ప్రభుత్వ సంస్థలకు కేటాయించారు వివరాలను తెలుసుకున్నారు. సర్వే నెంబర్ 6కు సంబంధించిన మ్యాప్‌ను పరిశీలించారు. 42ఎకరాల స్థలాన్ని చూశారు. ఏపీ పోలీస్ అకాడమీకి ఈ ప్రాంతం అనువుగా ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. విజయవాడ నగరానికి, విమానాశ్రయానికి దగ్గరగా ఉండటంతో సర్వే నెంబర్ 6లో 42ఎకరాల భూమిని చూశారు.



చంద్రబాబుకు చెక్కు అందచేస్తున్న క్రెడాయ్ ప్రతినిధులు

ముఖ్యమంత్రి సహాయ నిధికి క్రెడాయ్ రూ.50 లక్షల విరాళం

వన్‌టౌన్ : వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయనిధికి క్రెడాయ్ ఆంధ్రప్రదేశ్ విభాగం గురువారం సీఎం చంద్రబాబును కలిసి రూ.50 లక్షలు విరాళంగా అందచేశారు. క్రెడాయ్ ఏపీ చైర్మన్ ఆళ్ల శివారెడ్డి, ప్రెసిడెంట్ వై.వి.రమణరావు, ప్రధాన కార్యదర్శి బాయన శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు. ఏపీలోని క్రెడాయ్‌కు చెందిన 20 చాప్టర్‌లు గత పది రోజులుగా వరద బాధితులకు ఆహారం, నీరు, పాలు, హెల్త్ కిట్‌లు, బిస్కెట్ ప్యాకెట్లు అందచేశామన్నారు. క్రెడాయ్ ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాల్లో సామాజిక సేవా దృక్పథంతో రూ.50లక్షల వరకు విరాళాలు అందచేశామన్నారు. దాంతోపాటుగా విశాఖపట్నం, గుంటూరు, కర్నూలు,కాకినాడ, రాజమండ్రి, ఒంగోలు, తిరుపతి, నెల్లూరు, విజయ నగరం, శ్రీకాకుళం, అనంతపురంలతో పాటు అన్ని క్రెడాయ్ చాప్టర్ల సహకారంతో రూ.50 లక్షలు విరాళం ఇప్పుడు అందచేశామని, విజయవాడ చాప్టర్ మరో రూ.20లక్షలు విరాళంగా అందచేసినట్లు తెలిపారు.

బాధితులకు సహాయంగా.. ఏపీ ఎన్జీవో

చిట్టినగర్ : వరద బాధితులకు ప్రతిఒక్కరూ సహాయంగా నిలవాలని ఏపీ ఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు కె.వి. శివారెడ్డి అన్నారు. చిట్టినగర్‌లోని కలరా హాస్పటల్ సమీపంలోని వివిసి కాలనీలో గురువారం ఏపీ ఎన్జీఓ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జిల్లా ఏపీ ఎన్జీవో సంఘం తరపున వరద బాధితులకు వస్త్రాల కిట్లను పంపిణీ చేశారు. వరద బాధిత కుటుంబాలకు అండగా ఉండేందుకు ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల పక్షాన ఒకరోజు బేసిక్ పే రూ.120 కోట్లు ఆర్థిక సహాయాన్ని అందచేసేందుకు సీఎం చంద్రబాబుకు అంగీకారాన్ని తెలియజేశామన్నారు.

ముందస్తు చర్యల్లో ఇరిగేషన్ విఫలం

సహాయ చర్యల్లో చంద్రబాబు శ్రద్ధ అభినందనీయం : సీపీఐ నేత రామకృష్ణ

జి.కొండూరు : రాష్ట్రంలో విశాఖపట్నం తర్వాత అతిపెద్ద నగరం విజయవాడ బుడమేరు వరదలో మునిగిపోవడానికి ఇరిగేషన్ అధికారుల పూర్తి వైఫల్యమే ప్రధాన కారణమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ఆరోపించారు. బీడీసీ గండ్ల పూడిక పనుల్ని, వెలగలేరు హెడ్ రెగ్యులేటర్‌ను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సీఎం చంద్రబాబు, మంత్రి నిమ్మల రామానాయుడు గండ్ల పూడిక విషయంలో తీసుకున్న శ్రద్ధ అభినందనీయమన్నారు. సీఎంతో పాటు మంత్రులు పనిచేయడమే తప్ప ఇరిగేషన్ అధికారుల పాత్ర ఏమాత్రం కనిపంచలేదన్నారు. కృష్ణానదికి అంత నీరు వదలాల్సిన అవసరం లేదన్నారు. నాగార్జున సాగర్, పులిచింతల, శ్రీశైలం డ్యామ్‌లో నీరు నిల్వ చేసుకునే అవకాశం ఉన్నా ఆవిషయంపై దృష్టి పెట్టకుండా నీరు మొత్తం కృష్ణాకు వదిలేశారని అవి మొత్తం సముద్రం పాలయ్యిందన్నారు. అసలు ఇంజనీరింగ్ అధికారులు పూర్తిగా పని మర్చిపోయారన్నారు. నీటి విడుదల విషయంలో ఏమాత్రం శ్రద్ధ లేదన్నారు. సీఎం చెప్పాలి, మంత్రి చెప్పాలి అనుకుంటున్నారే తప్ప స్వతంత్ర నిర్ణయాలు తీసుకోలేకపోవడం వైఫల్యమే అన్నారు. బుడమేరు, కొల్లేరులో ఆక్రమణలు తొలగించేందుకు తెలంగాణ రాష్ట్రంలో మాదిరిగా హైడ్రా ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి ఒక నివేదిక తయారు చేశామని దాన్ని సీఎంకు అందిస్తామన్నారు. ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనెపూడి శంకర్, అక్కినేని వనజ, సీహెచ్ కోటేశ్వరరావు, పటాపంచల జమలయ్య, గుడూరు శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంగళగిరిలో త్వరలో క్రికెట్ హబ్

● ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)

విజయవాడ, వన్‌టౌన్, సెప్టెంబరు 12 : మంగళగిరిలో త్వరలో క్రికెట్ హబ్ ఏర్పాటు చేస్తామని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. మంగళగిరిలోని ఆంధ్రా క్రికెట్ అకాడమీ కార్యాలయంలో గురువారం ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అపెక్స్ కౌన్సిల్ సమావేశం జరిగింది. సమావేశానికి అధ్యక్షత వహించిన ఆయన మీడియాతో మాట్లాడుతూ, అతిత్వరలో మంగళగిరిలో క్రికెట్ స్టేడియం పూర్తిచేసి అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడేందుకు పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు. మంగళగిరి ఎమ్మెల్యే, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ సహకారంతో రోడ్లు, పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేస్తామన్నారు. విశాఖ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియాన్ని కూడా అభివృద్ధి చేస్తామన్నారు. త్వరలోనే స్పోర్ట్స్ హబ్‌ను కూడా ఏర్పాటు చేస్తామని తెలిపారు. సమావేశంలో ఏసీఏ ఉపాధ్యక్షుడు వెంకట ప్రశాంత్, కార్యదర్శి సానా సతీష్, జాయింట్ సెక్రటరీ విష్ణుకుమార్ రాజు, కోశాధికారి దండమూడి శ్రీనివాస్, కౌన్సిలర్ గౌరు విష్ణుతేజ్ పాల్గొన్నారు.

సీతారాం ఏచూరి మృతికి యార్లగడ్డ సంతాపం

గన్నవరం: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి పట్ల ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు గురువారం ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. దేశ రాజకీయాల్లో సీతారాం ఏచూరి మంచి వ్యక్తి అని అభివర్ణించారు. కమ్యూనిస్టు పార్టీకి, దేశానికి, ప్రజలకు ఎంతో సేవచేసిన ఏచూరి మృతి బాధాకరమన్నారు. సామాజిక కార్యకర్త, కాలమిస్ట్‌గా గుర్తింపు పొంది పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడిగా 2005 నుంచి 2017 వరకూ రాజ్యసభ సభ్యుడిగా కొనసాగారన్నారు. కడవరకు సీపీఎంలో నిబద్ధత కలిగిన వ్యక్తిగా కొనసాగారన్నారు. ప్రజాసమస్యల పరిష్కారానికే ప్రజా ఉద్యమాలకు తన జీవితాన్ని అంకితం చేసిన మహా యోధుడు సీతారాం ఏచూరి అని కొనియాడారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

పర్యావరణ హిత భక్తజన ప్రియ లంబోదరుడు

72 అడుగుల మట్టిగణపతికి విశేష ఆదరణ



విద్యాధరపురం : డూండీ గణేష్ సేవా సమితి ఆధ్వర్యంలో వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. గణపతిని భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకుంటున్నారు. పర్యావరణహితంగా పశ్చిమ నియోజకవర్గం, లేబర్ కాలనీలోని సితార జంక్షన్‌లో 72 అడుగుల మహా మట్టిగణపతి విగ్రహాన్ని నిర్వాహకులు ఏర్పాటు చేశారు. వినాయక చవితి ఉత్సవాలు ప్రారంభానికి ముందర 72 అడుగుల మహా మట్టిగణపతి విగ్రహానికి జరిగిన శంకుస్థాపన కార్యక్రమంలో విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) సతీమణి జానకీలక్ష్మి, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.



సీపేజ్ అరెస్టు పనుల్ని పరిశీలిస్తున్న మంత్రి నిమ్మల

ఇరిగేషన్ అధికారులపై మంత్రి నిమ్మల అగ్రహం

● పని నాణ్యతపై పెదవివిరుపు

● సస్పెండ్ చేయాల్సి వస్తుందని ఫోన్‌లో ఉన్నతాధికారులకు క్లాస్

జి.కొండూరు : బీడీసీ గండ్ల వద్ద సీపేజ్ అరెస్టు పనులు జరుగుతున్న తీరుపై జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. గురువారం ఆయన బీడీసీ గండ్ల పూడిక అనంతరం నిర్వహిస్తున్న సీపేజ్ అరెస్టు పనుల్ని పరిశీలించారు. మంత్రి పనుల వద్దకు వచ్చిన సమయంలో అక్కడ ఇరిగేషన్ అధికారులు లేకపోవడం పర్యవేక్షణ లేకుండా పనులు జరుగుతుండటంతో ఇరిగేషన్ ఉన్నతాధికారులకు ఫోన్ చేసి క్లాస్ తీసుకున్నారు. పనిప్రదేశంలో ఎవ్వరూ లేకుండా పనులు చేస్తే నాణ్యత ఎలా ఉంటుందని ప్రశ్నించారు. పూడ్చించిన గండ్ల నుంచి చుక్క నీరు లీకు కాకుండా చేయాలని ఆదేశించారు. పనుల నాణ్యత పట్ల నిర్లక్ష్యంగా ఉన్న అధికారులను సస్పెండ్ చేస్తే మిగిలిన వారు దారికి వస్తారని ఆయన మండిపడ్డారు. పూడ్చించిన గండికి మధ్యలో సుమారు నాలుగు మీటర్ల గ్యాప్ ఉంచి మరో బండ్ వేశామని ఆఖాళీ ప్రదేశంలో మట్టితో నింపి సీపేజ్ అరెస్టు చేస్తామన్నారు. అయితే ఆఖాళీ ప్రదేశంలో మట్టి కంటే రాళ్లు ఎక్కువగా ఉండటం పట్ల ఆయన తీవ్ర అసంతృప్తి చెందారు. రాళ్లు లేకుండా మట్టితో 2 అడుగుల చొప్పున లేయర్ లేయర్‌గా వేసి దాన్ని యంత్రాలతో బలోపేతం చేయాలని సూచించారు. పనుల పర్యవేక్షణపై ఇరిగేషన్‌శాఖ నిర్లక్ష్యాన్ని ఆయన పూర్తిగా తప్పు బట్టారు.



రెడ్డిగూడెంలో వరద బాధితులకు నిత్యావసరాలు ఇస్తున్న ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే వసంత

వరద బాధితులను ప్రభుత్వం ఆదుకుంటుంది

రెడ్డిగూడెం, గొల్లపూడి, సెప్టెంబరు 12 : వరద బాధితులకు ఎన్డీఏ ప్రభుత్వం పూర్తిగా అండగా ఉంటుందని సాధారణ పరిస్థితులు వచ్చే వరకు వారికి తోడుగా నిలుస్తుందని మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ అన్నారు. విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)తో కలిసి రెడ్డిగూడెం వరద బాధితులకు నిత్యావసరాలను అందించారు.



నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలి

● మంత్రి డోలా

రెడ్డిగూడెం/జి.కొండూరు, సెప్టెంబరు 12: గురుకులాల్లో నూటికి నూరు శాతం ఉత్తీర్ణత శాతం వచ్చేలా ఉపాధ్యాయులు పని చేయాలని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా వీరాంజనేయులు సూచించారు. కుంటముక్కల గురుకుల పాఠశాలకు పట్టిన వరద విషయాన్ని ఆయన టీడీపీ నేత సుకవాసి శ్రీహరిని అడిగి తెలుసుకున్నారు. రంగాపురం గురుకుల పాఠశాలలో విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. విద్యార్థులకు అందించే డ్రింకింగ్ వాటర్ వద్ద మాజీ సీఎం జగన్ బొమ్మలు ఉండటంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే వాటిని తొలగించాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలన్నారు.



అవార్డు అందుకున్న భాస్కర చంద్రశేఖర్

ప్రభుత్వ ఉద్యోగికి జాతీయ పురస్కారం

వన్‌టౌన్, సెప్టెంబరు 12 : ప్రభుత్వ ఉద్యోగిగా ఉంటూ తనదైన శైలిలో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న విజయవాడకు చెందిన కె.భాస్కర చంద్రశేఖర్‌కు నేషనల్ ఎక్సలెన్స్ అవార్డు (జాతీయ ప్రతిభా పురస్కారం) లభించింది. 2024వ సంవత్సరానికిగాను ఢిల్లీకి చెందిన ఆదిలీలా ఫౌండేషన్ ఈ అవార్డును ప్రకటించింది. హైదరాబాద్‌లోని సుందరయ్య కళానిలయంలో నిర్వహించిన కార్యక్రమంలో భాస్కరచంద్రశేఖర్‌కు నిర్వాహకులు అవార్డును అందచేశారు. ఈ సందర్భంగా భాస్కర చంద్రశేఖర్ మాట్లాడుతూ, ఉద్యోగ బాధ్యతల నిర్వహణతో పాటు ప్రాణాపాయ స్థితిలో ఉన్న ప్రజలను రక్షించటం, పేదవారిని ఆదుకోవటం, అనాధ ఆశ్రమాలలోని వారికి పండ్లు అందించటం, తాను చేయగలిగినంత సహాయం అందించటం వంటి కార్యక్రమాలు ఎంతో తృప్తి, ఆనందం కలిగిస్తున్నాయన్నారు.

విజయవాడ రైల్వే స్టేషన్‌కు ఎన్ఎస్‌జీ -1 హోదా

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : బెజవాడ రైల్వే స్టేషన్ ఎన్ఎస్‌జీ-1 హోదాను అందుకుంది. ఇప్పటి వరకు విజయవాడ రైల్వేస్టేషన్ ఎన్ఎస్‌జీ-2 హోదాలో ఉండేది. తొలిసారిగా ఎన్ఎస్‌జీ-1 హోదాను అందుకుంది. విజయవాడ రైల్వేస్టేషన్ ద్వారా రూ. 520 కోట్ల ఆదాయాన్ని ఆర్జించటం, 2 కోట్ల మంది ప్రయాణీకులు ఇక్కడి నుంచి ఒక్క ఏడాదిలో బయలుదేరటం వల్ల ఈ హోదా వచ్చింది. దేశంలోనే ఎన్ఎస్‌జీ-1 హోదా కలిగిన రైల్వేస్టేషన్లు మొత్తం 28 ఉన్నాయి. ఈ జాబితాలో విజయవాడ రైల్వేస్టేషన్ కూడా స్థానాన్ని సాధించింది. సంవత్సరానికి రూ.500 కోట్లు సాధించే రైల్వే స్టేషన్లకు ఎన్ఎస్‌జీ - 1 హోదా ఇవ్వటం వల్ల ఆయా రైల్వేస్టేషన్ల అభివృద్ధికి రైల్వేబోర్డు సహకరిస్తుంది. విజయవాడ ఏ1 రైల్వేస్టేషన్‌కు సంబంధించి రూ.1000 కోట్లతో స్టేషన్ రీ డెవలప్‌మెంట్ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. రీ డెవలప్‌మెంట్ డిజైన్స్ ప్రస్తుతం తుది దశలో ఉన్నాయి. విజయవాడ రైల్వేస్టేషన్ ఎన్ఎస్‌జీ-1 హోదాను సాధించటంతో అతి త్వరలో రీ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులో భాగంగా భారీగా నిధులు మంజూరయ్యే అవకాశాలు ఉన్నాయి.

ఆంధ్రజ్యోతి
నవ్య
నివేదన
శుక్రవారం • 13 సెప్టెంబరు 2024



ఆలయ దర్శనం

తిలతర్పణపురి నరముఖ గణపతి





'తొండము నేకదంతమును...' అని ఆ ఆలయంలో గణేశుణ్ణి ప్రార్థించాలంటే కాస్త ఆలోచించాల్సిందే. ఎందుకంటే అక్కడ గణపతి తొండం, దంతం లేకుండా... నరముఖంతో దర్శనమిస్తాడు. ఈ ఆలయం తమిళనాడులోని పూన్‌తోట్టమ్ సమీపంలోని తిలతర్పణపురిలో (ప్రస్తుతం శీతలపతి గ్రామంలో) ఉంది. గణపతి గజముఖుడిగా కాకుండా... మానవ ముఖంతో కనిపించే ఆలయం ఇదొక్కటేనంటారు. దీనికి సంబంధించిన ఒక ఆసక్తికరమైన కథను స్థలపురాణం చెబుతోంది.

నలుగుపిండితో పార్వతీదేవి ఒక బొమ్మను తయారు చేసి, దానికి ప్రాణం పోసింది. ద్వారానికి ఆ బాలుణ్ణి కాపలాగా పెట్టి స్నానానికి వెళ్ళింది. అంతలో శివుడు అక్కడికి వచ్చాడు. ఆయనను లోపలికి వెళ్ళకుండా ఆ బాలుడు అడ్డుకున్నాడు. దాంతో శివుడు ఆగ్రహించి... ఆ బాలుడి తలను ఖండించాడు. తరువాత పార్వతీ దేవి ద్వారా ఆ బాలుడి గురించి తెలుసుకొని... ఏనుగు శిరస్సును ఆ బాలుడి తలకు అతికించాడు. ఆ గజాననుడు తదనంతరం గణాధిపతి అయ్యాడు. తదనంతర కాలంలో... మునుల కోరిక మేరకు తిలతర్పణపురిలో ముక్తీశ్వరుడిగా శివుడు, స్వర్ణవల్లిగా పార్వతీదేవి కొలువయ్యారు. వినాయకుడు... గజముఖుడు కావడానికి ముందున్న రూపాన్ని చూడాలని శివుణ్ణి పార్వతి కోరగా... ఆయన అనుగ్రహించాడు. దానితో మానవ ముఖంతో గణేశుడు ఇక్కడ వెలిశాడు. పూర్వరూపంతో కనిపించే గణపతి కాబట్టి ఆయనను 'ఆది వినాయకర్' అంటారు. వాస్తవానికి ఈ ఆలయంలో ప్రధాన దైవం ముక్తీశ్వరుడు. కానీ ఇది 'నర గణపతి ఆలయం'గానే ప్రసిద్ధి చెందింది. ముక్తీశ్వరుడు, ఆయన దేవేరి స్వర్ణవల్లి, నర గణపతితోపాటు ఈ ఆలయంలో సూర్య, చంద్రుల విగ్రహాలు కూడా పూజలు అందుకుంటున్నాయి.

సుమారు 1400 ఏళ్ళ క్రితంనాటి ఈ వినాయక ఆలయం పితృదోష నివారణ క్షేత్రంగానూ ఖ్యాతిగాంచింది. ప్రతినెలా అమావాస్య నాడు, మహాలయ పక్షాల్లోనే కాదు... సాధారణ దినాల్లో సైతం ఎంతోమంది ఈ ఆలయం సమీపంలో ఉన్న చంద్రతీర్థం అనే కొలనులో స్నానం చేసి, పిండప్రదానాలు చేసి, తర్పణాలు వదిలి... శివపార్వతులను, గణపతిని దర్శించుకుంటారు. దీని వెనుక కూడా ఒక పౌరాణిక గాథ ఉంది. శ్రీరాముడు తన తండ్రి దశరథుడికి దేశంలోని పలుచోట్ల పితృకర్మలు జరిపి, పిండప్రదానాలు చేశాడట. కానీ దశరథుడికి ముక్తి లభించకపోవడంతో... శివుణ్ణి ప్రార్థించాడట. ఈ చంద్రతీర్థంలో స్నానం ఆచరించి, పితృతర్పణాలు ఆచరించాలని శివుడు ఆదేశించడంతో... శ్రీరాముడు ఆ విధంగా చేసి తండ్రికి ముక్తి కలిగించాడట. తిలల (నువ్వుల)తో తర్పణాలు వదిలే చోటు కాబట్టి దీనికి 'తిలతర్పణపురి' అనే పేరు వచ్చింది. ఇక్కడ ఆచరించే కర్మల ద్వారా పితృదేవతలు సంతృప్తులవుతారని, తమ వారసులు సుఖ సంతోషాలతో జీవించేలా ఆశీస్సులు అందజేస్తారనీ, భక్తిశ్రద్ధలతో నరముఖ గణపతిని ఆరాధిస్తే అన్ని సమస్యలు, జీవితంలోని ఆటంకాలు తొలగిపోతాయని భక్తుల విశ్వాసం. ప్రతినెలా సంకట హర చతుర్థి నాడు ఈ గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఈ ఆలయం తమిళనాడులోని కుంభకోణానికి 37 కిలోమీటర్ల దూరంలో ఉంది.

గీతాసారం

ఉపసంహరించుకోవడమే వివేకం


"తాబేలు తన అవయవాలను అన్ని వైపుల నుంచి లోపలికి ముడుచుకున్నట్టు... ఇంద్రియాలను విషయాసక్తుల నుంచి అన్ని విధాలా ఉపసంహరించుకున్న వ్యక్తి బుద్ధి స్థిరంగా ఉన్నట్టు భావించాలి" అని 'భగవద్గీత'లో శ్రీకృష్ణుడు చెబుతున్నాడు. శ్రీకృష్ణుడు ఇంద్రియాలకు చాలా ప్రాధాన్యం ఇస్తాడు. ఎందుకంటే అవి మన అంతర్గత ప్రపంచానికి, బాహ్య ప్రపంచానికి మధ్య ద్వారాలలాంటివి. తాబేలును ఉదాహరణగా తీసుకుంటే... అది ప్రమాదాన్ని ఎదుర్కొన్నప్పుడు తన అవయవాలను లోపలికి ముడుచుకుంటుంది. అదే విధంగా ఇంద్రియాలను ప్రేరేపించే, ప్రలోభపెట్టే విషయాలతో ఇంద్రియాలు జతకూడడం



గమనించినప్పుడు... మన ఇంద్రియాలను లోపలికి ఉపసంహరించుకోవాలని శ్రీకృష్ణుడు సలహా ఇస్తున్నాడు.

ప్రతి ఇంద్రియానికి రెండు భాగాలు ఉంటాయి. ఒకటి బయటికి కనిపించే కన్ను లాంటి బాహ్యమైన భాగం. రెండవది కన్నును నియంత్రించే మెదడులోని ఇంద్రియ నియంత్రిత భాగం. ఇంద్రియాలు, ఇంద్రియార్థాల మధ్య పరస్పర స్పందనలు రెండు స్థాయిలలో జరుగుతాయి. మొదటిది... కాంతి తాలూకు కణాలు (ఫోటాన్లు) బాహ్య ఇంద్రియ పరికరమైన కన్నును చేరినప్పుడు... కన్ను దానంతట అదే కాంతికి స్పందిస్తుంది. అదే విధంగా మిగిలిన ఇంద్రియ పరికరాలు కూడా తమతమ ఇంద్రియ విషయాలకు వాటంతట అవే స్పందిస్తాయి. ఇక రెండవ స్థాయి అనేది... ఇంద్రియాలకు, వాటిని నియంత్రించే మెదడులోని భాగాలకు మధ్య జరుగుతుంది.

చూడాలనే కోరికే కంటి వికాసానికి కారణం. ఆ కోరిక ఇంద్రియాన్ని నియంత్రిచే భాగంలో ఉంది. సాంకేతికపరంగా దాన్ని 'ప్రేరేపిత దృష్టి' (మోటివేటెడ్ పర్సెప్షన్) అని పిలుస్తారు. ఇక్కడ



మనం చూడాలనుకున్నవాటినే చూస్తాం. వినాలనుకున్నవాటినే వింటాం. కానీ సమగ్రంగా చూడలేం, సంపూర్ణంగా వినలేం. కృష్ణుడు ఇంద్రియాల గురించి ప్రస్తావించినప్పుడు... కోరికలను ఉత్పత్తి చేసే ఇంద్రియ నియంత్రక భాగం గురించి వివరిస్తున్నాడు. మనం ఇంద్రియాలను భౌతికంగా మూసేసినా... మన కోరికలను సజీవంగా ఉంచడం కోసం మనస్సు తన ఊహాశక్తిని ఉపయోగిస్తుంది. ఎందుకంటే మనస్సు ఈ నియంత్రణలన్నిటి కలయిక కాబట్టి. ఇంద్రియాలను నియంత్రించేవాటిని. ఇంద్రియాల భౌతిక భాగం నుంచి వేరు చేయాలని శ్రీకృష్ణుడు మనకు మార్గనిర్దేశం చేస్తున్నాడు. తద్వారా మనం ఎల్లప్పుడూ ఉత్తేజపరిచే లేదా నిరుత్సాహపరిచే బాహ్య పరిస్థితుల నుంచి స్వేచ్ఛను (మోక్షాన్ని) పొందుతాం. ఏ పరిస్థితుల్లో ఎప్పుడు వెనకడుగు వెయ్యాలో, అంటే ఇంద్రియాలను ఎప్పుడు ఉపసంహరించుకోవాలో తెలుసుకోవడమే వివేకం.



కె. శివప్రసాద్
ఐఎఎస్

శ్రద్ధ, విశ్వాసం ప్రధానం

తల్లితండ్రులను భగవంతుడికన్నా మిన్నగా భావించాలని, కన్నవారిని ఆదరించనివాణ్ణి భగవంతుడు కూడా క్షమించడని హిందూ సనాతన ధర్మం చెబుతోంది. పార్వతీ పరమేశ్వరులకు మూడుసార్లు ప్రదక్షిణ చేసినందుకు వినాయకుడికి దక్కిన ఫలమే గణాధిపత్యం. అందుకే తల్లితండ్రులకు, పూర్వులకు ఉత్తమగతులు కలిగేలా చేయడం ఒక బాధ్యతగా పూర్వులు నిర్దేశించారు. మనిషి తన జీవితంలో తీర్చుకోవలసినవి పంచ ఋణాలు. వాటినే 'పంచ యజ్ఞాలు' అని కూడా అంటారు. అవి దేవ, పితృ, ఋషి, భూత, మనుష్య ఋణాలు. వాటిలో ప్రధానమైనది పితృరుణం. ఆ ఋణం నుంచి విముక్తి పొందడానికి చేసే కర్మల్లో శ్రాద్ధకర్మ ఒకటి. 'శ్రార్థ కర్మ' అంటే 'శ్రద్ధతో చేసే కర్మ' అని అర్థం. గతించిన తల్లితండ్రులకు శ్రద్ధాభక్తులతో చేసే క్రతువు అది. ఇక్కడ ఆచార వ్యవహారాలకన్నా శ్రద్ధ, విశ్వాసం ముఖ్యం. ఒక్కొక్క మాసంలో ఒక్కొక్క దేవతకు ప్రాధాన్యాన్ని ఇచ్చే సంప్రదాయం... భాద్రపద మాసంలోని బహుళ పక్షాన్ని పితృ పక్షంగా నిర్దేశించింది. ఈ ప్రకారం... భాద్రపద బహుళ పాడ్యమి నుంచి అమాస్యవరకూ... పదిహేను రోజుల కాలాన్ని 'పితృపక్షం'గా లేదా 'మహాలయ పక్షం'గా పరిగణిస్తారు. ఈ రోజుల్లో శ్రార్థ కర్మలు నిర్వర్తించి... దాన, తర్పణ, సంతర్పణాది క్రియలు నిర్వహిస్తే... పితృదేవతలు సంతృప్తి చెంది... తమ వారసుల్ని అనుగ్రహిస్తారని శాస్త్రవచనం. దీన్ని మన పూర్వులు మరణించిన తిథినాడు లేదా పక్షంలో ఏదో ఒక రోజున... అదీ వీలు కాకపోతే అమావాస్య రోజున శ్రాద్ధకర్మలు ఆచరించాలి. అదీ కుదరకపోతే... శ్రద్ధాభక్తులతో తర్పణాలైనా వదలాలి. భాద్రపద మాసంలోని మహాలయ పక్షంతో కలిపి... పితృదేవతలను అర్పించే రోజులు ఏడాదిలో 96 ఉన్నాయి. వాటిలో పన్నెండు అమావాస్యలు ముఖ్యమైనవి. పలు ప్రాంతాల్లో అమావాస్య రోజున తర్పణాదులు నిర్వర్తించే సంప్రదాయం ఉంది.

మనకు మూడు శరీరాలు ఉంటాయని ధర్మ శాస్త్రాలు చెబుతున్నాయి. మొదటిది భౌతికంగా కనిపించే శరీరం. రెండోది ప్రేత శరీరం. మూడవది ఆత్మ... సూక్ష్మ శరీరం. వసు, రుద్ర, ఆదిత్య రూపాలు ఈ మూడింటికీ ప్రతీకలు. మన సంకల్పంలో పితరులను స్మరించుకుంటూ... వసు, రుద్ర, ఆదిత్య రూపాలకు ముమ్మారు తర్పణాలు వదిలి, ఆ తరువాత అన్న సంతర్పణ చేస్తే... శ్రాద్ధ కర్మ పరిపూర్ణం అవుతుందనేది శాస్త్రవచనం. మహాలయ పక్షానికి సంబంధించిన కథ ఒకటి ఉంది. కర్ణుడు దానశీలిగా ప్రసిద్ధి పొందాడు. మహాభారత యుద్ధంలో మరణించిన అతను స్వర్గలోకానికి వెళ్తూ ఉండగా... ఆకలి, దప్పిక కలిగాయి. తినడానికి పండు ముట్టుకున్నా, తాగడానికి దోసిటిలో నీరు తీసినా... అవి బంగారంగా మారిపోతున్నాయి. ఇదేమిటని అతను ఆశ్చర్యపోయాడు. అప్పుడు ఆకాశవాణి "కర్ణా! నీవు మహాదాతవు. కవచ కుండలాలతో సహా అన్నీ దానం చేసి... చేతికి ఎముకలేదనే పేరు సంపాదించావు. కానీ నీ చేత్తో ఎవరికీ పట్టెడు అన్నం పెట్టిన దృష్టాంతం లేదు. కాబట్టే ఈ దుస్థితి కలిగింది" అని చెప్పింది. అప్పుడు తన తండ్రి అయిన సూర్యుణ్ణి కర్ణుడు ప్రార్థించి... ఆయన అనుగ్రహంతో భూలోకానికి వచ్చాడు. పదిహేను రోజుల పాటు... తన రాజ్యంలోని అందరికీ షడ్రసోపేతమైన విందు చేసి, పితరులకు తర్పణాదులు విడిచాడు. తిరిగి స్వర్గలోకం చేరుకున్నాడు. ఆ పక్షమే 'మహాలయం' అనే పేరిట ప్రసిద్ధి చెందింది. "శ్రేష్ఠులైనవారు, విజ్ఞులు ఏది ఆచరించి మార్గనిర్దేశం చేస్తారో... దాన్ని సామాన్యులు ఆచరించి తరించవచ్చు" అని 'భగవద్గీత' చెప్పింది. పితృపక్షం కూడా అటువంటిదే. ఇది తమ వారసత్వాన్ని గుర్తుచేసుకొని, పూర్వులకు నివాళులు అర్పించే పుణ్యక్రతువు. పుణ్యఫలం కోసం ఇది ఆవశ్యకమైన కర్తవ్యం అన్నది పెద్దల మాట.

ఎ. సీతారామారావు


18 నుంచి మహాలయ పక్షం



విశేషం

సుభాషితం

జగజ్జేతలు



కాంతాకటాక్ష విశిఖా న ఖనంతి యస్య
చిత్తం న నిర్దహతి కోప కృశానుతాపః
కర్షంతి భూరి విషయాశ్చ న లోభ పాశైః
లోక త్రయం జయతి కృత్స్నమిదం స ధీరః...

అంటూ ధీరులైన వారి గుణాలను భర్తృహరి నీతిశతకంలో వర్ణించాడు. ఈ శ్లోకాన్ని...

మానవతీ కటాక్షశిత మార్గణముల్ విదలింప జాల వె
వ్వాని మనంబు కోపమయవహ్ని దహింపదు లోభపాశ సం
తానము మాల్యచందన వితానములన్ వెతసేయనోప కె
వ్వాని వశంబున మెలగు, వాడు జయించు జగంబులన్నియున్... అంటూ ఏనుగు లక్ష్మణకవి తెలుగువారికి అందించాడు.

భావం: లోకంలో అరిషడ్వర్గాలకు... అంటే కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలకు లోనుకానివారు అరుదుగా ఉంటారు. ఇవి మనిషి పతనానికి కారణమవుతాయి. వలపు చూపులకు లొంగిపోనివారు, కోపం అనే అగ్ని తమ మనసును దహించకుండా నిరోధించుకొనేవారు, చందనాలు, అత్తరులు తదితర సుగంధ ద్రవ్యాలకు, ఆడంబరమైన వస్త్రాలకు, సన్మాన సత్కారాలకు ప్రలోభపడనివారు, భోగభాగ్యాల మాయలో పడనివారు... వారే ధీరులు. వారు జగాలన్నిటినీ జయించగలరు.

చింతన

పరమాత్మ ఉనికే శ్వాస


శ్వాస అనేది దేహంలో జీవాత్మ రూపంలో ఉన్న పరమాత్మను సూచిస్తుంది. శ్వాస ఉంటేనే జీవుడు ఉంటాడు. జీవితం ఉంటుంది. శ్వాసతో మొదలై, శ్వాసతో అంతమయ్యేదే మానవ రూపంలో జీవుడి యాత్ర. జీవశక్తితో కూడిన ఆత్మనే 'జీవాత్మ' లేదా 'జీవుడు' అంటారు. బ్రహ్మ మనిషిని మట్టిబొమ్మగా సృష్టిస్తాడు. అందులో ఆత్మను, శ్వాసను నింపి, ఆయుష్షును నిర్ణయిస్తాడు. జీవుని ఆయువు ఎన్ని సంవత్సరాలు అనే లెక్కలో కాకుండా... ఎన్ని శ్వాసలు జీవిస్తాడు అనే లెక్కతో నిర్ణయమవుతుంది.

మనిషి నిమిషానికి సగటున 15 శ్వాసలు, 24 గంటలలో సుమారు 23 వేల శ్వాసలు ఖర్చు చేస్తూ... సృష్టి నియమానుసారం వంద నించి, నూట ఇరవై ఏళ్ళ ఆయుష్షును కలిగి ఉంటాడు. కోతి, కుక్క లాంటి జీవులు తమ శ్వాసలను అత్యంత త్వరిత గతిన ఖర్చు చేసుకొని... పది నించి పదిహేనేళ్ళు మాత్రమే బతుకుతున్నాయి. నిమిషానికి నాలుగు నుంచి ఆరు శ్వాసలు ఖర్చుచేసే రాకాసి తాబేళ్ళు 400 సంవత్సరాలు జీవిస్తున్నాయి. హిమాలయ యోగులు, ఋషులు యోగ సాధన ద్వారా శ్వాసను దీర్ఘకాలం బిగబట్టి... సహస్రారం నుంచి ప్రవహించే నిరంతర ప్రాణశక్తి ధారను నాడీమండలంలో ప్రసరింపజేసుకుంటూ, జీవ చైతన్య శక్తితో దేహాన్ని నింపుకొని, ఆయుఃప్రమాణంలోని శ్వాసలను విగుల్చుకుంటూ, ఆహారం లేకుండానే తపోదీక్షలో వందల ఏళ్ళు జీవించగలుగుతున్నారు.

పరిశీలించి చూస్తే... శ్వాస రెండు నాసికా రంధ్రాల నుంచి ఒకేసారి కాకుండా... ఎడమ, కుడి నాసికల నుంచి విడివిడిగా సమాన మాత్రలతో జరుగుతూ ఉంటుంది. ఎడమ నాసిక... శీతల లేదా చంద్రనాడి కాగా, కుడి నాసిక ఉష్ణ లేదా సూర్యనాడి. ఈ విధంగా శీతోష్ణ సమతుల్యం దేహంలో నెలకొంటుంది. కొన్ని నిర్ణీత ఘడియల కాలం (సుమారు రెండు నుంచి మూడు ఘడియల) తరువాత... సూర్య, చంద్ర నాడుల మధ్యలో ఊపిరి మారేటప్పుడు... నాసాగ్రస్థానంలో... నాడీ సంధి స్థానంలో కొన్ని క్షణాలు నిలిచి ఉంటుంది. నాలుగు సంధ్యాకాలాలలో... అంటే ఉదయం ఆరు గంటలకు, మధ్యాహ్నం పన్నెండు గంటలకు, సాయంత్రం ఆరు గంటలకు, రాత్రి పన్నెండు గంటల సమయంలో... శ్వాస నాసాగ్ర స్థానంలో... ఆజ్ఞాచక్రానికి దగ్గిరగా కొన్ని క్షణాలు ఎక్కువగా నిలిచి ఉంటుంది. కాబట్టి ధ్యానానికి ఈ సంధ్యా కాలాలు ఉత్తమమైనవి.

ఈ విధంగా ధ్యానం నాసాగ్ర నాడీ స్థానంలో కేంద్రీకృత మైనప్పుడు.. శ్వాసల సంఖ్య మెల్లమెల్లగా తగ్గుతాయి. మనోవృత్తులు నియంత్రితమవుతాయి. నిర్మల స్థితిలో, ఆనందమయమైన స్పందనలతో దేహంలో ఆరోగ్యకరమైన రసాయనాలు వ్యాపిస్తాయి. దీర్ఘ శ్వాసలు జరిగినప్పుడు... శ్వాసలు మిగలడం వల్ల ఆయుఃప్రమాణం పెరుగుతుంది. ఆరోగ్యం సమకూరుతుంది. దేహం లోపలి కర్మదోషాలు ఉపశమిస్తాయి. ప్రారబ్ధ (పూర్వ), ఆగామి (రాబోయే) కర్మలు సంస్కారం పొందుతాయి. తద్వారా జీవన గతి.. సుగమం, శుభకరం అవుతుంది. ఆధ్యాత్మిక ప్రగతికి సోపానం అవుతుంది. శ్వాసకు, మనస్సుకు ప్రత్యక్ష సంబంధం ఉందనేది అందరికీ తెలిసిన విషయమే. శ్వాస నియంత్రణలో ఉంటే మనోవృత్తులు శాంతిస్తాయి. మనస్సు నియంత్రణలో, నిర్మలంగా ఉంటుంది. ఇంద్రియాలను నియంత్రిస్తూ, బాహ్యవస్తువు లేదా విషయం మీద ధ్యాసను లగ్నం చెయ్యడాన్ని 'ధ్యానం' అంటారు. ధ్యాన మార్గాన్ని అవలంబించినప్పుడు... ధ్యాసను కేంద్రీకరించవలసింది శ్వాస మీదే. ఎందుకంటే శ్వాసే పరమాత్మ తాలూకు ఉనికి. శ్వాసమీద ధ్యాస నిలిపినప్పుడు... శ్వాసను సాక్షిగా జీవాత్మ దర్శిస్తూ, దానితో కదులుతూ ఆజ్ఞా చక్రం దగ్గర కేంద్రీకృతమవుతుంది. పరమాత్మ తత్త్వాన్ని అనుభూతి చెందుతుంది. ఈ విధంగా అలవాటయ్యాక... క్రమేపీ అసంకల్పితంగా లేదా స్వల్ప ప్రయాసతో అది ఆజ్ఞాచక్రంలో కేంద్రీకృతమై ఉండడం మొదలవుతుంది. ఆ ధ్యానావస్థ పరిణతి చెందినప్పుడు... పంచభుజాలు కలిగిన, పంచవర్ణ కాంతితో కూడిన నక్షత్ర రూపం కనిపిస్తుంది. అదే సంధ్యోపాసన అని యోగులు పేర్కొన్నారు.

శ్వాసను నియంత్రించడం వల్ల ఆధ్యాత్మిక ప్రగతితోపాటు భౌతిక ఆరోగ్య లాభాలు కూడా ఉన్నాయి. ప్రతి ఉచ్ఛ్వాసలో ప్రాణవాయువును శ్వాస కోశాల ద్వారా... లక్షలాది కణాల్లో, వాటికి అనుసంధానంగా ఉన్న సూక్ష్మ రక్త నాళికలలో నిండుతుంది. వాటిలో చేరి ఉన్న కర్బన వాయు కణాలను గ్రహించి నిశ్వాస ద్వారా విసర్జిస్తుంది. సగటు వయస్కుడైన మనిషి ఆరోగ్యంగా ఉండాలంటే... శరీరంలో ఉండే సుమారు అయిదున్నర లీటర్ల రక్తం నిమిషానికి కనీసం రెండుసార్లయినా ప్రాణవాయువుతో పరిశుద్ధమై, గుండె ద్వారా శరీరమంతా ప్రవహించాలని శాస్త్రీయ పరిశీలనలో తేలింది. ఆధునిక కాలమాన పరిస్థితుల్లో మానసికమైన, ఇతర ఒత్తిడుల వల్ల శ్వాస త్వరితగతిన జరిగినప్పుడు... రక్తశుద్ధి తగినంత మోతాదులో జరగదు. దీనివల్ల మెదడుకు, కండరాలకు కావలసిన ప్రాణవాయువు లోపించి, వివిధ రుగ్మతలకు కారణం అవుతోంది. ఆలోచనా శక్తి అస్తవ్యస్తమవుతోంది. ధారణాశక్తి, వివేకం లోపిస్తున్నాయి. ప్రాణాయామ, ధ్యాన ప్రక్రియల వల్ల శ్వాసలు నిర్ణీతగతిలో.. దీర్ఘంగా,ప్రశాంతంగా జరుగుతాయి. వివిధ ప్రక్రియల ద్వారా నాడీ శుద్ధి, రక్త శుద్ధి ఎక్కువగా జరుగుతుంది. రక్తంలో ప్రాణవాయువు పరిమాణం, శరీరంలో ప్రాణశక్తి మోతాదు పెరుగుతాయి. ఆహ్లాదకరమైన మానసిక, దైహిక ఆరోగ్యం చేకూరుతుంది. ఆకర్షణీయమైన తేజస్సు కలుగుతుంది.





దేవరకొండ శ్రీకాంత్
9676000600

తెలుసుకుందాం

మాయమైన మన విజ్ఞానం

భారతదేశం విజ్ఞాన ఖని. వేల సంవత్సరాల క్రితమే ఎందరో మహనీయులు నిత్య జీవితంలో మానవులకు ఉపయోగపడే ఎన్నో ఆవిష్కరణలు చేశారు. తాము సాధించిన జ్ఞానాన్ని, తెలుసుకున్న విషయాలను తరువాతి తరాలకు అందించడం కోసం... గ్రంథాలు రాశారు. అయితే విదేశీయుల దండయాత్రల్లాంటి సంఘటనల వల్లనో, భద్రపరచడంలో నిర్లక్ష్యం వల్లనో, ఇతర కారణాల వల్లనో అవి కాలగర్భంలో కలిసిపోయాయి. అటువంటి అపూర్వ గ్రంథాల్లో కొన్ని:

అక్షర లక్ష: ఇది వివిధ శాస్త్రీయ అంశాల సమాహారమైన... విజ్ఞాన సర్వస్వం లాంటి గ్రంథం. దీని రచయిత వాల్మీకి మహర్షి. దీనిలో రేఖాగణితం, బీజగణితం, త్రికోణమితి, భౌతిక శాస్త్రం తదితర 325 రకాల గణిత ప్రక్రియలు, ఖనిజ శాస్త్రం, జలయంత్ర శాస్త్రం, భూగర్భశాస్త్రం, ఉష్ణాన్ని కొలిచే పద్ధతులు ఇలా ఎన్నిటినో వివరించారు.

శబ్ద శాస్త్రం: సృష్టిలో ఉన్న అన్ని రకాల శబ్దాలు, ప్రతిధ్వనుల గురించి చర్చించిన ఈ గ్రంథ రచయిత ఖండిక ఋషి. కృత్రిమంగా శబ్దాలను సృష్టించడం, వాటి స్థాయి, వేగాలను కొలవడం లాంటి అంశాలు ఇందులోని అయిదు అధ్యాయాల్లో వివరించారు.

శిల్ప శాస్త్రం: రచయిత కశ్యప ముని. దీనిలో 22 అధ్యాయాలు ఉన్నాయి. 307 రకాల శిల్పాలు, 101 రకాల విగ్రహాల గురించి సంపూర్ణంగా చర్చించారు. అలాగే ఆలయాలు రాజభవనాలు, చావడులు తదితర నిర్మాణ విషయాలు వెయ్యికి పైగా ఉన్నాయి. ఇదే శాస్త్రంపై మయుడు, అలాగే విశ్వామిత్రుడు, మయుడు, మారుతి లాంటి ఋషులు చెప్పిన విషయాలను కూడా దీనిలో చర్చించారు.

సూప శాస్త్రం: ఇది వంటలకు సంబంధించిన శాస్త్రం. దీని రచయిత సురేశుడు. ఇందులో పిండివంటలు తీపి పదార్థాలు, ఊరగాయలు, 108 రకాల వ్యంజనాలు లాంటి అనేక వంటల గురించి, అప్పటికి ప్రపంచవ్యాప్తంగా వాడుకలో ఉన్న 3,032 రకాల పదార్థాల తయారీ గురించి ఇందులో వివరంగా ఉంది.

మాలినీ శాస్త్రం: రచయిత ఋష్యశృంగ మహర్షి. దీనిలో ఉన్న 16 అధ్యాయాల్లో... పూల మాలలు, పూల గుత్తుల తయారీ, పూలతో రకరకాల శిరోజాలంకరణలు, రహస్య భాషలో పూరేకుల మీద ప్రేమ సందేశాలు పంపడం లాంటి వివరాలు ఉన్నాయి.

ధాతు శాస్త్రం: రచయిత అశ్వనీకుమార. విశ్ర లోహాలు, కృత్రిమ లోహాలు, లోహాలను మార్చడం, రాగని బంగారంగా మార్చడం లాంటి విషయాలను ఏడు అధ్యాయాల్లో విపులంగా వివరించారు.



చిత్రకర్మ (చిత్రలేఖన) శాస్త్రం: 12 అధ్యాయాలున్న ఈ గ్రంథ రచయిత పేరు భీముడు. దీనిలో 200 కాల చిత్ర లేఖన ప్రక్రియల గురించి పేర్కొన్నారు. ఒక వ్యక్తి తల వెంట్రుకలు, గోళ్ళు, ఎముక లాంటివి చూసి... అతని బొమ్మను గీసే ప్రక్రియ కూడా ఉందులో ఉంది.

మల్ల శాస్త్రం: రచయిత పేరు మల్లుడు. వ్యాయామాలు, ఆటలు, ఉత్త చేతులతో చేసే 24 రకాల విద్యల గురించి ఈ గ్రంథంలో ఉంది.

రత్న పరీక్ష: వాత్స్యాయన ఋషి రాసిన ఈ గ్రంథంలో... రత్నాలకు ఉన్న 24 లక్షణాలు, వాటి శుద్ధతను పరీక్షించే 32 పద్ధతులు ఉన్నాయి. రత్నం తాలూకు రూపం, బరువు లాంటి అంశాల ఆధారంగా వాటిని వివరించడం గురించి చర్చించారు.

మహేంద్రజాల శాస్త్రం: సుబ్రహ్మణ్యస్వామి శిష్యుడైన వీరబాహువు దీని రచయిత. నీటిపై నడవడం, గాలిలో తేలడం లాంటి భ్రమలను కల్పించే గారడీలను ఇది నేర్పుతుంది.

అర్ధ శాస్త్రం: రచయిత వ్యాసుడు. ఇందులో మూడు భాగాలున్నాయి. ధర్మబద్ధమైన 82 సంపాదనా మార్గాలను ఇందులో వివరించారు.

శక్తితంత్రం: రచయిత అగస్త్యముని. సూర్య చంద్రులు, ప్రకృతి, అగ్ని, గాలి తదితర 64 రకాల బాహ్య శక్తుల గురించి, వాటి ప్రత్యేకమైన వినియోగం గురించి దీనిలో వెల్లడించారు. అణు విచ్ఛేదన కూడా దీనిలో భాగమే.

సౌదామినీ కళ: రచయిత మతంగ ముని. నీడల ద్వారా, ఆలోచనల ద్వారా కంటికి కనపడే విషయాలను ఆకర్షించే విధానం, భూమి, పర్వతాల లోపలి భాగాల చిత్రాలను సంపాదించే ప్రక్రియ దీనిలో వివరించారు.

మేఘ శాస్త్రం: రచయిత అత్రి ముని. 12 రకాల మేఘాలు, 12 రకాల వర్షాలు, 64 రకాల మెరుపులు, 33 రకాల పిడుగుల గురించి, వాటి లక్షణాల గురించి దీనిలో పేర్కొన్నారు.

స్థాపత్య విద్య: ఇది అధర్వణ వేదంలోనిది. ఇంజనీరింగ్, ఆర్కిటెక్చర్, కట్టడాలు, నగర ప్రణాళిక తదితర నిర్మాణ సంబంధమైన సమస్త వివరాలు ఇందులో ఉన్నాయి.

వీటితో పాటు భగవాన్ కార్తికేయ విరచిత 'కాల శాస్త్రం', 'సాముద్రిక శాస్త్రం', అగ్నివర్మ రచించిన 'అశ్వ శాస్త్రం', కుమారస్వామి రచించిన 'గజ శాస్త్రం', భరద్వాజ ఋషి రచించిన 'యంత్ర శాస్త్రం', అలాగే ధనుర్వేదం, గాంధర్వ వేదం లాంటివి ఎన్నో గ్రంథాలు మాయమైపోయాయి.

బిజినెస్

సెన్సెక్స్ @ 83,000

ఆఖరి గంటలో కొనుగోళ్లతో సరికొత్త గరిష్ఠాలకు సూచీలు

ఈక్విటీ మదుపరుల సంపద రూ.6.59 లక్షల కోట్లు జంప్

ముంబై: స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు గురువారం సరికొత్త శిఖరాలను అధిరోహించాయి. ఉదయం ట్రేడింగ్ ఆరంభమైనప్పటి నుంచి మధ్యాహ్నం రెండింటి వరకు స్వల్ప లాభాల్లో కొనసాగిన సూచీలు.. ఆఖరి గంటలో కొనుగోళ్లు పోటెత్తడంతో ఉవ్వెత్తున ఎగిశాయి. ఒక దశలో సెన్సెక్స్ 1,593.03 పాయింట్లు (1.95 శాతం) ఎగబాకి 83,116.19 వద్ద ఆల్‌టైం ఇంట్రాడే రికార్డును నమోదు చేసింది. సూచీ 83,000 మైలురాయిని చేరడం ఇదే తొలిసారి. అయితే, సూచీ చివర్లో 1,439.55 పాయింట్ల (1.77 శాతం) వృద్ధితో 82,962.71 వద్ద స్థిరపడింది. సూచీకిది సరికొత్త జీవితకాల గరిష్ఠ ముగింపు కూడా. నిఫ్టీ సైతం ఒక దశలో 514.9 పాయింట్లు (2 శాతం) పెరిగి 25,433.35 వద్ద కొత్త ఇంట్రాడే రికార్డును, చివర్లో 470.45 పాయింట్ల (1.89 శాతం) లాభంతో 25,388.90 వద్ద ఆల్‌టైం గరిష్ఠాన్ని నమోదు చేసింది. యూరోపియన్ సెంట్రల్ బ్యాంక్‌తో పాటు అమెరికన్ ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల తగ్గింపు అంచనాలతో అంతర్జాతీయ మార్కెట్లో ట్రేడింగ్ సెంటిమెంట్ సానుకూలంగా మారింది. దాంతో దేశీయంగానూ ఇన్వెస్టర్లు జోరుగా కొనుగోళ్లకు పాల్పడ్డారు. విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడుల ప్రవాహం కొనసాగడం మన మార్కెట్‌కు మరింత కలిసివచ్చింది. ఆకస్మిక బుల్ ర్యాలీతో ఈక్విటీ మదుపరుల సంపదగా పరిగణించే బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ ఒక్కరోజే రూ.6.59 లక్షల కోట్లు పెరిగి రూ.467.36 లక్షల కోట్లు (5.57 లక్షల కోట్ల డాలర్లు) దాటింది. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీలూ పాజిటివ్‌గా ముగిశాయి.

భారతీ ఎయిర్‌టెల్ షేరు 4.36 శాతం ఎగబాకి సూచీ టాప్ గెయినర్‌గా నిలిచింది. ఎన్‌టీపీసీ, ఎం అండ్ ఎం, జేఎస్‌డబ్ల్యూ స్టీల్ షేర్లు 3 శాతానికి పైగా పుంజుకోగా.. అదానీ పోర్ట్స్, ఎస్‌బీఐ, టెక్ మహీంద్రా, టాటా స్టీల్, ఎల్ అండ్ టీ, కోటక్ బ్యాంక్, ఇన్ఫోసిస్ షేర్లు 2 శాతానికి పైగా రాణించాయి. బీఎస్ఈలోని మిడ్‌క్యాప్ సూచీ 1.32 శాతం, స్మాల్ క్యాప్ ఇండెక్స్ 0.79 శాతం లాభపడ్డాయి. అన్ని రంగాల సూచీలూ ఎగిశాయి. మెటల్ అత్యధికంగా 3.05 శాతం పుంజుకోగా.. టెలికాం, పవర్ రెండు శాతానికి పైగా రాణించాయి. ఆటో, యుటిలిటీస్, కమోడిటీస్ సూచీలు 1.99 శాతం వరకు పెరిగాయి.

ఇంట్రాడేలో 25,400 పైకి నిఫ్టీ



యెస్ బ్యాంక్‌లో 51% వాటా కోసం బిడ్డర్ల పట్టు

ప్రైవేట్ రంగానికి చెందిన యెస్ బ్యాంక్‌లో వాటా విక్రయ ప్రక్రియ సందిగ్ధ స్థితిలో ఉన్నట్లు తెలిసింది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. బ్యాంక్‌లో మెజారిటీ వాటా (51 శాతం) కోసం బిడ్డర్లు పట్టుబడుతున్నారు. కానీ, దేశంలోని ప్రముఖ బ్యాంకుల్లో ఒకటైన యెస్ బ్యాంక్‌లో మెజారిటీ వాటా విక్రయానికి అనుమతిచ్చేందుకు ఆర్‌బీఐ సుముఖంగా లేదని తెలిసింది. ఈ బ్యాంక్‌లో వాటా కొనుగోలుకు జపాన్‌కు చెందిన సుమిటొమో మిత్సుయి బ్యాంకింగ్ కార్పొరేషన్ (ఎస్ఎంబీసీ), యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)కి చెందిన ప్రముఖ బ్యాంక్‌ల్లో ఒకటైన ఎమిరేట్స్ ఎన్‌బీడీ పోటీపడుతున్నాయి. ఈ రెండూ విదేశీ సంస్థలు కావడమే ఆర్‌బీఐ విముఖతకు ప్రధాన కారణమని ఆ వర్గాలు పేర్కొన్నాయి. ప్రస్తుత నిబంధనల ప్రకారం.. దేశీయ బ్యాంక్‌లో విదేశీ సంస్థలు గరిష్ఠంగా 26 శాతం వరకు వాటా కొనుగోలు చేసేందుకు అనుమతి ఉంది. అంతకు మించి వాటా కొనుగోలు చేసిన పక్షంలో, ఆర్‌బీఐ నిర్దేశిత గడువులోగా వాటాను మళ్లీ 26 శాతానికి తగ్గించుకోవాల్సి ఉంటుంది. ఆర్థికంగా దివాలా తీసిన యెస్ బ్యాంక్‌ను రక్షించేందుకు ఎస్‌బీఐ నేతృత్వ కన్సార్షియం 2020లో పెట్టుబడులు పెట్టింది. తద్వారా యెస్ బ్యాంక్‌లో ఎస్‌బీఐకి 24 శాతం వాటా దక్కింది. ప్రస్తుతం బ్యాంక్‌లో ఎస్‌బీఐయే అతిపెద్ద వాటాదారు.

కార్వీ స్టాక్ బ్రోకింగ్‌కు సెబీ ఝలక్

» డిపాజిట్లు, డీమ్యాట్ ఖాతాల జప్తు

న్యూఢిల్లీ: కార్వీ స్టాక్ బ్రోకింగ్ లిమిటెడ్ (కేఎస్‌బీఎల్), దాని ప్రమోటర్ సీ పార్థసారథికి మార్కెట్ నియంత్రణ మండలి సెబీ మరోసారి ఝలక్ ఇచ్చింది. వీరికి చెందిన బ్యాంకు డిపాజిట్లు, డీమ్యాట్ ఖాతాలను జప్తు చేసింది. రూ.25 కోట్ల జరిమానా చెల్లించాలని గత నెల జారీ చేసిన ఆదేశాలను కేఎస్‌బీఎల్, పార్థసారథి పెడచెవిన పెట్టడంతో సెబీ ఈ చర్య తీసుకుంది. కేఎస్‌బీఎల్ తన వద్ద డీమ్యాట్ ఖాతాలు ఉన్న ఖాతాదారుల నుంచి తీసుకున్న పవర్ ఆఫ్ అటార్నీ (పీఓఏ)లను దుర్వినియోగం చేసి, వారి ఖాతాల్లోని షేర్లను బ్యాంకుల వద్ద తాకట్టు పెట్టి పెద్ద మొత్తంలో నిధులు సమీకరించి, వాటిని తన అనుబంధ కంపెనీలకు మళ్లించింది. ఈ విషయం బయటికి పొక్కడంతో సెబీ రంగంలోకి దిగి కేఎస్‌బీఎల్‌ను, దాని ప్రమోటర్ పార్థసారథిని ఆరేళ్ల పాటు సెక్యూరిటీస్ మార్కెట్ నుంచి బహిష్కరించింది. అంతటితో ఊరుకోకుండా కేఎస్‌బీఎల్, పార్థసారథిపై రూ.21 కోట్ల జరిమానా విధించింది. అయినా స్పందించక పోవడంతో దానిపై వడ్డీ, అపరాధ రుసుముతో కలిపి రూ.25 కోట్లు చెల్లించాలని గత నెలలో నోటీసులు జారీ చేసింది. దీనికి కూడా స్పందించక పోవడంతో ఇప్పుడు ఏకంగా కేఎస్‌బీఎల్, పార్థసారథి బ్యాంకు డిపాజిట్లు, డీమ్యాట్ ఖాతాల్లోని షేర్లు, మ్యూచువల్ ఫండ్స్ పోర్ట్‌ఫోలియోల్లోని యూనిట్లను జప్తు చేసింది.

డెమో కార్లపైనా ఐటీసీ: సీబీఐసీ

న్యూఢిల్లీ: ఆటోమొబైల్ డీలర్లకు కేంద్ర పరోక్ష పన్నులు, కస్టమ్స్ బోర్డు (సీబీఐసీ) పెద్ద ఊరట ఇచ్చింది. కార్లు లేదా ఇతర ఆటోమొబైల్ వాహనాల అమ్మకాల ప్రోత్సాహం కోసం అధీకృత ఆటోమొబైల్ డీలర్లు వినియోగించే డెమో కార్లపై ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) లభిస్తుందని తెలిపింది. అయితే ఈ డెమో కార్లు, వాహనాలను డీలర్లు కచ్చితంగా డెమోల కోసం మాత్రమే ఉపయోగించాలని స్పష్టం చేసింది. డీలర్లు ఈ వాహనాలను సొంత అవసరాల కోసం ఉపయోగించినా, తమ ఉద్యోగుల రవాణా కోసం ఉపయోగించినా ఐటీసీ లభించదని తెలిపింది. డెమో కోసం షోరూమ్స్‌లో ఉంచే వాహనాలను ప్రత్యేకంగా పేర్కొనాలని కూడా సీబీఐసీ స్పష్టం చేసింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

13వ తేదీ			
హైదరాబాద్	500	విజయవాడ	530
వరంగల్	502	గోదావరి	525
చిత్తూరు	553	విశాఖపట్నం	535
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	107	విజయవాడ	118
వరంగల్	107	గుంటూరు	120
కరీంనగర్	107	ఒంగోలు	120
మహబూబ్‌నగర్	107	చిత్తూరు	118
కర్నూలు	107	నెల్లూరు	118
విశాఖపట్నం	104	అనంతపురం	118
గోదావరి	118		

వాటర్ ట్యాంకుల తయారీ ప్లాంట్‌లో పూర్తిగా పవన విద్యుత్ వినియోగం

ఆర్‌సీ ప్లాస్టో



హైదరాబాద్: వాటర్ ట్యాంకులు, పైపులు, ఫిట్టింగ్స్ తయారీ సంస్థ ఆర్ సీ ప్లాస్టో ట్యాంక్స్ అండ్ పైప్స్ ప్రైవేట్ లిమిటెడ్.. పర్యావరణ పరిరక్షణ, సస్టెయినబిలిటీ కోసం కీలకమైన చర్యలు తీసుకున్నట్లు ప్రకటించింది. ఇందులో భాగంగా మహారాష్ట్ర, నాగ్‌పూర్‌లోని వాటర్ ట్యాంకుల తయారీ ప్లాంట్‌లో 100% పునరుత్పాదక ఇంధనాన్ని వినియోగిస్తున్నట్లు వెల్లడించింది. మహారాష్ట్రలోని నందర్బర్ వద్ద ఏర్పాటు చేసిన రెండు పవన విద్యుత్ ప్లాంట్ల నుంచి ఉత్పత్తి అవుతున్న విద్యుత్‌ను పూర్తిగా ఈ ప్లాంట్‌కు ఉపయోగిస్తున్నట్లు ఆర్ సీ ప్లాస్టో పేర్కొంది. ఒక్కో పవన విద్యుదుత్పత్తి ప్లాంట్ సామర్థ్యం 2.1 మెగా వాట్లుగా ఉందని తెలిపింది. సాంప్రదాయ ఇంధనాలపై ఆధారపడకుండా పూర్తిగా రెన్యువబుల్ ఎనర్జీకి మారటం ద్వారా కర్బన ఉద్గారాలను గణనీయంగా తగ్గించి ప్లాస్టో.. ఇతర పరిశ్రమలకు ఆదర్శంగా నిలిచిందని పేర్కొంది.

హైదరాబాద్ టు బ్యాంకాక్ విమాన సర్వీసులు



ఎయిర్ ఏషియా

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఎయిర్ ఏషియా థాయ్‌లాండ్.. భారత్‌లో తన కార్యకలాపాలు విస్తరిస్తున్నట్లు ప్రకటించింది. ఇందులో భాగంగా హైదరాబాద్ నుంచి బ్యాంకాక్, చెన్నై నుంచి ఫుకెట్ నగరాలకు నేరుగా విమాన సర్వీసులు ప్రారంభిస్తున్నట్లు థాయ్ ఎయిర్ ఏషియా కమర్షియల్ హెడ్ తన్సిటా అక్రారిట్ పిరోమ్ వెల్లడించారు. అక్టోబరు 27వ తేదీ నుంచి హైదరాబాద్-బ్యాంకాక్ మార్గంలో వారానికి 4 సర్వీసులు, అదే నెల 30 నుంచి చెన్నై-ఫుకెట్ మార్గంలో వారానికి 3 సర్వీసులు నడపనున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఇందులో హైదరాబాద్ నుంచి బ్యాంకాక్‌కు ఒకవైపు ప్రయాణానికి టికెట్ ధరలు రూ.7,390, చెన్నై నుంచి ఫుకెట్‌కు టికెట్ ధరలు రూ.6,990 నుంచి ప్రారంభమవుతాయని ఆమె తెలిపారు. ఈ నెల 22 వరకు ఈ టికెట్ ధరలు బుకింగ్ చేసుకునేందుకు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ ఏడాది అక్టోబరు 27-30 తేదీల నుంచి వచ్చే ఏడాది మార్చి 29 వరకు ఎప్పుడైనా ప్రయాణం చేయవచ్చని ఆమె తెలిపారు.

అరుదైన లోహాల కోసం 'విదేశీ' బాట

ఈ ఏడాది రూ.2,200 కోట్ల పెట్టుబడి.. ఎన్‌ఎండీసీ సీఎండీ అమితవ ముఖర్జీ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ప్రభుత్వ రంగంలోని ఇనుప ఖనిజ ఉత్పత్తి సంస్థ ఎన్‌ఎండీసీ తన కార్యకలాపాలను మరింత విస్తరిస్తోంది. ఇందులో భాగంగా విదేశాల్లో లిథియం, రాగి, నికెల్, కోబాల్ట్ వంటి అరుదైన ఖనిజాల అన్వేషణ, ఉత్పత్తికి సిద్ధమవుతోంది. ఆస్ట్రేలియాలో ఇప్పటికే ఒక లిథియం నిక్షేపాల బ్లాకును గుర్తించింది. లెగసీ ఇండియా ఐరన్ ఓర్ లిమిటెడ్ అనే అనుబంధ కంపెనీ ద్వారా ఎన్ఎండీసీ ఈ కార్యకలాపాలు చేపట్టనుంది. వచ్చే ఏడాది చివరికల్లా దేశంలో ఏటా 80 లక్షల టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో కోకింగ్ కోల్ ఉత్పత్తి కూడా చేపట్టనుంది. ప్రస్తుతం 4.5 కోట్ల టన్నులుగా ఉన్న వార్షిక ఇనుప ఖనిజం ఉత్పత్తి సామర్థ్యాన్నీ 2030 నాటికి 10 కోట్ల టన్నులకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు ఎన్ఎండీసీ సీఎండీ అమితవ ముఖర్జీ చెప్పారు. కాగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో విస్తరణ, అభివృద్ధి కార్యక్రమాల కోసం రూ.2,200 కోట్లు ఖర్చు చేయనున్నట్లు ఆయన తెలిపారు. పర్యావరణకు హాని కలగని రీతిలో తమ ఉత్పత్తి సామర్థ్యాన్ని విస్తరిస్తామని ముఖర్జీ చెప్పారు. ఈ పెట్టుబడితో బచేలి నుంచి నాగర్నార్ వరకు 135 కిలోమీటర్ల స్లర్రీ పైప్‌లైన్‌తో పాటు ప్రాసెసింగ్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామన్నారు.

ఆగస్టు ద్రవ్యోల్బణంలో స్వల్ప వృద్ధి

న్యూఢిల్లీ: కూరగాయలు, పప్పుల ధరలు పెరగడంతో ఆగస్టు నెలలో రిటైల్ ద్రవ్యోల్బణం స్వల్పంగా పెరిగి 3.65 శాతానికి చేరింది. జూలైలో ఇది ఐదు సంవత్సరాల కనిష్ఠ స్థాయి 3.6 శాతానికి దిగివచ్చిన విషయం విదితమే. స్వల్పంగా పెరిగినప్పటికీ ఆర్‌బీఐకి ప్రభుత్వం నిర్దేశించిన కట్టడి పరిధి 4 శాతం లోపే ఉంది. కాగా గత ఏడాది ఆగస్టులో ఇది 6.83 శాతం ఉంది. జాతీయ గణాంకాల శాఖ విడుదల చేసిన వివరాల ప్రకారం ఆగస్టు నెలలో కూరగాయల ధరలు 10.71 శాతం, పప్పుల ధరలు 13.6 శాతం పెరిగాయి. అయితే సుగంధ ద్రవ్యాలు (-4.4 శాతం), ఆయిల్స్ అండ్ ఫ్యాట్స్ (-0.86 శాతం) విభాగాల్లో ధరలు తగ్గాయి. కాగా స్థూలంగా ఆహార వస్తువుల విభాగంలో ద్రవ్యోల్బణం 5.66 శాతం ఉంది.

హైదరాబాద్‌లో జెడ్‌ఎఫ్ లైఫ్‌టెక్ జీసీసీ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి): కార్లలో సీట్ బెల్ట్, ఎయిర్ బ్యాగులు, ఇతర భద్రతా పరికరాలు తయారు చేసే జర్మనీకి చెందిన జెడ్ఎఫ్ లైఫ్ టెక్ తన కొత్త గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ (జీసీసీ)ను హైదరాబాద్‌లో ప్రారంభించింది. ఈ సెంటర్‌ను తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జెడ్ఎఫ్ ఇక్కడ జీసీసీని ప్రారంభించడంతో తెలంగాణ ప్రపంచ స్థాయి సాంకేతిక, నూతన పరిశోధనల గమ్యస్థానంగా మారిందన్నారు. ఈ కేంద్రం ద్వారా ప్రస్తుతం 200 మందికి ఉద్యోగాలు లభించాయని, వచ్చే మూడేళ్లలో ఈ సంఖ్య 500 దాటుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ రూడాల్ఫ్ స్టార్క్, ఇండియా ఈడీ రవికుమార్ పాల్గొన్నారు.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	73,150 ▼	67,050 ▼	91,400 ▼
ముంబై	71,801 ▼	65,770 ▼	83,188 ▼

త్వరలో ఎయిర్ ట్యాక్సీలు

ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: దేశంలో ఎయిర్ మొబిలిటీని మరింతగా అభివృద్ధి చేయాలని భావిస్తున్నామని, ఇందులో భాగంగా ఎయిర్ ట్యాక్సీలు త్వరలో వాస్తవంలోకి రానున్నాయని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. గురువారం ఆయన ఢిల్లీలో జరుగుతున్న పౌర విమానయాన ద్వితీయ ఆసియా పసిఫిక్ మంత్రుల స్థాయి సమావేశంలో ప్రసంగించారు. దేశంలో విమానయానం అభివృద్ధికి గల అవకాశాలను వివరిస్తూ ప్రాంతీయ ఎయిర్ కనెక్టివిటీ పథకం ఉడాన్‌తో సగటు జీవి విమాన ప్రయాణ కల సాకారం అయిందని చెప్పారు. ఉడాన్ పథకం అమలులోకి వచ్చిన తర్వాత 1.4 కోట్ల మంది మధ్య తరగతి ప్రజలు విమాన ప్రయాణాలు చేశారని మోదీ చెప్పారు. అభివృద్ధిలో పౌర విమానయాన రంగం ప్రధాన పాత్ర పోషిస్తుందంటూ ఎన్నో ఉద్యోగావకాశాలు దీని ద్వారా అందుబాటులోకి వస్తున్నాయన్నారు.

జికా వ్యాక్సిన్ అభివృద్ధికి ఐసీఎంఆర్‌తో ఐఐఎల్ ఒప్పందం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): జికా వైరస్ బారి నుంచి కాపాడే వ్యాక్సిన్‌ను అభివృద్ధి చేసేందుకు ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్)తో ఒప్పందం (ఎంఓఏ) కుదుర్చుకున్నట్లు ఇండియన్ ఇమ్యునోలాజికల్స్ లిమిటెడ్ (ఐఐఎల్) గురువారం ప్రకటించింది. ఈ ఒప్పందంలో భాగంగా జికా వ్యాక్సిన్ అభివృద్ధి కోసం తాము జరిపే క్లినికల్ ట్రయల్స్ మొదటి దశ వ్యయాన్ని ఐసీఎంఆర్ భరించనుందని ఐఐఎల్ తెలిపింది. దేశంలోని ఐసీఎంఆర్ నెట్‌వర్క్ సైట్లలో ఈ ట్రయల్స్‌ను చేపట్టనున్నట్లు ఐఐఎల్ స్పష్టం చేసింది.

స్పోర్ట్స్



రెండు గోల్స్ చేసిన హర్మన్‌ప్రీత్

భారత జట్టు.. అదే జోరు

» నాలుగో మ్యాచ్‌లోనూ గెలుపు

» ఆసియా చాంపియన్స్ ట్రోఫీ హాకీ

హులున్‌బుయిర్ (చైనా) : ఆసియా చాంపియన్స్ ట్రోఫీ హాకీ టోర్నమెంట్‌లో భారత జట్టు దూసుకుపోతోంది. వరుసగా నాలుగోపోరులోనూ విజయం సాధించింది. గురువారం జరిగిన మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ భారత్ 3-1తో కొరియాను ఓడించింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ (9, 43 నిమిషాలు) రెండు గోల్స్‌తో చెలరేగగా, అరైజీత్ సింగ్ హుందాల్ (8వ) ఒక గోల్ చేశాడు. జిహున్ యాంగ్ (30వ) కొరియాకు ఏకైక గోల్ అందించాడు. ఇప్పటికే సెమీఫైనల్లోకి ప్రవేశించిన భారత్..తొలుత చైనాను 3-0తో, తర్వాత జపాన్‌ను 5-0తో, నిరుటి రన్నరప్ మలేసియాను 8-1తో చిత్తు చేసిన సంగతి తెలిసిందే. ఆరు జట్ల రౌండ్ రాబిన్ చివరి లీగ్ మ్యాచ్‌లో పాకిస్థాన్‌ను శనివారంనాడు భారత్ ఢీకొననుంది. టాప్-4లో నిలిచిన జట్లు సెమీస్‌కు క్వాలిఫై అవుతాయి. సెమీస్ సోమవారం, ఫైనల్ మంగళవారం జరుగుతాయి.

పారా హీరోలకు మోదీ ఆతిథ్యం

పేరు పేరునా పలకరించిన ప్రధాని



న్యూఢిల్లీ: పారిస్‌లో జరిగిన పారాలింపిక్స్‌లో పతకాలు సాధించిన అథ్లెట్లను ప్రధాని నరేంద్ర మోదీ మరోసారి అభినందించారు. గురువారం తన నివాసంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ప్లేయర్లతో మోదీ ముచ్చటించారు. క్రీడా మంత్రిత్వ శాఖ నెట్‌లో పోస్టు చేసిన 43 సెకన్ల వీడియోలో పతక విజేతలను కొనియాడిన మోదీ.. ప్రతి ఒక్కరితో మాట్లాడుతూ కనిపించారు. ఇందులో కేంద్ర క్రీడా మంత్రి మన్సుఖ్ మాండవ్య, భారత పారాలింపిక్ కమిటీ (పీసీఐ) అధ్యక్షుడు దేవేంద్ర జఝారియా కూడా ఉన్నారు. 10 మీ. ఎయిర్ రైఫిల్ ఈవెంట్‌లో స్వర్ణాన్ని నిలబెట్టుకొన్న అవనీ లేఖరా 'మీ మద్దతుకు ధన్యవాదాలు' అని రాసిన టీ-షర్ట్‌ను ప్రధానికి బహుమతిగా ఇచ్చింది. కాంస్యం సాధించిన జుడోకా కపిల్ పర్మార్ ప్రధానితో ప్రత్యేకంగా ఫొటో దిగాడు. అతడి పతకంపై మోదీ సంతకం చేస్తూ కనిపించారు. కాంస్యం సాధించిన **తెలుగమ్మాయి జీవాంజి దీప్తిని కూడా ప్రధాని పలకరించారు.** వరుసగా రెండో పసిడిని దక్కించుకొన్న జావెలిన్ త్రోయర్ సుమిత్ అంటిల్ మోదీతో సరదాగా మాట్లాడుతూ నవ్వులు పూయించాడు. ప్రతి అథ్లెట్ విజయగాథలను ఆయన అడిగి మరీ తెలుసుకొన్నారు. ఇటీవలే ముగిసిన పారిస్ పారాలింపిక్స్‌లో అత్యుత్తమ ప్రదర్శన కనబరచిన భారత్ 7 స్వర్ణ, 9 రజత, 13 కాంస్యాలతో మొత్తం 29 పతకాలు సాధించి, ఓవరాల్‌గా 18వ స్థానంలో నిలిచింది.



ప్రధానితో దీప్తి

అతని కోసం నేలపై...



ఈ కార్యక్రమంలో మరింత సరదా సంఘటన ఒకటి జరిగింది. పసిడి సాధించిన మరగుజ్జు జావెలిన్ త్రోయర్ నవ్‌దీప్ సింగ్.. మోదీకి క్యాప్‌ను బహూకరించాడు. అయితే, అతడు పొట్టివాడు కావడంతో.. టోపీని పెట్టించుకొనేందుకు మోదీ ఏకంగా నేలపై కూర్చున్నారు. 'ఇప్పుడు నువ్వు నా కంటే పొడుగ్గా ఉన్నట్టు అనిపిస్తోందా?' అని ప్రధాని సరదాగా అన్నారు. ఆ తర్వాత తను త్రో చేసే ఎడమ చేతిపై ఆటోగ్రాఫ్ ఇవ్వాలని మోదీని నవ్‌దీప్ కోరాడు.

వ్రితి, సంపత్ పతక మోత





హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): జాతీయ అక్వాటిక్ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్‌లో తెలుగు స్విమ్మర్లు వ్రితి అగర్వాల్, సంపత్ కుమార్ యాదవ్ పతకాల మోత మోగిస్తున్నారు. మంగళూరులో జరుగుతున్న ఈ పోటీల్లో మూడో రోజైన గురువారం హైదరాబాద్ స్విమ్మర్ వ్రితి ఒక స్వర్ణం, రజతం నెగ్గడంతో ఆమె పతకాల సంఖ్య నాలుగుకు చేరింది. 800 మీటర్ల ఫ్రీస్టయిల్‌లో వ్రితి 9 ని. 16.14 సెకన్లలో రేసును ముగించి స్వర్ణం సాధించగా, 200 మీ., బటర్‌ఫ్లయ్‌లో ఆమె 2 ని, 21.89 సెకన్లలో రేసు పూర్తి చేసి రజతంతో మెరిసింది. విజయవాడ స్విమ్మర్ సంపత్ ఈ పోటీల్లో రెండో కాంస్యాన్ని తన ఖాతాలో వేసుకున్నాడు. పురుషుల 1500 మీటర్ల ఫ్రీస్టయిల్‌లో సంపత్ 16 నిమిషాల 26.48 సెకన్లలో రేసును పూర్తి చేసి తృతీయ స్థానంలో నిలిచాడు.

నాలుగో రోజూ వర్షార్పణం

» రద్దు దిశగా అఫ్ఘాన్-కివీస్ ఏకైక టెస్టు

నొయిడా: అఫ్ఘానిస్థాన్-న్యూజిలాండ్ జట్ల మధ్య జరగాల్సిన ఏకైక టెస్టు మ్యాచ్ నాలుగో రోజూ ప్రారంభం కాలేదు. గురువారం ఉదయం కూడా వర్షం కురవడంతో అంపైర్లు ఆట రద్దుకే మొగ్గు చూపారు. సోమవారం నుంచి జరగాల్సిన ఈ మ్యాచ్ వరుణుడి ధాటికి టాస్ కూడా పడకపోవడం గమనార్హం. ఐదో రోజు శుక్రవారం కూడా వర్ష సూచన ఉండడంతో ఈ మ్యాచ్ పూర్తిగా రద్దయ్యే అవకాశాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఇప్పటివరకు టెస్టు చరిత్రలో కేవలం ఏడు మ్యాచ్‌లు మాత్రమే ఒక్క బంతి కూడా పడకుండా ముగిశాయి. 1998లో చివరిసారి భారత్-న్యూజిలాండ్ టెస్టు ఇలాగే రద్దయ్యింది.

ఐస్‌లాండ్‌పై భారత్ గెలుపు

» చెస్ ఒలింపియాడ్




అర్జున్

బుడాపెస్ట్: చెస్ ఒలింపియాడ్ ఓపెన్ విభాగంలో గురువారం జరిగిన రెండో రౌండ్‌లో భారత పురుషుల జట్టు 3-0తో ఐస్‌లాండ్‌పై ఆధిక్యంలో నిలిచింది. తెల్లపావులతో బరిలోకి దిగిన తెలుగు గ్రాండ్‌మాస్టర్ అర్జున్ ఇరిగేసి 41 ఎత్తుల్లో గ్రాండ్‌మాస్టర్ హానెస్ స్టెఫాన్స్‌ను చిత్తు చేశాడు. గుకేష్-వాట్నర్‌పై, విదిత్ గుజ్‌రాతి-హిల్మిర్‌పై విజయం సాధించారు. ఈ విజయం దరిమిలా భారత్‌కు 2 పాయింట్లు లభించాయి. తొలి రౌండ్‌లో మొరాకో జట్టుపై విజయంతో 2పాయింట్లు దక్కిన సంగతి తెలిసిందే. ఇక మహిళల్లో..మనోళ్లు 2.5-0.5తో చెక్‌రిపబ్లిక్‌పై ఆధిక్యంలో నిలిచారు. దివ్యాదేశ్‌ముఖ్-నటాలీపై, వంతిక-టెరెజాపై గెలుపొందగా, తానియా సచ్‌దేవ-మార్టినా గేమ్ డ్రాగా ముగిసింది.

బరిలో నీరజ్, అవినాష్

● నేటినుంచే డైమండ్ లీగ్ ఫైనల్





బ్రసెల్స్: సీజన్‌ను గ్రాండ్‌గా ముగించాలని స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా పట్టుదలతో ఉండగా.. ఒలింపిక్స్‌లో పేలవ ప్రదర్శన నుంచి బయటపడాలని స్టీపుల్ చేజర్ అవినాష్ సబ్లే భావిస్తున్నాడు. బెల్జియం రాజధానిలో శుక్రవారం నుంచి రెండు రోజులపాటు సాగే డైమండ్ లీగ్ ఫైనల్లో ఇద్దరు భారత ఆటగాళ్లు తొలిసారి పాల్గొంటుండడం సరికొత్త రికార్డు. 32 విభాగాల్లో పోటీలు జరగనున్నాయి. వరల్డ్ రికార్డు పోల్‌వాల్టర్ డుప్లాంటిస్, అమెరికా స్ప్రింట్ క్వీన్ షకారి రిచర్డ్‌సన్, హర్డిల్స్ స్టార్ మెక్‌లానిల్ రివరోప్ తదితరులు పోటీలకు ప్రత్యేక ఆకర్షణగా మారారు. 3000 మీటర్ల స్టీపుల్ చేజ్‌లో సబ్లే తొలిసారి డైమండ్ లీగ్ ఫైనల్లో బరిలోకి దిగుతున్నాడు. శుక్రవారం రాత్రి సబ్లే ఈవెంట్ జరగనుండగా.. ఆ తర్వాతి రోజు చోప్రా జావెలిన్ పోటీలు నిర్వహించనున్నారు.

స్వీడన్‌కు పోటీనిచ్చేనా?

» డేవిస్ కప్ బరిలో భారత్ » రేపటినుంచి వరల్డ్ గ్రూప్ 1



రామ్‌కుమార్

స్టాక్‌హోమ్: టాప్ స్టార్లు లేకుండానే బరిలోకి దిగుతున్న భారత టెన్నిస్ జట్టు డేవిస్‌కప్‌లో స్వీడన్‌ను ఎదుర్కొనబోతోంది. ఈనెల 14,15 తేదీల్లో జరిగే వరల్డ్ గ్రూప్-1 పోటీలకు స్థానిక రాయల్ టెన్నిస్ హాల్ వేదిక కానుంది. సింగిల్స్, డబుల్స్ ఆటగాళ్లు సుమిత్ నగాల్, యుకీ భాంబ్రీ వ్యక్తిగత కారణాలతో వైదొలగడం జట్టు ఆటపై ప్రభావం పడనుంది. రామ్‌కుమార్ రామనాథన్, శ్రీరామ్ బాలాజీ, నికీ పూంచా, సిద్ధార్థ్ విశ్వకర్మలకు మ్యాచ్‌లు సవాల్ కానున్నాయి. మరోవైపు డేవిస్‌కప్ చరిత్రలో ఐదుసార్లు స్వీడన్‌తో తలపడినా భారత్ ఇప్పటివరకు గెలువలేకపోయింది. టెన్నిస్ దిగ్గజం బోర్న్ బోర్గ్ కుమారుడు 20 ఏళ్ల లియో బోర్గ్ స్వీడన్ తరఫున బరిలోకి దిగుతున్నాడు.

ఇషాన్ కిషన్ శతకం

ఇండియా 'సి' 357/5 ▫ దులీప్ ట్రోఫీ

అనంతపురం క్లాక్‌టవర్ (ఆంధ్రజ్యోతి) : దులీప్ ట్రోఫీలో భాగంగా గురువారం రెండో రౌండ్ మ్యాచ్‌లు ఆరంభమయ్యాయి. స్థానిక రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ (ఆర్‌డీటీ)కి చెందిన రెండు స్టేడియాల్లో నాలుగు జట్లు బరిలోకి దిగాయి. మరోవైపు జాతీయ జట్టులో చోటు కోసం ఎదురుచూస్తున్న వికెట్ కీపర్ ఇషాన్ కిషన్ (111) ఇండియా 'సి' తరఫున శతకంతో ఆకట్టుకున్నాడు. అలాగే బాబా ఇంద్రజిత్ (78)తో కలిసి మూడో వికెట్‌కు 189 పరుగులను అందించాడు. దీంతో ఇండియా 'బి'తో మొదలైన ఈ మ్యాచ్ తొలి రోజు ఆట ముగిసే సమయానికి ఇండియా 'సి' 79 ఓవర్లలో 5 వికెట్లకు 357 పరుగులు సాధించింది. మిగతా బ్యాటర్లలో రజత్ పటీదార్ (40), సాయి సుదర్శన్ (43) ఆకట్టుకోగా.. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ (46 బ్యాటింగ్), సుతార్ (8 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు.



ఇషాన్ (111)

పేసర్ ముకేశ్ కుమార్‌కు మూడు వికెట్లు దక్కాయి.

ఇండియా 'ఎ' 288/8

ఇండియా 'డి' బౌలర్లు సమష్టిగా రాణించడంతో ఇండియా 'ఎ' బ్యాటింగ్‌లో తడబడింది. అయితే 144/6 స్కోరుతో ఇబ్బందిపడిన వేళ ఏడో నెంబర్ బ్యాటర్ షామ్స్ ములాని (88 బ్యాటింగ్), తనుష్ కోటియన్ (53) అర్ధ సెంచరీలతో ఆదుకున్నారు. దీంతో తొలి రోజు ముగిసే సమయానికి ఇండియా 'ఎ' 82 ఓవర్లలో 8 వికెట్లకు 288 పరుగులు చేసింది. రియాన్ పరాగ్ (37) ఫర్వాలేదనిపించాడు. పేసర్లు విద్వత్ కావేరప్ప, హర్షిత్ రాణా, అర్ష్‌దీప్ సింగ్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి.

ప్రీక్వార్టర్స్‌లో గాయత్రి జోడీ ఓటమి

● సిక్కి-సుమిత్ జంట నిష్క్రమణ

హాంకాంగ్: తెలుగమ్మాయి గాయత్రి గోపీచంద్-ట్రీసా జాలీ జోడీ హాంకాంగ్ ఓపెన్ ప్రీక్వార్టర్స్‌లో నిష్క్రమించింది. గురువారం జరిగిన ప్రీక్వార్టర్స్ పోరులో గాయత్రి-ట్రీసా ద్వయం 11-21, 20-22తో లియు షెంగ్-టాన్ నింగ్ (చైనా) జోడీ చేతిలో పరాజయం పాలైంది.. డబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ సూపర్ 500 మిక్స్‌డ్ డబుల్స్ ప్రీక్వార్టర్స్‌లో సిక్కి-సుమిత్ రెడ్డి జంట 11-21, 20-22తో గోహ్ సూన్-లై షేవోన్ జిమీ (మలేసియా) చేతిలో ఓడి, ఇంటిముఖం పట్టింది. కాగా వియత్నాం సూపర్ 100 టోర్నీ సింగిల్స్‌లో తరుణ్ మన్నెపల్లి 21-7, 23-21తో జోయకిమ్ (ఫిన్‌లాండ్)పై నెగ్గి క్వార్టర్స్‌లో ప్రవేశించాడు.

షోరిఫుల్ స్థానంలో జాకర్

» టీమిండియాతో సిరీస్‌కు బంగ్లాదేశ్ జట్టు ఎంపిక

ఢాకా: భారత్‌తో జరిగే రెండు టెస్ట్‌ల సిరీస్‌లో తలపడే బంగ్లాదేశ్ జట్టులో అన్‌క్యాప్డ్ వికెట్‌కీపర్ బ్యాటర్ జాకర్ అలీకి చోటు దక్కింది. గాయపడిన పేసర్ షోరిఫుల్ ఇస్లాం మినహా పాకిస్థాన్‌పై 2-0తో సిరీస్ నెగ్గిన జట్టునే యథాతథంగా ఎంపిక చేశారు. అయితే, పేసర్ స్థానంలో వికెట్ కీపర్ జాకర్‌కు చోటు కల్పించడం ఆశ్చర్యం కలిగించింది. నజ్ముల్ హొస్సేన్ షంటో కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. ఈ నెల 19 నుంచి చెన్నైలో తొలి టెస్ట్, 27 నుంచి కాన్పూర్‌లో రెండో టెస్ట్ జరుగుతాయి.

వరదలతో విలవిల

- 25 ఏళ్లుగా రాష్ట్రం అతలాకుతలం
- దేశంలో తుఫాన్లు, రుతుపవన ద్రోణులతో ఎక్కువ దెబ్బతిన్న ప్రాంతం ఏపీనే
- ఎన్‌ఆర్‌ఎస్‌సీ అధ్యయనంలో వెల్లడి

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

పది రోజుల వ్యవధిలో విజయవాడను, ఆ వెంటనే గోదావరిజిల్లాలను వరదలు ముంచెత్తాయి. ఇటువంటి విపత్తులు ఏటా రాష్ట్రంలో సంభవిస్తున్నాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాన్లు, వాయుగుండాల ప్రభావంతో లక్షలాది హెక్టార్లలో పంట నష్టం జరుగుతోంది. లక్షల మంది ప్రజలు ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రభావితం అవుతున్నారు. తుఫాన్లు/వాయుగుండాలతో దేశంలో ఎక్కువ ప్రభావితమైన రాష్ట్రాల్లో ఏపీ నిలిచింది. వరదల విపత్తులతో నీట మునక, పంటనష్టం, ఇతరత్రా అతలాకుతలమైన రాష్ట్రాల్లో ఏపీ ఆరో స్థానంలో ఉంది. దేశంలో విపత్తులపై 1996 నుంచి 2022 వరకు నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (ఎన్‌ఆర్‌ఎస్‌సీ) చేపట్టిన అధ్యయనం ప్రకారం ఈ మధ్యకాలంలో ఏపీలో 7.92 లక్షల హెక్టార్లు నీట మునిగింది. రాష్ట్రంలో భూ విస్తీర్ణం 1.6 లక్షల హెక్టార్లు కాగా దాంట్లో 4.92 శాతం వరదల్లో చిక్కుకుంది. రాష్ట్రంలో వరదలకు ఎక్కువగా ప్రభావితమైనది నెల్లూరు జిల్లా కాగా ఆ తరువాత బాపట్ల. నెల్లూరులో 1,44,317 హెక్టార్లు, బాపట్లలో 1,11,637, తిరుపతి 83,151, ప్రకాశం 60,207, గుంటూరు 48,973, శ్రీకాకుళం 39,114, నంద్యాల 33,035, ఏలూరు 29,809, కృష్ణా29,582, పశ్చిమ గోదావరిలో 27,397, తూర్పు గోదావరిలో 21,322, కాకినాడ 18,983, అనకాపల్లి 17,631, అల్లూరి జిల్లా 16,661, పల్నాడు 12,630, ఎన్టీఆర్ జిల్లా 11,021 హెక్టార్లు వరదల్లో చిక్కుకున్నాయి. మిగిలిన జిల్లాలో 10వేల హెక్టార్ల కంటే తక్కువగా నీట మునిగింది. దేశంలో ఏటా వచ్చే వరదల్లో 30శాతం గోదావరి, కృష్ణా నదుల నుంచే వస్తున్నాయి.

తుఫాన్లతో ఉక్కిరిబిక్కిరి

రాష్ట్రంలో ప్రధానంగా తుఫాన్ల ప్రభావంతో ఎక్కువగా వరదలు సంభవిస్తున్నాయి. ఈ ప్రభావంతో 44శాతం భూభాగం దుర్బల పరిస్థితులను ఎదుర్కొంటోంది. తుఫాన్ వల్ల భారీగా దెబ్బతిన్న ప్రాంతంగా దేశంలోనే రాష్ట్రం ప్రథమ స్థానంలో ఉంది. 2010లో లైలా, 2012లో నీలం, 2014లో హుద్‌హుద్, 2018లో తితిలీ తుఫాన్ల ప్రభావంతో రాష్ట్రంలో అనేక ప్రాంతాలు అతలాకుతలమయ్యాయి. అంతకుముందు 1996లో తుఫాన్ కోనసీమను తీవ్రంగా దెబ్బతీసింది. తాజాగా ఆగస్టు 29న బంగాళాఖాతంలో వాయుగుండం ప్రభావంతో విజయవాడ నగరాన్ని వరద చుట్టుముట్టింది. ఈ విపత్తు నుంచి కోలుకోకుండానే బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం ప్రభావంతో గోదావరి, ఉమ్మడి విశాఖ జిల్లాలకు వరద తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. ఏటా నదుల నుంచి వరదలు లేదా తుఫాన్‌ల ప్రభావంతో ఏపీ అతలాకుతలమవుతోందని ఈ అధ్యయనం వెల్లడించింది. ఈ నేపథ్యంలో విపత్తులను ఎదుర్కొనేందుకు బృహత్తర ప్రణాళికలు రూపొందించాల్సిన అవసరం ఉందని వాతావరణ నిపుణులు పేర్కొంటున్నారు. నదులు ప్రవహించే ప్రాంతాల్లో ఆక్రమణలు తొలగించడం, నగరాల్లో డ్రైనేజీ వ్యవస్థను పటిష్ఠం చేయడం, తీర ప్రాంతాల్లో మడ అడవులు, తాటి తోపులు, సరుగుడు వనాలు పెంపు వంటివి చేపట్టాలని సూచిస్తున్నారు.

కష్టంగా అండర్ వాటర్ ఆపరేషన్

- బోట్ల తయారీకి మందపాటి రేకు వాడకం
- గురువారం పై భాగం మాత్రమే కట్ చేసిన సిబ్బంది
- నీళ్లలో బోటు కటింగ్‌కు ఎక్కువ సమయం

విజయవాడ, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రకాశం బ్యారేజీ వద్ద ఇరుక్కున్న బోట్లను తొలగించడం ఇప్పట్లో సాధ్యమయ్యేలా కనిపించడం లేదు. రోజురోజుకూ ఈ వ్యవహారం క్లిష్టతరంగా మారుతోంది. బుధవారం రాత్రికి పైకికనిపిస్తున్న రెండు బోట్లలో ఒక బోటునైనా ముక్కలు చేయాలని సీ లయన్ కంపెనీ, బెకెమ్ కంపెనీ ఇంజనీర్లు భావించారు. కానీ, ఇది సాధ్యం కాలేదు. నీళ్లలో బోటు కటింగ్‌కు ఎక్కువ సమయం పడుతోంది. గురువారం ఉదయం బోటు పైభాగాన్ని కట్ చేశారు. ఈ బోట్ల తయారీకి బాగా మందపాటి ఇనుప రేకును ఉపయోగించారు. 9మీటర్ల మేర రెండు వరుసల్లో కలిపి 18 మీటర్ల రేకును కట్ చేయాలి. నీటిలో మునిగిఉన్న వైపు భాగాన్ని కూడా కలుపుకుంటే మరింత ఎక్కువే కట్ చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం పైకి కనిపిస్తున్న భాగం కటింగ్ పూర్తయింది. నీళ్లలో మునిగి ఉన్న భాగాన్ని కట్ చేయడం కష్టంగామారింది. డైవర్లు నీటిలో గంటసేపు మాత్రమే ఉండగలుగుతున్నారు. ప్రస్తుతం అడుగు నుంచి కటింగ్ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో ఒక్కో బోటును రెండు ముక్కలు చేయాలన్న నిర్ణయానికి ఇంజనీర్లు వచ్చారు. ఇటు ప్రకాశం బ్యారేజీ వైపు నుంచి, అటు నదికి ఒడ్డున ఉన్న మోడల్ గెస్ట్‌హౌస్ వైపు నుంచి ఐరన్ రోప్‌లు ఏర్పాటు చేసి ఆ రెండు ముక్కలు వేరు చేయాలని భావిస్తున్నారు. దీనికోసం కాకినాడ నుంచి పదిమందితో కూడిన రిగ్గింగ్ టీమ్ విజయవాడకు చేరుకున్నారు. పాపికొండల్లో కచ్చులూరు వద్ద బోటు నీటమునిగినప్పుడు కీలకంగా పనిచేసిన అబ్బులు టీం ఇక్కడకు చేరుకుంది. నీళ్లలోని బోట్లను లాగడంలో ఈ బృందానికి మంచి నైపుణ్యం ఉంది. మోడల్ గెస్ట్ వద్ద గల ఘాట్‌పై భారీ రోప్‌ను ఏర్పాటు చేసి ముక్కలైన బోటు భాగాన్ని లాగుతారు. ఈ ప్రక్రియ శుక్రవారం మధ్యాహ్నం మొదలవుతుందని భావిస్తున్నారు. ఒక్క బోటు కటింగ్‌కు రెండు రోజుల సమయం పట్టింది. బ్యారేజీ వద్ద మొత్తం మూడు బోట్లు ఉన్నందు వారం రోజుల వరకు సమయం పట్టే సూచనలు కనిపిస్తున్నాయి.



ప్రకాశం బ్యారేజ్‌లో బోట్ల వెలికితీతను పరిశీలిస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు

ఇది పెను విపత్తు

(మొదటి పేజీ తరువాయి)

సచివాలయంలో ఆయనను కలిసిన కేంద్ర బృందం.. వరదల్లో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సహాయక చర్యల తీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేసింది. తమ పర్యటనలో రెండు రోజులుగా గమనించిన అంశాలను ముఖ్యమంత్రితో ఈ బృందం పంచుకుంది. రాష్ట్రానికి వచ్చిన ఇబ్బందిని ఎందుకు సాధారణ విపత్తుగా చూడరాదో కేంద్ర బృందానికి చంద్రబాబు వివరించారు. "ఏపీలో రికార్డుస్థాయిలో భారీ వర్షాలు, ఆకస్మిక వరదలు ప్రజల జీవితాలను అతలాకుతలం చేశాయి. పంటలు నీళ్లలో మునిగి రైతులు కుదేలయ్యారు. ఆస్తి, ప్రాణ నష్టంతోపాటు తినడానికి తిండి, తాగటానికి నీళ్లు లేక ముంపుప్రాంత ప్రజలు తీవ్ర క్షోభ అనుభవించారు. కష్టాల్లో ఉన్న వరద బాధితులకు, రైతులకు మంచి ప్యాకేజీ ఇస్తే తప్ప, వారు తిరిగి కోలుకోలేరు. అందుకే సాధారణ విపత్తులా దీన్ని చూడొద్దని కోరుతున్నా. అన్ని విధాలా తీవ్రంగా నష్టపోయిన ప్రజలను తిరిగి నిలబెట్టేందుకు కేంద్రం ఉదారంగా సాయం చేసి, ఆదుకునేలా చూడాలి" అని వివరించారు.

నష్టం- కష్టం..

దెబ్బతిన్న ఇరిగేషన్ ఆస్తులు	730 కోట్లు
ఎన్టీఆర్ జిల్లాలో బాధిత రైతులు	49,342
ఉద్యానశాఖకు నష్టం	5,227 హెక్టార్లు
ఆయిల్‌పామ్‌కు నష్టం	రూ 21.73 కోట్లు
పశు సంవర్ధకశాఖకు నష్టం	69.41 లక్షలు
కృష్ణానదికి రికార్డు స్థాయి వరద వల్ల చేపట్టాల్సిన పునరుద్ధరణ పనుల అంచనా	635 కోట్ల ఖర్చు
బుడమేరు గండ్లు	36.98 కోట్లు
మున్నేరు నష్టం	53.27 కోట్లు
దెబ్బతిన్న రహదారులు	690 కిలోమీటర్లు
రోడ్ల పునరుద్ధరణ అంచనా	రూ.189 కోట్లు
తాగునీటి పథకాలకు నష్టం	114 కోట్లు



సచివాలయంలో చంద్రబాబుతో కేంద్ర బృందం

బ్యారేజీకి ఇంత వరద గతంలో రాలేదు..

ప్రకాశం బ్యారేజ్ చరిత్రలో ఇంత పెద్ద వరద ఎప్పుడూ రాలేదని, 11.43లక్షల క్యూసెక్కుల వరద నీరు వచ్చిందని కేంద్ర బృందానికి చంద్రబాబు వివరించారు. ఇదే ఇప్పటి వరకు రికార్డు స్థాయి వరద అని వివరించారు. కృష్ణానదికి 14లక్షల క్యూసెక్కుల వరద నీరు వస్తే.. పరిస్థితి ఏంటనేది ఆలోచన చేయాల్సిన అవసరముందని తెలిపారు. రెండురోజుల వ్యవధిలో 50సెంటీమీటర్ల వర్షం కురిసిందని వివరించారు. "వరదల్లో ప్రజలు పడిన బాధలు చూసి చలించిపోయాం. సీఎం నుంచి చిన్న ఉద్యోగి వరకు క్షేత్రస్థాయిలో ఉండి సహాయక చర్యలను యుద్ధంలా చేపట్టాం. మంత్రులు, అధికారులు అంతా క్షేత్రస్థాయిలో ఉండి పని చేశారు. కలెక్టరేట్‌ను సచివాలయంలా చేసుకుని పని చేశాం. అప్పటికప్పుడు డ్రోన్లు తెప్పించి, ఆహారం సరఫరా చేశాం. కేంద్రం సాయం తీసుకున్నాం. సర్వశక్తులూ ఒడ్డాం. ఫైరింజన్లతో రోడ్లు, ఇళ్లు క్లీన్ చేశాం. రోడ్లు, ఇరిగేషన్ వ్యవస్థకు నష్టం జరిగింది. నష్టపోయిన కౌలురైతులకు సాయం అందేలా చూడాల్సిన అవసరముంది" అని కేంద్రబృందానికి పరిస్థితిని ముఖ్యమంత్రి వివరించారు.

ప్రభుత్వ చర్యలతో సాంత్వన: కేంద్రబృందం

వరద ప్రాంతాల్లో తమ అనుభవాలను కేంద్ర హోంశాఖ సంయుక్త కార్యదర్శి అనిల్ సుబ్రహ్మణ్యం వివరించారు. "ఇంత స్థాయి వరదలు.. బాధల అనంతరం కూడా ప్రజలు...ప్రభుత్వంపై ఎంతో నమ్మకంతో ఉన్నారు. ప్రభుత్వ చర్యలు వారికి సాంత్వన చేకూర్చాయి. ఇంత కష్టంలోనూ ప్రభుత్వంపై అసంతృప్తి, ఆగ్రహం కనిపించలేదు. తమకు ప్రభుత్వం సాయం చేసిందని, న్యాయం చేస్తుందనే నమ్మకం వారిలో ఉంది. భారీగా పంట నష్టం, మౌలిక సదుపాయాలకు నష్టం జరిగిందని తెలిసింది. బుడమేరు వరదలపై ప్రజలు బాధలు చెప్పుకొన్నారు. 60ఏళ్ల తర్వాత ఇలాంటి వరదలు వచ్చాయని చెప్పారు. కేంద్రం దృష్టికి తీసుకెళ్లి, తగు సాయానికి ప్రయత్నం చేస్తాం అని అన్నారు.

> "రికార్డుస్థాయిలో భారీ వర్షాలు, ఆకస్మిక వరదలు ప్రజల జీవితాలను అతలాకుతలం చేశాయి. ప్రజల ఆస్తులకు తీవ్ర నష్టం వాటిల్లింది. పంటలు నీళ్లలో మునిగి రైతులు కుదేలయ్యారు. ఆస్తి, ప్రాణ నష్టంతోపాటు తినడానికి తిండి, తాగటానికి నీళ్లు లేక ముంపుప్రాంత ప్రజలు తీవ్ర క్షోభ అనుభవించారు. సర్వం కోల్పోయి, కష్టాల్లో ఉన్న వరద బాధితులకు, రైతులకు మంచి ప్యాకేజీ ఇస్తే తప్ప, వారు తిరిగి కోలుకోలేరు. అందుకే సాధారణ విపత్తులా దీన్ని చూడొద్దని కోరుతున్నా. అన్నివిధాలా తీవ్రంగా నష్టపోయిన ప్రజలను తిరిగి నిలబెట్టేందుకు కేంద్రం ఉదారంగా సాయం చేసి, ఆదుకునేలా చూడండి"
>
> - కేంద్ర బృందంతో సీఎం చంద్రబాబు

బురద శుభ్రానికి ఫైరింజన్ల ఆలోచన అద్భుతం

వరద ముంపు ప్రాంతాల్లో వీధులు, కాలనీలు, ఇళ్లలో బురదను శుభ్రం చేయడానికి ఫైరింజన్లు ఉపయోగించాలనే ఆలోచన అద్భుతమని కేంద్ర వైద్య బృందం ప్రశంసించింది. గురువారం సచివాలయంలో వైద్య ఆరోగ్య శాఖ స్పెషల్ సీఎస్ కృష్ణబాబుతో బృందం ప్రతినిధులు భేటీ అయ్యారు. కేంద్ర బృందంలో రమేష్ చంద్ర, రామకృష్ణ, ఎం.రాజేంద్రప్రసాద్, స్మితా సింఘాల్, సత్యనారాయణ్, వీగ్రెకీ తదితరులు ఉన్నారు.

విజయవాడను ఆదుకుంటాం

- పెద్ద విపత్తే.. మనోధైర్యం కోల్పోవద్దు
- కేంద్ర బృందం భరోసా
- విజయవాడ, ఎన్టీఆర్ జిల్లాల్లో పర్యటన

విజయవాడ, గుంటూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రికార్డు స్థాయి భారీ వర్షాలు, వరదలు విజయవాడను అతలాకుతలం చేశాయని కేంద్ర బృందం అభిప్రాయపడింది. ఒక ముప్పునుంచి తప్పించుకునే లోపే మరో ముప్పు .. ఇలా వర్షాలు.. వరదలు ఒకేసారి విరుచుకు పడటం వల్ల విజయవాడలో దాదాపుగా సగానికి పైగా ప్రాంతం ముంపునకు గురైందని గుర్తించింది. విజయవాడతో పాటు ఎన్టీఆర్ జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలు కూడా భారీ విపత్తునే చవిచూశాయని అభిప్రాయపడింది. విపత్తు మిగిల్చిన నష్టం పూడ్చేందుకు తమ వంతు కృషి చేస్తామని, మనో ధైర్యం కోల్పోవద్దని కేంద్ర బృందం.... ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగానికి హామీ ఇచ్చింది. గురువారం కేంద్ర హోం శాఖ జాయింట్ సెక్రటరీ అనిల్ సుబ్రహ్మణ్యం నేతృత్వంలోని కేంద్ర బృందం ఎన్టీఆర్ జిల్లాలో పర్యటించింది. జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో వివిధ శాఖల నేతృత్వంలో జరిగిన నష్టాలకు సంబంధించి ఫొటో ఎగ్జిబిషన్, పవర్ పాయింట్ ప్రజంటేషన్‌ను ఏర్పాటుచేశారు. జిల్లాకు సంబంధించిన నష్టాలను కలెక్టర్ సృజన వివరించారు. అనంతరం కేంద్ర బృందం ప్రకాశం బ్యారేజీ దగ్గరకు వెళ్లి, ఇటీవల బోట్లు ఢీకొట్టిన ప్రాంతాన్ని పరిశీలించింది. బోట్ల తొలగింపు పనుల గురించి తెలుసుకున్నారు. తర్వాత బుడమేరు డైవర్షన్ చానల్, గండ్లుపడిన ప్రాంతాలను పరిశీలించారు. జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, ఎమ్మెల్యే వసంతకృష్ణ ప్రసాద్‌తో కేంద్ర బృందం కొద్దిసేపు చర్చించింది. బుడమేరు గట్ల బలోపేతం కోసం చేస్తున్న పనులను పరిశీలించింది. అనంతరం ఇబ్రహీంపట్నం మండలం ఈలప్రోలులో వరి పంటకు జరిగిన నష్టాన్ని పరిశీలించారు. కాగా, వరద నష్టాన్ని పరిశీలించేందుకు కేంద్రబృందం గురువారం గుంటూరు జిల్లాలో పర్యటించింది. శాఖల వారీగా జరిగిన నష్టం, చేపట్టిన సహాయక చర్యల గురించి కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి.. పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు.



పెద్దాపురంలో ఏలేరు వరద ముంపు బాధిత రైతులతో మాట్లాడుతున్న షర్మిల

జగన్ హయాంలో ప్రాజెక్టులను గాలికొదిలారు

- డ్యామ్‌లు కొట్టుకుపోతున్నా పట్టించుకోలేదు.. షర్మిల ధ్వజం
- ఏలేరు వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటన

పెద్దాపురం, సెప్టెంబరు 12: మాజీ సీఎం జగన్ హయాంలో ప్రాజెక్టులన్నీ గాలికి వదిలేశారని ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల ఆరోపించారు. కాకినాడ జిల్లా పెద్దాపురంలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో గురువారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఏలేరు ఆధునీకరణపై జగన్ దృష్టి సారించలేదని, ఆ నిర్లక్ష్యమే ఏలేరు వరద రైతులను నిండా ముంచిందని ఆవేదన వ్యక్తం చేశారు. వైఎస్సార్ హయాంలో రూ.135 కోట్లు సైతం విడుదల చేసి ఏలేరు ఆధునీకరణ పనులు ప్రారంభించారని గుర్తుచేశారు. జగన్ హయాంలో డ్యామ్‌లు కొట్టుకుపోతున్నా పట్టించుకోలేదని విమర్శించారు. జగన్ గతంలో రూ.4వేలు పరిహారం ఇచ్చి రైతులను మోసగించారని, అదే మోసం మళ్లీ చంద్రబాబు చేయవద్దని కోరారు. రాష్ట్రంలో 6లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగిందని చెప్పారు. ఇప్పటికైనా తక్షణమే ఏలేరు ఆధునీకరణ పనులు మొదలుపెట్టాలని షర్మిల డిమాండ్ చేశారు.

రాజధాని పునర్నిర్మాణానికి శ్రీకారం

- సీఆర్‌డీఏలో భూ కేటాయింపులపై మంత్రివర్గ ఉపసంఘం
- సభ్యులుగా ఆరుగురు మంత్రులు.. ఉత్తర్వులు జారీ

అమరావతి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి నిర్మాణ పనులు ప్రారంభించేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. గతంలో సీఆర్‌డీఏ పరిధిలో వివిధ సంస్థలకు కేటాయించిన భూములను పరిశీలించేందుకు మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసింది. ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్, మున్సిపల్ మంత్రి పొంగూరు నారాయణ, గనులశాఖ మంత్రి కొల్లు రవీంద్ర, గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్, పరిశ్రమలశాఖ మంత్రి టీజీ భరత్ దీనిలో సభ్యులుగా ఉంటారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. సీఎస్ కన్వీనర్‌గా ఉన్న మంత్రివర్గ ఉపసంఘంలో ఆయా శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు ఉంటారు. ఈ ఉపసంఘం రాజధాని ప్రాంతంలో గతంలో కేటాయించిన భూములను సమీక్షిస్తుంది. వారికి తిరిగి కొనసాగించాలా? అనే అంశంపై పరిశీలిస్తుంది. భూముల కేటాయింపులపై ఏమైనా మార్పులు చేపట్టాలన్నా నిర్ణయం తీసుకుంటుంది. కొత్తగా అమరావతిలో భూముల కోసం అభ్యర్థనలు వస్తే పరిశీలిస్తుంది.

రాష్ట్ర కాంగ్రెస్ అధికార ప్రతినిధుల నియామకం

అమరావతి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ(ఏపీసీసీ) అధికార ప్రతినిధులను పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల నియమించారు. మాజీ రాజ్యసభ సభ్యుడు నర్రెడ్డి తులసిరెడ్డిని ప్రధాన అధికార ప్రతినిధిగా, షేక్ మస్తాన్‌వలీ, అమర్హహ బేగ్ మహమ్మద్, ఆమంచి కృష్ణమోహన్, షేక్ సైదా, నరసపురెడ్డి కిరణ్ కుమార్‌రెడ్డి, నూతన్ నాయుడు, బి.శివకుమార్, కాసరగడ్డ నాగార్జున అధికార ప్రతినిధులుగా నియమితులయ్యారు.

బుడమేరు ఆక్రమణలు తొలగించాలి: రామకృష్ణ

అమరావతి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): హైదరబాదులో చెరువుల్లో ఆక్రమణలను తొలగించేందుకు తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న హైడ్రా తరహాలోనే ఏపీ ప్రభుత్వం కూడా విజయవాడలో బుడమేరు ఆక్రమణలను తొలగించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. ఆయన నేతృత్వంలో సీపీఐ నేతల బృందం గురువారం 'బుడమేరు టు కొల్లేరు' పర్యటన నిర్వహించింది. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ... 'బుడమేరుపై ఆక్రమణలపై మా పార్టీ చేసిన అధ్యయన నివేదికను ప్రభుత్వానికి అందజేస్తాం' అని చెప్పారు.

మమ్మల్ని పంపేయండి!

- 'వరద' డ్యూటీలకు వచ్చిన మున్సిపల్ సిబ్బంది గగ్గోలు
- పని పూర్తయినా... రిలీవ్ చేయకపోవడంపై ఆందోళన

అమరావతి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): విజయవాడ వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి నగరానికి వచ్చిన మున్సిపల్ ఉద్యోగులు, అధికారులు రిలీవ్ కోసం ఎదురుచూస్తున్నారు. విపత్తు నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో సహాయక చర్యల నిమిత్తం వీరంతా విజయవాడ వచ్చారు. 61, 62, 63, 64 వార్డుల్లో మాత్రం ఇప్పటికీ నీళ్లు ఉండటంతో అక్కడ ఇంకా సహాయ, పునరావాస కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరముంది. ఇందుకోసం ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు సరిపోతారు. మిగిలిన అన్ని ప్రాంతాల్లో సాధారణ పరిస్థితులు నెలకొన్నాయి. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన సిబ్బందికి వసతి, ఆహార సదుపాయాలు కల్పించడం స్థానిక అధికారులకు కొంత కష్టంగా మారింది. కొన్నిచోట్ల సిబ్బందికి కమ్యూనిటీ హాళ్లు, కల్యాణ మండపాల్లో వసతి ఇచ్చారు. అయితే అక్కడ అంత మందికి సరైన వసతులు అందక కొంత మంది అస్వస్థతకు గురయ్యారు. దీంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీల సిబ్బందిని విజయవాడకు తరలించడంతో అక్కడ మున్సిపాలిటీల్లో సిబ్బంది కొరతతో సమస్యలు నెలకొన్నాయి.. వాస్తవానికి విజయవాడలో ముంపు సహాయక చర్యలు చేపట్టేందుకు తమ అవసరం ఇక పెద్దగా ఉండకపోయినా, మున్సిపల్ శాఖ నుంచి ఆదేశాలు రాకపోవడంతో ఇక్కడే ఉండాల్సి వస్తుందని పలువురు ఉద్యోగులు వాపోతున్నారు. ఇప్పటికే పలు మున్సిపాలిటీల పరిధిలో వర్షాల కారణంగా పారిశుధ్యం మెరుగుపరిచే సిబ్బంది లేకపోవడంతో అక్కడ పరిస్థితులు గాడి తప్పేట్లు ఉన్నాయని ఆందోళన చెందుతున్నారు. విజయవాడలో పరిస్థితులు సాధారణ స్థితికి వచ్చినందున ఇక ఈ ప్రాంతంలో చేపట్టాల్సిన పునరావాస కార్యక్రమాలను విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ చేసుకోగలదని ఆ అధికారులు పేర్కొంటున్నారు. మంత్రి నారాయణ చొరవ చూపించి ఉద్యోగులను రిలీవ్ చేసి మిగతా మున్సిపాలిటీల్లో పారిశుధ్యం మెరుగుపరిచేలా చూడాలని కోరుతున్నారు.

సీఎం చంద్రబాబుతో టీ మంత్రి ఉత్తమ్ భేటీ

అమరావతి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రిగా 4వసారి బాధ్యతలు స్వీకరించిన సీఎం చంద్రబాబును తెలంగాణ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి అభినందించారు. తన మిత్రుడి ఇంట జరిగిన ఒక కార్యక్రమానికి హాజరయ్యేందుకు గురువారం విజయవాడకు వచ్చిన ఉత్తమ్ దంపతులు వెలగపూడి సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిశారు. మంత్రి ఉత్తమ్ ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబుతో భేటీ కేవలం మర్యాదపూర్వకమే. తెలుగు రాష్ట్రాలకు సంబంధించిన అంశాలేవీ ప్రస్తావనకు రాలేదు. ఆయన సీఎంగా బాధ్యతలు స్వీకరించాక హైదరాబాద్ వచ్చినా కలవడం కుదరలేదు. నా స్నేహితుడి ఇంట దశదినకర్మల కార్యక్రమంలో పాల్గొనేందుకు విజయవాడకు వచ్చా. ఈ సందర్భంగా ఆయనను కలసి అభినందనలు తెలిపా. ఇరువురి మధ్య స్నేహపూర్వక, పరస్పర అభినందనలు మినహా రాష్ట్రాల మధ్య అంశాలు ప్రస్తావనకు రాలేదు' అని స్పష్టం చేశారు.

తొలగని ఏలేరు ముంపు



రాజమహేంద్రవరం రోడ్ కం రైలు బ్రిడ్జి వద్ద వరద

- ప్రాజెక్టులో తగ్గినట్టే తగ్గి పెరుగుతున్న ప్రవాహం
- 8 మండలాల్లో 64 గ్రామాలు అతలాకుతలం
- నీటిలో నానుతున్న ఊళ్లు, పొలాలు
- కోళ్ల ఫారాల్లో వేల కోళ్లు మృత్యువాత
- 75 వేల ఎకరాల్లో పంటలు మునక
- పంట నష్టం రూ.180 కోట్లుగా అంచనా

కాకినాడ, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ఇంకా ఏలేరు వరదలోనే చిక్కుకొని ఉంది. ఒక పక్క జలాశయంలోకి ఇన్‌ఫ్లో తగ్గినట్లే తగ్గి మళ్లీ పెరుగుతుండడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే ఏలేరు వరద 8 మండలాల్లోని 64 గ్రామాలను అతలాకుతలం చేసింది. వేలాది ఎకరాల పంట పొలాలు, గ్రామాల్లో నీటిలోనే నానుతున్నాయి. కుళ్లిపోయిన బురదలో కూరుకుపోయిన వరి చేలను చూసి అన్నదాతలు కన్నీటిపర్యంతం అవుతున్నారు. కోళ్లఫారాల్లో వేలాది కోళ్లు చనిపోయి బయటకు తేలుతుండటంతో పౌల్ట్రీ రైతులు ఆవేదన చెందుతున్నారు. పిఠాపురం నియోజకవర్గంలో పిఠాపురం, గొల్లప్రోలు మండలాలు అటు ఏలేరు, అటు సుద్దగెడ్డ ప్రవాహాలతో వణుకుతున్నాయి. ఈ ప్రాంతాలు తేరుకోవడానికి మరో మూడు రోజులు పట్టేలా ఉంది. గొల్లప్రోలు ఎస్సీ కాలనీలో సుద్దగడ్డ వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. సూరంపేట చుట్టూ చేరిన ఏలేరు, సుద్దగడ్డ వరద తగ్గకపోవడంతో ప్రజలు బోటులో రాకపోకలు సాగిస్తున్నారు. ఏకే మల్లవరం, ఏపీ మల్లవరం, సీతానగరం, లక్ష్మీపురం గ్రామాల్లోని పంటపొలాల్లో ముంపు మరింత పెరిగింది. యు.కొత్తపల్లి చివరి మండలం కావడంతో నాలుగు రోజులుగా పోటెత్తిన ఏలేరు వరదంతా ఇప్పుడు సముద్రాన్ని ఆనుకుని ఉన్న ఈ మండలంలోని ఐదు గ్రామాల మీదుగా ప్రవహిస్తోంది. దీంతో వందలాది ఇళ్లు, పంటలు ముంపులో చిక్కుకున్నాయి. కిర్లంపూడిలోని రాజుపాలెంలో గురువారం నాటికి వరద కొంచెం తగ్గడంతో బాధితులు ఇళ్లలో బురదపాలైన దుస్తులు, వస్తువులు, ఎలక్ట్రికల్ వస్తువులను ఆరబెట్టుకుంటున్నారు. జిల్లావ్యాప్తంగా 75వేల ఎకరాల్లో వరి, ఇతర పంటలు నీట మునిగినట్లు వ్యవసాయశాఖ ప్రాథమికంగా అంచనా వేసింది. మొత్తం 20 మండలాల్లో 206 గ్రామాల్లో పంటలు మునగడంతో 41వేల మంది రైతులు నష్టపోయారు. పంటనష్టం రూ.180కోట్లుగా అంచనా వేశారు.



కాకినాడ జిల్లా గొల్లప్రోలు వద్ద కుళ్లిపోయిన వరి పంట



కాకినాడ జిల్లా గొల్లప్రోలులో మగ్గం గోతుల్లోకి చేరిన నీటిని చూపిస్తున్న చేనేత కార్మికురాలు కుమారి

తగ్గుతున్న గోదావరి నీటిమట్టం

- ధవళేశ్వరం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక

రాజమహేంద్రవరం(ఆంధ్రజ్యోతి)/పోలవరం, సెప్టెంబరు 12: గోదావరి నీటిమట్టం గురువారం తగ్గుముఖం పట్టింది. వరద తగ్గినప్పటికీ ఇంకా ఉగ్రంగానే ప్రవహిస్తోంది. భద్రాచలం వద్ద బుధవారం రాత్రే రెండో ప్రమాద హెచ్చరిక ఉపసంహరించగా, గురువారం ఉదయం 10 గంటలకు మొదటి ప్రమాద హెచ్చరికను కూడా ఉపసంహరించారు. రాత్రి 8 గంటలకు 41.20 అడుగులకు తగ్గడంతో అధికారులు కాస్త ఊపిరి పీల్చుకున్నారు. తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద వరద తగ్గుముఖం పట్టినా రెండో ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. ప్రస్తుతం బ్యారేజీ నీటిమట్టం 14.30 అడుగులు ఉండగా 13,63,243 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. భద్రాచలం ఎగువన లక్ష్మీ బ్యారేజీ నుంచి వరద నీరు వస్తుందని చెబుతున్నారు. ఇక్కడ వరద పోటెత్తితే కొద్దిరోజులు గోదావరి వరద ఉగ్రంగానే ఉండే అవకాశం ఉంది. రాజమహేంద్రవరం అఖండ గోదావరిలోని లంకలన్నీ మునిగే ఉన్నాయి. కోనసీమ జిల్లాలోని లంక ప్రజలు బిక్కుబిక్కుమంటున్నారు. కాగా, పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వేలోకి వస్తున్న 11,66,581 క్యూసెక్కులను అధికారులు దిగువకు విడుదల చేశారు. స్పిల్‌వే ఎగువన 33.410 మీటర్లు, దిగువన 25.310 మీటర్ల నీటిమట్టం నమోదైనట్లు ఈఈ మల్లికార్జునరావు తెలిపారు.



కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం రమణక్కపేట వద్ద సముద్రంలో ఏలేరు వరదనీరు కలిసిన చోట వేర్వేరుగా కనిపిస్తున్న వరదనీరు, సముద్ర నీరు

వెంకటరెడ్డిపై ఏసీబీ కేసు

- ఇసుక అక్రమాలు రూ.2,500 కోట్లపైనే
- ప్రధాన కుట్రదారు, సూత్రధారి ఆయనే
- కుట్ర, అవినీతి, దోపిడీలో ఏ1గా నమోదు
- త్వరలో అరెస్ట్ చేసే అవకాశం
- మరో ముగ్గురిపై కూడా కేసు



అమరావతి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ అండతో గనుల శాఖను సొంత సామ్రాజ్యంగా మలుచుకున్న అప్పటి డైరెక్టర్ వీజీ వెంకటరెడ్డిపై అవినీతి నిరోధక శాఖ గురువారం కేసు నమోదు చేసింది. కుట్ర, అవినీతి, దోపిడీ కేసులో తొలి నిందితుడు (ఏ1)గా ఆయన పేరును చేర్చింది. మరో ముగ్గురిపై కూడా కేసు నమోదైంది. వీరిలో గనుల శాఖలో మరో కీలక అధికారి పేరు ఉన్నట్లు తెలిసింది. ఇసుక కాంట్రాక్ట్ చేసిన జేపీ వెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్, మరో ఇద్దరి పేర్లను కూడా త్వరలో చేర్చనున్నట్లు తెలిసింది. ఇసుక వ్యవహారంలో దాదాపు రూ.2500 కోట్ల మేర అక్రమాలు జరిగినట్టు అధికారులు ప్రాథమికంగా నిర్ధారించినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో వెంకటరెడ్డిని త్వరలో అరెస్ట్ చేసే అవకాశం ఉంది. విచారణకు హాజరు కావాల్సిందిగా తొలుత ఆయనకు అవినీతి నిరోధక చట్టం(పీసీ) కింద నోటీసులు ఇవ్వాలని అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లోనే వెంకటరెడ్డి నివాసంలో ఉంటున్నట్లు నిఘావర్గాలు గుర్తించినట్లు తెలిసింది. ఏసీబీ వెంకటరెడ్డిని అరెస్ట్ చేయాలనుకుంటే ఎవరి అనుమతి పొందాల్సిన అవసరం లేదని అధికారవర్గాలు చెబుతున్నాయి. ఆగస్టు 31న వెంకటరెడ్డి పదవీ విరమణ చేశారు. ఈ నేపథ్యంలో ఇప్పుడు ఆయన సాధారణ వ్యక్తిగానే ఉంటున్నారు. కాబట్టి ఆయన అరెస్ట్‌కు రక్షణ శాఖ నుంచి ప్రత్యేక అనుమతి పొందాల్సిన అవసరం లేదని ఆ వర్గాలు చెబుతున్నాయి. జగన్ ప్రభుత్వంలో వెంకటరెడ్డి గనుల శాఖ డైరెక్టర్‌గా, ఏపీఎండీసీ ఎండీగా పనిచేశారు. ఉచిత ఇసుక స్థానంలో అమ్మకాలు చేపట్టారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు 2021-23 సంవత్సరానికి టెండర్‌లు పిలిచి జేపీ వెంచర్స్‌కు కాంట్రాక్టు ఇచ్చారు. టెండర్‌లో అక్రమాలు జరిగాయని, ఇసుక దోపిడీ జరిగిందని, పర్యావరణాన్ని విధ్వంసం చేశారని టీడీపీ కూటమి ప్రభుత్వం గుర్తించింది. ఏసీబీ విచారణకు ఆగస్టులో ఆదేశించింది. ఏసీబీ నెలన్నర పాటు జిల్లాల వారీగా ఇసుక వ్యవహారాలపై విచారణ జరిపింది. గనుల శాఖ ప్రధాన కార్యాలయంలోని టెండర్ల రికార్డులను పరిశీలించింది. టెండర్ల నిర్వహణ, ఇసుక కాంట్రాక్ట్, అమ్మకాల్లో భారీ అక్రమాలు జరిగాయని.. అంతా కుట్రపూరితంగా జరిగిందని, అధికార దుర్వినియోగం, అవినీతి, ఆశ్రిత పక్షపాతం, ఇతర అక్రమాలకు పాల్పడ్డారని తాజాగా గుర్తించింది. 1957 నాటి గనుల చట్టాన్ని ఉల్లంఘించి మరీ అక్రమాలకు పాల్పడ్డారని కీలక ఆధారాలను సేకరించింది. ఇసుక కుంభకోణంలో కుట్రదారులు, సూత్రధారుల్లో వెంకటరెడ్డి ప్రధాన వ్యక్తి అని ఏసీబీ గుర్తించింది. ఆయన తొలి నిందితుడి(ఏ1)గా కేసు నమోదు చేసింది. అవినీతి నిరోధక చట్టం సెక్షన్ 7, 9, 10, 12, 13, ఐపీసీ 30(బీ) కింద కుట్ర, సెక్షన్ 420ను నమోదు చేసింది. గనుల కన్సెషన్ రూల్స్, రెగ్యులేషన్ చట్టం-1957లోని 4 సెక్షన్‌లను నమోదు చేసినట్లు తెలిసింది. ఇసుక కాంట్రాక్టులో జరిగిన కుట్ర, అక్రమాలు ఏమిటో ఏసీబీ గుర్తించింది. ఇక మిగిలిందల్లా ఆ అంశాలపై వెంకటరెడ్డితో నిర్ధారణ చేసుకోవడమే. గనుల శాఖలోనే మరో కీలక అధికారిపై కూడా ఏసీబీ దృష్టి సారించింది. వెంకటరెడ్డి ఆదేశాలతో అడ్డగోలుగా నిర్ణయాలు తీసుకొని అమలు చేసిన ఆ అధికారిని కూడా విచారణకు పిలవాలని నిర్ణయించినట్లు తెలిసింది. ప్రస్తుతం ఆ అధికారి గనుల శాఖలో అత్యంత కీలక స్థానంలో ఉన్నారు. వెంకటరెడ్డి డైరెక్టర్‌గా ఉన్న సమయంలో ఇసుక అంశంలో చక్రం తిప్పారు. ఆ అధికారి వెంకటరెడ్డితో సమానంగా అక్రమాలకు పాల్పడ్డారని ఫిర్యాదులున్నాయి. జిల్లాల పర్యటన వెళ్లిన సమయంలో ఏసీబీకి ఫిర్యాదులు అందినట్లు తెలిసింది.

వెంకటరెడ్డి నివాసాల్లో సోదాలు

తిరుపతి, చెన్నై, హైదరాబాద్‌లో ఉన్న వెంకటరెడ్డి నివాసాల్లో ఏసీబీ అధికారులు సోదాలు జరుపుతున్నారు. గురువారం రాత్రి ఏకకాలంలో తనిఖీలు చేపట్టినట్లు తెలిసింది. కాగా తనను సస్పెండ్ చేస్తూ ఇచ్చిన ఉత్తర్వులను సస్పెండ్ చేయాలని కోరుతూ వెంకటరెడ్డి కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

జీరో సర్వీసు బదిలీలే!

- ఎక్సైజ్ ఉద్యోగుల డిమాండ్..తమను కదిలించొద్దంటూ కొందరి ఒత్తిళ్లు
- అధికారుల సంఘం పేరుతో చక్రం తిప్పుతున్న వైనం
- వాసుదేవరెడ్డితో అంటకాగి మంచి స్థానాల్లో తిష్ట
- ఇప్పుడూ ఆ స్థానాలు వీడేందుకు ససేమిరా!.. సెబ్ ఏర్పాటు సమయంలో అందరూ బదిలీ
- తాజాగా పునర్నిర్మాణంలోనూ దానికే ఉద్యోగుల డిమాండ్

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఎక్సైజ్ శాఖలో బదిలీలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన నేపథ్యంలో కొందరు అధికారులు ఉన్న చోటే తిష్ట వేసేందుకు ప్రయత్నిస్తున్నారు. గత ప్రభుత్వం ఎక్సైజ్ శాఖను విడగొట్టి సెబ్‌ను ఏర్పాటుచేసింది. కొత్త ప్రభుత్వం సెబ్‌ను రద్దుచేసి తిరిగి ఎక్సైజ్ పునర్నిర్మాణం ప్రారంభించింది. ఇలా రెండు శాఖలు ఒక్కటిగా తిరిగి కలిసిపోతున్నందున జీరో సర్వీసు ప్రామాణికంగా అందరినీ బదిలీ చేయాలని 80శాతం మంది అధికారులు, ఉద్యోగులు కోరుతున్నారు. అయితే, మంచి స్థానాల్లో ఉన్న కొందరు అందుకు విరుద్ధంగా తమను అక్కడే ఉంచాలనే ప్రయత్నాలు మొదలుపెట్టారు. తమను కదపకుండా కొత్తగా సెబ్ నుంచి వచ్చేవారికి కొత్త స్థానాలు ఇవ్వాలని పైస్థాయిలో చక్రం తిప్పుతున్నారు. అలాగే సెబ్‌లోనూ మంచి స్థానాల్లో ఉన్నవారు అక్కడే ఉండాలని కోరుకుంటున్నారు. ఇలాంటివారంతా కలిసి బదిలీలు తమకు అనుకూలంగా జరగాలని పట్టుబడుతున్నారు. ఇలా చేస్తే మిగిలిన అధికారులు, ఉద్యోగులకు అన్యాయం జరుగుతుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. 2020లో ఎక్సైజ్ శాఖను విభజించి సెబ్‌ను ఏర్పాటు చేసినప్పుడు ఉద్యోగులందరినీ బదిలీ చేశారని, తిరిగి విలీనంలోనూ అలాగే చేయాలని ఎక్కువ మంది డిమాండ్ చేస్తున్నారు. అయితే, గజిటెడ్ అధికారుల సంఘంలోని కొందరు తమను కదపొద్దని ప్రభుత్వాన్ని కోరుతున్నట్టు విమర్శలు వినిపిస్తున్నాయి.

వాసుదేవరెడ్డితో అంటకాగి..

జీరో సర్వీసు ప్రామాణికంగా బదిలీలు వద్దంటున్న వారిలో ఎక్కువ మంది బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ ఎండీ వాసుదేవరెడ్డితో అప్పట్లో అంటకాగారు. ఆయనకు అనుకూలంగా ఉండే అధికారులను మంచి స్థానాల్లో ఆయన నియమించుకున్నారు. ఆయన చేసిన కుంభకోణంలో ఈ అధికారుల ప్రమేయం కూడా ఎంతోకొంత ఉందన్న ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో అధికారులందరినీ స్థానాలు మారిస్తే శాఖ ప్రక్షాళన అవుతుందని, గత ప్రభుత్వం పెట్టుకున్న వారిని అవే స్థానాల్లో కొనసాగిస్తే వైసీపీ ముద్రే కనిపిస్తుందని ఉద్యోగులు అంటున్నారు.

పునర్నిర్మాణ జీవో సిద్ధం

అప్పట్లో వైసీపీ ప్రభుత్వం ఎక్సైజ్ శాఖను విభజించి అందులోని 70శాతం మందిని సెబ్‌కు కేటాయించింది. తాజాగా సెబ్ ఏర్పాటు జీవోలు రద్దు చేయడంతో వారందరూ తిరిగి ఎక్సైజ్ శాఖలో రిపోర్టు చేయాలి. అయితే ఇందుకోసం కేబినెట్ ఆమోదంతో ప్రభుత్వం మరో జీవోను జారీచేయాలి. ఇది ప్రస్తుతం సీఎం కార్యాలయంలో సిద్ధంగా ఉంది. సీఎంవో నుంచి వచ్చిన వెంటనే ఎక్సైజ్ శాఖ పునర్నిర్మాణ జీవోను విడుదల చేయనుంది. ఆ వెంటనే బదిలీలు చేపట్టే అవకాశం ఉంది. ఈ నెలలోనే కొత్త మద్యం పాలసీని తీసుకురాబోతున్నందున వీలైనంత త్వరగా బదిలీలు పూర్తిచేయాలని ఎక్సైజ్ శాఖ భావిస్తోంది.

ఎంపీ మిథున్‌రెడ్డిపై తొందరపాటు చర్యలొద్దు

- పోలీసులకు హైకోర్టు ఆదేశం.. విచారణ 17కి వాయిదా

అమరావతి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డిపై తొందరపాటు చర్యలు తీసుకోవద్దని చిత్తూరు జిల్లా పుంగనూరు పోలీసులను హైకోర్టు ఆదేశించింది. ఇదే కేసుకి సంబంధించి దాఖలైన వ్యాజ్యాలతో ప్రస్తుత రెండు పిటిషన్లను జత చేయాలని ఆదేశించింది. విచారణను ఈ నెల 17కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కె కృపాసాగర్ గురువారం ఉత్తర్వులు ఇచ్చారు. అంతకుముందు ప్రాసిక్యూషన్ తరఫు న్యాయవాది మర్రి వెంకటరమణ వాదనలు వినిపిస్తూ... ఇదే కేసులో నిందితులుగా ఉన్న మరికొందరు ముందస్తు బెయిల్ పిటిషన్లు దాఖలు చేశారని, ప్రస్తుత పిటిషన్లను వాటితో జత చేయాలని కోరారు. అన్ని వ్యాజ్యాలను ఒకేసారి విచారించాలని అభ్యర్థించారు. వైసీపీ ప్రభుత్వంలో చేపట్టిన నేతిగుట్లపల్లె, ఆవులపల్లి రిజర్వాయర్ల కోసం సేకరించిన భూములకు పరిహారం చెల్లింపు విషయంలో వినతిపత్రం సమర్పించేందుకు వెళ్లిన తమపై మిథున్‌రెడ్డి, ఆయన అనుచరులు దాడి చేశారని పేర్కొంటూ ఏఎస్ఆర్‌కె ప్రసాద్, సొహైల్ బాషా వేర్వేరుగా చేసిన ఫిర్యాదుల ఆధారంగా ఎంపీ మిథున్‌రెడ్డి, మాజీ ఎంపీ రెడ్డప్ప మరికొందరిపై పుంగనూరు పట్టణ పోలీసులు కేసులు నమోదు చేశారు. ఈ కేసుల్లో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ మిథున్‌రెడ్డి హైకోర్టులో వేర్వేరుగా రెండు పిటిషన్లు దాఖలు చేశారు.

పాస్‌పోర్టు పునరుద్ధరించేలా ఆదేశాలివ్వండి

- హైకోర్టును ఆశ్రయించిన మంత్రి కొల్లు రవీంద్ర .. విచారణ నేటికి వాయిదా

అమరావతి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): పాస్‌పోర్టు పునరుద్ధరణకు విజయవాడ ప్రాంతీయ పాస్‌పోర్టు కార్యాలయం అధికారి తిరస్కరించడాన్ని సవాల్ చేస్తూ మంత్రి కొల్లు రవీంద్ర హైకోర్టును ఆశ్రయించారు. వివిధ కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న క్రిమినల్ కేసులతో సంబంధం లేకుండా తన పాస్‌పోర్టును పునరుద్ధరించేలా ఆదేశించాలని కోరారు. ఈ వ్యాజ్యం గురువారం హైకోర్టులో విచారణకు వచ్చింది. ఈ వ్యవహారంపై వివరాలు సమర్పించాలని కేంద్ర హోంశాఖ, పాస్‌పోర్టు అధికారులను న్యాయస్థానం ఆదేశించింది. ఈ దశలో మంత్రి కొల్లు రవీంద్ర తరఫు న్యాయవాదులు ఎం.నిఖిత, ఎం.వి. రమణకుమారి స్పందిస్తూ... ఈ నెల 24 నుంచి 26 వరకు అమెరికాలోని లాస్‌వేగాస్‌లో జరగనున్న మైన్ ఎక్స్‌పో-2024లో మంత్రి రవీంద్ర పాల్గొనాల్సి ఉందని తెలిపారు. ఈ నెల 20న అక్కడికి బయల్దేరేందుకు ఏర్పాట్లు చేసుకున్నారని పేర్కొన్నారు. క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయనే కారణంతో పాస్‌పోర్టు పునరుద్ధరణను తిరస్కరించడం సుప్రీంకోర్టు, పలు హైకోర్టులు ఇచ్చిన తీర్పులకు విరుద్ధమని, వ్యాజ్యంపై అత్యవసరంగా విచారించాలని కోరారు. ఈ వివరాలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు.. తదుపరి విచారణను ఈ నెల 13కు వాయిదా వేశారు.

అడిషనల్ సెంట్రల్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్‌గా ఎంఎస్‌కేవీవీ సత్యనారాయణ బాధ్యతల స్వీకరణ



హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): అడిషనల్ సెంట్రల్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్‌గా ఎంఎస్‌కేవీవీ సత్యనారాయణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. జేఎన్‌యూ ఢిల్లీలో విద్యాభ్యాసం పూర్తి చేసిన సత్యనారాయణ పలు రాష్ట్రాల్లోని ఈపీఎఫ్‌వో అడ్మిన్ విభాగాల్లో సేవలందించారు. దేశంలో పలు ప్రాంతాల్లో విధులు నిర్వహించిన ఈయనకు ఈపీఎఫ్‌వోలో 27 ఏళ్ల అనుభవం ఉంది.

స్టేట్ బోర్డులోనే పరీక్షలు

- వెయ్యి సీబీఎస్‌ఈ స్కూళ్లపై ప్రభుత్వ నిర్ణయం
- 78 వేల మంది విద్యార్థులకు ఉపశమనం
- పరీక్షల విధానం సమూలంగా ప్రక్షాళన
- వచ్చే ఏడాది నుంచి దశలవారీగా మార్పులు

అమరావతి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో సీబీఎస్ఈ విద్యార్థులపై ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ విద్యా సంవత్సరంలో తొలిసారి సీబీఎస్ఈ బోర్డులో పరీక్షలు రాయాల్సిన నేపథ్యంలో వారికి ఉపశమనం కలిగించింది. ఈ ఏడాదికి స్టేట్ బోర్డులోనే పరీక్షలు రాసేలా చర్యలు చేపట్టింది. మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి లోకేశ్ ఆదేశాలతో ఈ మేరకు మార్పులు చేయనుంది. గత ప్రభుత్వంలో వెయ్యి పాఠశాలలను సీబీఎస్ఈలోకి మార్చారు. వాటిలో చదువుతున్న 78వేల మంది విద్యార్థులు ఈ ఏడాది పదో తరగతిలోకి ప్రవేశించారు. వారంతా ఈ ఏడాది సీబీఎస్ఈ బోర్డులో పరీక్షలు రాయాల్సి ఉండగా, వారి అభ్యసన సామర్థ్యాలపై పాఠశాల విద్యాశాఖ ఇటీవల అసెస్‌మెంట్ పరీక్ష నిర్వహించింది. అందులో 90శాతం విద్యార్థులు ఫెయిల్ అయ్యారు. వారు పబ్లిక్ పరీక్షలు కూడా సీబీఎస్ఈ తరహాలో రాస్తే ఎక్కువ మంది ఫెయిల్ అయ్యే ప్రమాదం ఉందని గుర్తించిన ప్రభుత్వం, స్టేట్ బోర్డులోనే పరీక్షలు రాయించేలా చర్యలు చేపట్టాలని నిర్ణయించింది. అసెస్‌మెంట్ పరీక్షలో 326 పాఠశాలల్లో ఒక్క విద్యార్థి కూడా ఉత్తీర్ణత సాధించలేదు. 556 పాఠశాలల్లో 25శాతం లోపు ఉత్తీర్ణత నమోదైంది. 14 పాఠశాలల్లో మాత్రమే 75శాతానికి పైగా ఉత్తీర్ణులయ్యారు.

పరీక్షల విధానం ప్రక్షాళన

2025-26 విద్యా సంవత్సరం నుంచి మొత్తం పరీక్షల విధానాన్నే మార్చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో రాణించేలా పరీక్షా విధానాన్ని మార్చనుంది. ప్రస్తుతం రాష్ట్ర బోర్డు పరీక్షలు ఎక్కువగా థియరీ పైనే ఆధారపడి ఉన్నాయి. ఇకపై వాటిని విశ్లేషణాత్మక విధానంలోకి మార్చాలని నిర్ణయించింది. అలాగే ఆబ్జెక్టివ్ ప్రశ్నలు పెంచాలని భావిస్తోంది. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఈ మార్పులు మొదలుపెట్టనుంది.

విద్యార్థుల భవిష్యత్తు కోసం: లోకేశ్

విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని పరీక్షలు స్టేట్ బోర్డులో రాసే అవకాశం కల్పించినట్లు మంత్రి లోకేశ్ ఓ ప్రకటనలో తెలిపారు. గత ప్రభుత్వం టీచర్లకు శిక్షణ ఇవ్వకుండా సీబీఎస్ఈ ప్రారంభించిందని, అదే కొనసాగిస్తే వారు ఫెయిల్ అయ్యే ప్రమాదం ఉందన్నారు. టోఫెల్, ఐబీ అంటూ హడావుడి చేసి గత ఐదేళ్లలో విద్యా వ్యవస్థను నాశనం చేశారని విమర్శించారు.

ఆదిమూలం ఇంట్లోకి నో ఎంట్రీ!

- గన్‌మెన్, పీఏ సహా ఎవరికీ అనుమతి లేదు
- చెన్నై ఆస్పత్రి నుంచి పుత్తూరుకు ఎమ్మెల్యే
- కలిసేందుకు ఇంటెలిజెన్స్ అధికారుల యత్నం
- ప్రస్తుతం మాట్లాడలేనని ఎమ్మెల్యే దాటవేత
- బాధిత మహిళకు ముగిసిన వైద్య పరీక్షలు



తిరుపతి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): లైంగిక వేధింపుల కేసు నమోదైన నేపథ్యంలో నాటకీయ పరిస్థితుల నడుమ చెన్నై అపోలో ఆస్పత్రిలో చేరిన సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం డిశ్చార్జి అయి ఇంటికి చేరుకున్నారు. వాస్తవానికి మంగళవారం రాత్రే ఆయన పుత్తూరు శివార్లలోని నివాసానికి చేరుకున్నారని తెలిసింది. కుటుంబీకులతో కలసి ఉంటున్న ఆయన గన్‌మెన్, పీఏ సహా బంధుమిత్రులు, పార్టీ నేతలు, కార్యకర్తలు ఎవరినీ ఇంటికి అనుమతించడం లేదని సమాచారం. ఈ నేపథ్యంలో బుధ, గురువారాల్లో తిరుపతి కేంద్రంగా పనిచేస్తున్న ఇంటెలిజెన్స్ అధికారులు ఎమ్మెల్యేను కలిసేందుకు యత్నించారు. ఈ వ్యవహారంలో వాస్తవంగా ఏమి జరిగిందన్నది ప్రభుత్వానికి నివేదించాల్సి ఉన్నందున వివరాలు సేకరించడానికి గానూ ఆయనకు ఫోన్ చేసినట్టు తెలిసింది. అయితే ఎమ్మెల్యే తాను ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయి ఇప్పుడే ఇంటికి వచ్చానని చెప్పినట్టు తెలిసింది. తన వయసు 72 ఏళ్లని, హృదయ సంబంధ సమస్యతో స్టంట్ వేయించుకున్నానని వివరించినట్టు సమాచారం. తన ఆరోగ్య పరిస్థితి దృష్ట్యా మాట్లాడలేనని చెప్పినట్టు తెలిసింది. రెండు మూడు రోజుల్లో తానే తిరుపతి వచ్చి కలుస్తానని దాటవేసినట్టు తెలిసింది. కాగా ఆదిమూలం తనను లైంగికంగా వేధించారని ఫిర్యాదు చేసిన బాధిత మహిళకు తిరుపతి ప్రభుత్వ మెటర్నిటీ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు ముగిశాయి. తొలుత పోలీసులు రెండు సార్లు ప్రయత్నించినా ఆమె వైద్య పరీక్షలకు ముందుకు రాలేదు. అయితే బుధవారం ఆమె అందుబాటులోకి రావడంతో అదే రోజు మధ్యాహ్నం 3.30 గంటలకు తిరుపతిలోని ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రికి తీసుకెళ్లారు. కేసు దర్యాప్తునకు అవసరమైన పది రకాల పరీక్షల నిమిత్తం శాంపిల్స్ సేకరించారు. గురువారం సాయంత్రం 4 గంటలకు ఆమెను డిశ్చార్జి చేశారు.

రాష్ట్రంలో అభివృద్ధే లేదు!

- హత్యలను బాబు, లోకేశ్ ప్రోత్సహిస్తున్నారు: జగన్

అమరావతి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అభివృద్ధి లేదని వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అన్నారు. రెడ్‌బుక్ పాలన చేస్తున్న సీఎం చంద్రబాబు ప్రభుత్వం ఎల్లకాలం ఉండదని చెప్పారు. ఆయన, లోకేశ్ బహిరంగంగానే హత్యలను ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. శిశుపాలుడి తప్పులు త్వరలో పూర్తవుతాయని వ్యాఖ్యానించారు. గురువారం తాడేపల్లి ప్యాలెస్‌లో ఆయన చిత్తూరు, తిరుపతి జిల్లాల వైసీపీ నేతలతో సమావేశమయ్యారు. రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి, ఆయన తండ్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మాజీ ఉపముఖ్యమంత్రి కె.నారాయణస్వామి, ఆర్కే రోజా, చెవిరెడ్డి భాస్కరరెడ్డి, ఎమ్మెల్సీ భరత్‌తో పాటు 2024 ఎన్నికల్లో వైసీపీ తరఫున పోటీ చేసిన పలువురు అభ్యర్థులు హాజరయ్యారు. సార్వత్రిక ఎన్నికల ఫలితాల తర్వాత అంటీముట్టనట్లుగా వ్యవహరిస్తున్న మాజీ సలహాదారు, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి కూడా ఈ భేటీకి రావడం గమనార్హం. ఈ సందర్భంగా.. వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమాలు, దాడులకు సంబంధించి పార్టీ నేతలపై వరుసగా కేసులు నమోదవుతుండడంపైనే ఎక్కువ చర్చ జరిగినట్లు సమాచారం.

జైళ్లు, శవాలపైనే జగన్‌కు ఆసక్తి: పంచుమర్తి


అమరావతి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): 'జైళ్లు, శవాలపైనే వైసీపీ నేత జగన్‌కు ఆసక్తి. అవి ఉన్నాయంటేనే ఆయన బెంగుళూరు నుంచి రాష్ట్రానికి వస్తారు. బాధల్లో ఉన్న ప్రజలను పలకరించడం, పరామర్శించడం, పంచుకోవడం ఆయనకు నచ్చని పని' అని టీడీపీ ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ ఎద్దేవా చేశారు. గురువారం తమ పార్టీ కేంద్ర కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 'జైల్లో తమ పార్టీ వారు ఉన్నారంటే ఆయన వారిని పలకరించడానికి వచ్చేస్తారు. వరదల్లో మునిగిన బాధితుల పరామర్శ మాత్రం పట్టదు. జైళ్లలో ఆయన స్వాతంత్ర్య సమర యోధులను, రాష్ట్రం కోసం పోరాడిన వారిని పరామర్శించడం లేదు. అందరూ చూస్తుండగా ఈవీఎం పగలగొట్టిన మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని, టీడీపీ కార్యాలయంపై దాడికి తన అనుచర బృందాన్ని పంపి బీభత్సం సృష్టించిన నందిగం సురేశ్‌ను పరామర్శించారు. చిన్న పిల్లపై అత్యాచారం చేసి పోక్సో కేసులో అరెస్టు అయిన కోడుమూరు మాజీ ఎమ్మెల్యే సుధాకర్‌ను చూడటానికి ఈసారి వెళ్తారట. ఈవీఎం పగలగొడితే తప్పేమిటని నెల్లూరు జైలు ముందు జగన్ మాట్లాడారు. టీడీపీ ఆఫీసు మీద దాడి చేస్తే తప్పేమిటని గుంటూరు జైలు ముందు మాట్లాడారు. తన పార్టీ వాళ్లు ఆ నేరాలు చేశారని ఆయనే స్వయంగా ధ్రువీకరించారు. రాష్ట్రంలో వైసీపీ చేసే ప్రతి నేరపూరిత చర్య వెనక జగన్ ఉంటున్నారని ధ్రువపడింది. దీనిపై విచారణ చేయాలి' అని ఆమె విజ్ఞప్తి చేశారు.

జగన్‌ని సంఘ బహిష్కరణ చేయాలి: జీవీ


'మాజీ సీఎం జగన్ నేరాలను ప్రోత్సహిస్తున్నాడు. నందిగం సురేష్ లాంటి వారితో దాడులను ప్రేరేపిస్తూ, సంఘ విద్రోహ శక్తిగా మారిన జగన్మోహన్‌రెడ్డిని సంఘ బహిష్కరణ చేయాలి' అని వినుకొండ టీడీపీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు డిమాండ్ చేశారు. గురువారం అమరావతి సచివాలయ ప్రాంగణంలో ఆయన మీడియాతో మాట్లాడారు.

యరపతినేనికి రైల్వే శాఖ ప్రశంసలు

అమరావతి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గురజాల టీడీపీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావును దక్షిణ మధ్య రైల్వే తన అధికారిక ఫేస్‌బుక్ పేజీలో ప్రశంసించింది. ఇటీవల వరదలకు పట్టాలు దెబ్బ తిన్నప్పుడు ఉత్తర భారత దేశానికి వెళ్లాల్సిన కొన్ని రైళ్లను నడికుడి రైల్వే స్టేషన్‌కు మళ్లించారు. ప్రయాణికులకు అక్కడ భోజన వసతులు లేకపోవడంతో రైల్వే అధికారులు యరపతినేనిని సంప్రదించారు. ఆయన అప్పటికప్పుడు టీడీపీ కార్యకర్తలను.. తన సొంత యంత్రాంగాన్ని రంగంలోకి దింపి భోజనాలతోపాటు పండ్లు, ఇతర ఆహార పదార్థాలు పంపిణీ చేయించారు. సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి పది వరకూ వస్తున్న ప్రతి రైలు ప్రయాణికులకూ సమకూర్చారు. 'మళ్లించిన రైళ్లు, బాగా ఆలస్యంగా నడుస్తున్న రైళ్లలో వచ్చి నడికుడి స్టేషన్లో చిక్కుకుపోయిన ప్రయాణికులకు ఎమ్మెల్యే యరపతినేని వెజిటబుల్ బిర్యానీ, పండ్లు, బిస్కట్లు, మంచినీటి బాటిళ్లు అందచేశారు' అని రైల్వే శాఖ తన ఫేస్‌బుక్ పేజ్‌లో పేర్కొంది. ఈ పంపిణీకి సంబంధించిన ఫొటోలను కూడా పోస్టు చేసింది. మొత్తం 17 వేల మంది ప్రయాణికులకు ఆ రోజు ఈ సదుపాయం కల్పించినట్లు యరపతినేని తెలిపారు.



సీఎం చంద్రబాబుకు రూ.10 లక్షల చెక్కును అందజేస్తున్న హైదరాబాద్‌కు చెందిన సిటిజన్ కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్ పీఆర్‌వీపీఎస్ రాజు, ఎండీ కేవీ సుబ్బయ్య



సీఎం చంద్రబాబుకు 5 కోట్ల చెక్కును అందజేస్తున్న రెడ్డి ల్యాబ్స్ నారాయణ రెడ్డి

పరిమళిస్తున్న దాతృత్వం

- రెడ్డి ల్యాబ్స్ 5 కోట్లు, ఆంధ్ర షుగర్స్ 2 కోట్లు
- సీఎం చంద్రబాబుకు చెక్కుల అందజేత

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)




తణుకు, సెప్టెంబరు 12: వరద బాధితుల సహాయార్థం ఆంధ్రా షుగర్స్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ పెండ్యాల అచ్యుత రామయ్య సీఎం సహాయ నిధికి రూ.2కోట్ల విరాళాన్ని అందజేశారు.

వరద బాధితుల కోసం ముఖ్యమంత్రి సహాయ నిధికి దాతలు భారీగా విరాళాలు అందిస్తున్నారు. పలువురు పారిశ్రామికవేత్తలు, సినీనటులు, రాజకీయ నాయకులు గురువారం అమరావతి సచివాలయంలో సీఎం చంద్రబాబును కలసి విరాళాల చెక్కులు అందజేశారు. విరాళాలిచ్చిన దాతలకు సీఎం ధన్యవాదాలు తెలిపారు. రెడ్డి ల్యాబ్స్ ప్రతినిధి నారాయణరెడ్డి రూ.5 కోట్లు, ఆంధ్ర షుగర్స్ లిమిటెడ్ తరఫున పెండ్యాల అచ్యుత రామయ్య రూ.2 కోట్లు, పర్చూరు నియోజకవర్గానికి చెందిన విక్రం నారాయణరావు కుటుంబం రూ.1,55,55,555, వసుధా ఫార్మా వెంకటరాజు రూ.కోటి, ఏపీ క్రెడాయ్ తరఫున వైవీ రామారావు రూ.50 లక్షలు, వెంకట్ అక్కినేని రూ.50 లక్షలు, శివశక్తి బయోటెక్ చైర్మన్ నందిగామ శ్రీనివాసరావు, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు రూ.50 లక్షలు, మైసూరు గణపతి సచ్చిదానంద ఆశ్రమం రూ.25 లక్షలు, కోనేరు విమలాదేవి రూ.25 లక్షలు, కోనేరు ప్రదీప్ రూ.25 లక్షలు, ఆర్కే ఇన్‌ఫ్రా కార్పొరేషన్ రెడ్డప్పగారి శ్రీనివాసరెడ్డి రూ.20 లక్షలు, ఫ్రాంక్విన్ ఫార్ములేషన్స్ సాగి కృష్ణంరాజు రూ.15 లక్షలు, మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి ద్వారా ది కాంట్రాక్ట్ క్యారేజీ బస్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రూ.15 లక్షలు, అన్నమయ్య జిల్లా టీడీపీ శ్రేణుల నుంచి తంబళ్లపల్లి ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి రూ.15 లక్షలు, సింహా మోటార్స్ రావెళ్ల సతీష్ రూ.10,00,116, బొబ్బా గోపాలకృష్ణ, పువ్వాడ సుధాకర్ రావు, వాస్తవ్య ప్రమోటర్స్ అండ్ డెవలపర్స్ రూ.10 లక్షలు, వికాస్ పబ్లిక్ స్కూల్ రూ.5 లక్షలు, విశ్వం ప్రభాకర్‌రెడ్డి, లక్ష్మీ రష్ హెల్త్‌కేర్, కోగంటి వెంకటరామయ్య, డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి ఐదేసి లక్షలు, వాసిరెడ్డి సుగుణకుమారి రూ.3 లక్షలు, దళవాయి వడ్డే సిమెంట్ పుల్లన్న రూ.2 లక్షలు, ఎన్టీఆర్ కుటీరం తరఫున ఆర్ శివాజీ రూ.లక్ష చెక్కులు అందజేశారు.

లోకేశ్‌కు అందిన విరాళాలు

మంత్రి లోకేశ్‌ను కలసి పలువురు దాతలు విరాళాల చెక్కులు అందజేశారు. విజయవాడకు చెందిన ప్రియ ఇంజనీరింగ్ ప్రాజెక్ట్స్ సంస్థ అధినేత పీ శివకుమార్ రూ.10 లక్షలు, పలమనేరుకు చెందిన బీ సునీల్ రూ.10 లక్షలు, కాకినాడ సత్య స్కాన్స్ అండ్ డయాగ్నస్టిక్స్ అధినేత డాక్టర్ కాద వెంకట రమణ రూ.5 లక్షలు, మంగళగిరి వైసీపీ నేత, ఆప్కో మాజీ చైర్మన్ చిల్లపల్లి మోహన్‌రావు, బద్వేలుకు చెందిన చెరుకూరి రవికుమార్, కడపకు చెందిన తేరకండ్ల కృష్ణారెడ్డి, కురుపాంకు చెందిన వైరిచర్ల విరేష్ చంద్ర దేవ్, విశాఖ ఐవీవై ఓవర్‌సీస్ కన్సల్టెన్సీ అధినేత బీ రామ్‌కుమార్ రూ. ఐదేసి లక్షలు, తిరుపతికి చెందిన శ్రీగీతాంజలి ఇంగ్లీష్ మీడియా స్కూల్ యజమాని ఎన్ మాధవి రూ.2 లక్షలు, కందుకూరు ఫర్టిలైజర్స్ అసోసియేషన్ ప్రతినిధులు రూ.లక్షన్నర, చింతలపూడికి చెందిన మద్దిపూడి శ్రీనివాసరావు చౌదరి రూ.1,35,136, తిరుపతి సప్తగిరి బ్యాంక్ రిటైర్డ్ స్టాఫ్ రూ.1,16,700 విజయవాడకు చెందిన బొర్రా రాధాకృష్ణ రూ.లక్ష, అమలాపురానికి చెందిన మెట్ల రమణబాబు రూ.లక్ష అందజేశారు. విజయవాడ, గుంటూరు ప్రాంతాల్లో వరద బాధితులను ఆదుకునేందుకు రూ.1.5 కోట్ల విలువ చేసే 10,000 నిత్యావసర సరుకులతో కూడిన కిట్లను పంపించినట్టు అక్షయపాత్ర ఫౌండేషన్ ఏపీ సెంట్రల్ రీజియన్ అధ్యక్షుడు వంశీధర దాస తెలిపారు.



ఏఎంఆర్ కోటి విరాళం

అమరావతి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వరద బాధితుల సహాయార్థం ఏఎంఆర్ గ్రూప్ చైర్మన్ ఎ.మహేశ్‌రెడ్డి ముఖ్యమంత్రి సహాయనిధికి కోటి రూపాయల విరాళం ఇచ్చారు. గురువారం అమరావతి సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసిన మహేశ్వరరెడ్డి, రూ.కోటి చెక్కును అందజేశారు.

సీఎం రిలీఫ్ ఫండ్‌కు 22 లక్షలు

విజయవాడ వరద బాధితుల సహాయార్థం కర్నూలు జిల్లా పత్తికొండ నియోజకవర్గం నుంచి సేకరించిన రూ.22 లక్షల చెక్కును ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు బుధవారం సీఎంకు అందించారు. మంత్రి టీజీ భరత్, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరితో కలసి సీఎంకు చెక్కును అందించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
విజయవాడ ● శుక్రవారం 13 సెప్టెంబరు 2024
diksuchi@andhrajyothy.com

మద్రాస్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీఎం)- డిప్లొమా ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. వీటిని ఆన్‌లైన్ ద్వారా నిర్వహిస్తారు. ప్రోగ్రామింగ్, డేటా సైన్స్ విభాగాలు అందుబాటులో ఉన్నాయి. క్వాలిఫయర్ ఎగ్జామ్ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. ప్రోగ్రామ్ వ్యవధి 8 నెలలు. ఒక్కో ప్రోగ్రామ్‌లో రెండు ఫౌండేషనల్ కోర్సులు, అయిదు ప్రోగ్రామ్ సంబంధిత కోర్సులు, ఒక స్కిల్ ఎన్‌హాన్స్‌మెంట్ కోర్సు, రెండు ప్రాజెక్ట్ వర్క్‌లు ఉంటాయి. ప్రోగ్రామ్‌నకు 35 క్రెడిట్స్ నిర్దేశించారు. ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు, ప్రస్తుతం చివరి సంవత్సరం చదువుతున్నవారు, డిగ్రీ ప్రోగ్రామ్‌లో కనీసం రెండేళ్లు పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు.

ఐఐటీ మద్రాస్‌లో డిప్లొమా

డిప్లొమా ఇన్ ప్రోగ్రామింగ్: ఇందులో కంప్యూటేషనల్ థింకింగ్, ప్రోగ్రామింగ్ ఇన్ పైథాన్ అనే ఫౌండేషనల్ కోర్సులు; డేటాబేస్ మేనేజ్‌మెంట్ సిస్టమ్స్, ప్రోగ్రామింగ్-డేటా స్ట్రక్చర్స్-అల్గారిథమ్స్ విత్ పైథాన్, మోడరన్ అప్లికేషన్ డెవలప్‌మెంట్-1&2 అనే ప్రోగ్రామింగ్ కోర్సులు; సిస్టం కమాండ్స్ అనే స్కిల్ ఎన్‌హాన్స్‌మెంట్ కోర్సు ఉంటాయి. మోడరన్ అప్లికేషన్ డెవలప్‌మెంట్ 1&2లకు సంబంధించి రెండు ప్రాజెక్ట్ వర్క్‌లు పూర్తిచేయాల్సి ఉంటుంది.

డిప్లొమా ఇన్ డేటా సైన్స్: ఇందులో మేథమెటిక్స్ ఫర్ డేటా సైన్స్, స్టాటిస్టిక్స్ ఫర్ డేటా సైన్స్ అనే ఫౌండేషనల్ కోర్సులు; మెషిన్ లెర్నింగ్ ఫౌండేషన్స్, బిజినెస్ డేటా మేనేజ్‌మెంట్, మెషిన్ లెర్నింగ్ టెక్నిక్స్, మెషిన్ లెర్నింగ్ ప్రాక్టీస్, బిజినెస్ అనలిటిక్స్ అనే డేటా సైన్స్ కోర్సులు; టూల్స్ ఇన్ డేటా సైన్స్ అనే స్కిల్ ఎన్‌హాన్స్‌మెంట్ కోర్సు ఉంటాయి. బిజినెస్ డేటా మేనేజ్‌మెంట్, మెషిన్ లెర్నింగ్ ప్రాక్టీస్‌లకు సంబంధించి రెండు ప్రాజెక్ట్ వర్క్‌లు పూర్తిచేయాల్సి ఉంటుంది.

క్వాలిఫయర్ ఎగ్జామ్: డిప్లొమా ఇన్ ప్రోగ్రామింగ్‌లో ప్రవేశానికి నిర్వహించే పరీక్షలో ఇంగ్లీష్, ఆప్టిట్యూడ్, బేసిక్ మేథమెటిక్స్ పేపర్‌లు ఉంటాయి. ఇంగ్లీష్ పేపర్ 25 మార్కులకు ఉంటుంది. ఇందులో రీడింగ్ కాంప్రహెన్షన్, లిజెనింగ్ ఎబిలిటీ, గ్రామర్, రైటింగ్ అంశాలనుంచి ప్రశ్నలు ఇస్తారు. ఆప్టిట్యూడ్ పేపర్‌లో రీజనింగ్‌కు సంబంధించిన ప్రశ్నలు ఇస్తారు. మేథమెటిక్స్ పేపర్‌లో సెట్ థియరీ, నెంబర్ సిస్టమ్, కో-ఆర్డినేట్ జామెట్రీ, క్వాడ్రాటిక్ ఫంక్షన్స్, పాలినామియల్స్, ఫంక్షన్స్, లాగరిథమ్స్, గ్రాఫ్ థియరీ అంశాలనుంచి ప్రశ్నలు అడుగుతారు. పరీక్ష సమయం 3 గంటలు.

- డిప్లొమా ఇన్ డేటా సైన్స్‌లో ప్రవేశానికి నిర్వహించే ఎగ్జామ్‌లో ఇంగ్లీష్, ప్రోగ్రామింగ్ ఇన్ పైథాన్, మేథమెటిక్స్, స్టాటిస్టిక్స్, కంప్యూటేషనల్ థింకింగ్ పేపర్‌లు ఉంటాయి. ఇంగ్లీష్, మేథమెటిక్స్ పేపర్‌లు పై ప్రోగ్రామ్‌కు నిర్వహించేవాటి మాదిరిగానే ఉంటాయి. పైథాన్ పేపర్‌లో ఇంట్రడక్షన్ టు పైథాన్, కండిషనల్ స్టేట్‌మెంట్స్, లూప్స్, లిస్ట్స్, ఫంక్షన్స్, కలెక్షన్స్, రికర్షన్, ఫైల్ హ్యాండిలింగ్ అంశాలనుంచి ప్రశ్నలు ఇస్తారు. స్టాటిస్టిక్స్ పేపర్‌లో డేటా, స్కేల్స్ ఆఫ్ మెజర్‌మెంట్, డేటా ఫ్రీక్వెన్సీ, వేరియబుల్స్, పర్ముటేషన్స్ అండ్ కాంబినేషన్స్, ప్రాబబిలిటీ, రాండం వేరియబుల్స్, వేరియన్స్ తదితర అంశాలనుంచి ప్రశ్నలు ఇస్తారు. కంప్యూటేషనల్ థింకింగ్ పేపర్‌లో మల్టిపుల్ ఇటరేషన్స్, ఫిల్టరింగ్, ఫ్లో చార్ట్, సైడ్ ఎఫెక్ట్‌లు, గ్రాఫ్, మాట్రిక్స్, ట్రీ, బ్యాక్ ట్రాకింగ్, క్లాసిఫికేషన్, ఆబ్జెక్ట్ ఓరియంటేషన్ ప్రోగ్రామింగ్, రిమోట్ ప్రొసీజర్ కాల్, పోలింగ్ తదితర సాంకేతిక అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. పరీక్ష సమయం 4 గంటలు.
- క్వాలిఫయర్ ఎగ్జామ్‌లో అర్హత సాధించాలంటే జనరల్ అభ్యర్థులకు ఒక్కో పేపర్లో 40 శాతానికి తగ్గకుండా మొత్తమ్మీద 50 శాతం మార్కులు రావాలి. ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు ఒక్కో పేపర్లో 35 శాతానికి తగ్గకుండా మొత్తమ్మీద 45 శాతం మార్కులు; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఒక్కో పేపర్లో 30 శాతానికి తగ్గకుండా మొత్తమ్మీద 40 శాతం మార్కులు రావాలి.



- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.6,000; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.3,000; ఎస్సీ, ఎస్టీ కేటగిరీలకు చెందిన దివ్యాంగులకు రూ.1500
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** నవంబరు 22
- **పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, వరంగల్, అనంతపురం, భీమవరం, గుంటూరు, కడప, కర్నూలు, రాజమండ్రి, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం
- **డిప్లొమా క్వాలిఫయర్ ఎగ్జామ్ తేదీ:** డిసెంబరు 22
- **ప్రోగ్రామ్ రిజిస్ట్రేషన్:** 2025 జనవరి 8 నుంచి 9 వరకు
- **ప్రోగ్రామ్‌లు ప్రారంభం:** 2025 జనవరి 10 నుంచి
- **వెబ్‌సైట్:** diploma.iitm.ac.in

ఎన్ఐటీసీలో ట్రేడ్ కోర్సులు

న్యూఢిల్లీలోని నేషనల్ ఇండస్ట్రియల్ ట్రెయినింగ్ సెంటర్(ఎన్ఐటీసీ)- క్రాఫ్ట్‌మెన్ ట్రెయినింగ్ స్కీమ్(సీటీఎస్) కింద నిర్వహిస్తున్న ట్రేడ్ కోర్సుల్లో మిగిలిన సీట్ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. పదోతరగతి ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. వీరి వయసు 2024 ఆగస్టు 1 నాటికి పధ్నాలుగేళ్లు నిండి ఉండాలి. ఫస్ట్ కమ్ ఫస్ట్ సర్వ్‌డ్ పద్ధతిలో అడ్మిషన్స్ ఇస్తారు. అడ్మిషన్ పొందినవారికి బస్‌పాస్ సౌకర్యంతోపాటు స్కాలర్‌షిప్ అందిస్తారు. ఈ కోర్సులు పూర్తిచేసినవారికి నేషనల్ కౌన్సిల్ ఫర్ ఒకేషనల్ ట్రెయినింగ్(ఎన్‌సీవీటీ) నుంచి నేషనల్ ట్రేడ్ సర్టిఫికెట్ లభిస్తుంది. పీఎస్‌యూలు సహా కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వ సంస్థల్లో సబార్డినేట్ల నియామకానికి ఈ సర్టిఫికెట్ తప్పనిసరి.

కోర్సులు-సీట్లు
- హెల్త్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ కోర్సులో 26 సీట్లు ఉన్నాయి. కోర్సు వ్యవధి ఏడాది.
- ఫిజియోథెరపి టెక్నీషియన్ కోర్సులో 11 సీట్లు ఉన్నాయి. కోర్సు వ్యవధి ఏడాది.
- డెంటల్ ల్యాబ్ టెక్నీషియన్ కోర్సులో 11 సీట్లు ఉన్నాయి. కోర్సు వ్యవధి రెండేళ్లు.

ముఖ్య సమాచారం
- **దరఖాస్తు ఫీజు:** రూ.500
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 17
- **వెబ్‌సైట్:** www.nitcindia.com



అహ్మదాబాద్ ఐఐఎంలో పీహెచ్‌డీ



అహ్మదాబాద్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎంఏ) - పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి నాలుగు నుంచి అయిదేళ్ల వరకు ఉంటుంది. మొదటి రెండేళ్లు ఇంటెన్సివ్ కోర్సు వర్క్, కాంప్రహెన్సివ్ ఎగ్జామినేషన్ ఉంటాయి. తరవాత డాక్టోరల్ డిజర్టేషన్ ఉంటుంది.

స్పెషలైజేషన్‌లు: ఎకనామిక్స్, ఫైనాన్స్ అండ్ అకౌంటింగ్, ఫుడ్ అండ్ అగ్రిబిజినెస్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్, ఇన్నోవేషన్ అండ్ మేనేజ్‌మెంట్ ఇన్ ఎడ్యుకేషన్, మార్కెటింగ్, ఆపరేషన్స్ అండ్ డెసిషన్ సైన్సెస్, ఆర్గనైజేషనల్ బిహేవియర్, పబ్లిక్ సిస్టమ్స్, స్ట్రాటజీ

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు ఏదేని మాస్టర్స్ డిగ్రీ/రెండేళ్ల పీజీ డిప్లొమా పూర్తిచేసినవారు; అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. డిగ్రీ, పీజీ స్థాయుల్లో కనీసం 55 శాతం మార్కులు ఉండాలి. ద్వితీయ శ్రేణి మార్కులతో సీఏ/సీఎస్/సీఎంఏ ఉత్తీర్ణులు; కనీసం 6.5 సీజీపీఏతో నాలుగేళ్ల బ్యాచిలర్స్ డిగ్రీ పూర్తిచేసినవారు కూడా అర్హులే. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారూ అప్లయ్ చేసుకోవచ్చు. వీరు 2025 డిసెంబరు 31 నాటికి సర్టిఫికెట్‌లు సబ్మిట్ చేయాలి. క్యాట్ వ్యాలిడ్ స్కోర్ లేదా స్పెషలైజేషన్‌ను అనుసరించి నిర్దేశిత స్టాండర్డ్ టెస్ట్ స్కోర్ ఉండాలి. విదేశీ విద్యార్థులకు జీఆర్ఈ/జీమ్యాట్ స్కోర్ ఉండాలి.

స్పెషలైజేషన్‌లు-స్టాండర్డ్ టెస్ట్ స్కోర్‌లు

ఫుడ్ అండ్ అగ్రి బిజినెస్: జీఆర్ఈ/జీమ్యాట్/యూజీసీ-జేఆర్ఎఫ్/ఐకార్-ఎస్ఆర్ఎఫ్

ఎకనామిక్స్, ఇన్నోవేషన్ అండ్ మేనేజ్‌మెంట్ ఇన్ ఎడ్యుకేషన్, పబ్లిక్ సిస్టమ్స్, ఆపరేషన్స్ అండ్ డెసిషన్ సైన్సెస్: జీఆర్ఈ/జీమ్యాట్/గేట్ వ్యాలిడ్ స్కోర్/యూజీసీ నెట్ జేఆర్ఎఫ్

ఫైనాన్స్ అండ్ అకౌంటింగ్, మార్కెటింగ్, స్ట్రాటజీ: జీఆర్ఈ/జీమ్యాట్

హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్: జీఆర్ఈ/జీమ్యాట్/గేట్ వ్యాలిడ్ స్కోర్

ఆర్గనైజేషనల్ బిహేవియర్: జీఆర్ఈ/జీమ్యాట్/యూజీసీ జేఆర్ఎఫ్

ఎంపిక: క్యాట్ వ్యాలిడ్ స్కోర్/స్టాండర్డ్ టెస్ట్ స్కోర్ ఆధారంగా అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేస్తారు. వీరికి 2025 మార్చి-ఏప్రిల్‌లో ఇంటర్వ్యూలు నిర్వహించి సీట్లు కేటాయిస్తారు.

ఫెలోషిప్: ఎంపికైన అభ్యర్థులకు మొదటి రెండేళ్లు నెలకు రూ.42,000; కాంప్రెహెన్సివ్ ఎగ్జామ్ పూర్తిచేసిన తరవాత నెలకు రూ.45,000; టీఏసీ ఆమోదించిన థీసిస్ సమర్పించిన తరవాత నెలకు రూ.50,000 చెల్లిస్తారు.

- కంటింజెన్సీ గ్రాంట్ కింద ఏడాదికి రూ.35,000 ఇస్తారు. ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్‌లలో రీసెర్చ్ పేపర్లు సమర్పించినవారికి రూ.4,00,000ల వరకు రీయింబర్స్‌మెంట్ లభిస్తుంది. ఫీల్డ్ వర్క్, డేటా కలెక్షన్ నిమిత్తం రూ.2,00,000; స్టార్టప్ గ్రాంట్ కింద రూ.1,00,000లు ఇస్తారు. హెచ్ఆర్ఏ కింద నెలకు రూ.15,000 చెల్లిస్తారు.

ముఖ్య సమాచారం
- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.500; రిజర్వ్‌డ్ వర్గాల వారికి రూ.250
- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం:** సెప్టెంబరు 19 నుంచి
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 2025 జనవరి 20
- **వెబ్‌సైట్:** www.iima.ac.in

బీఐఎస్‌లో వివిధ ఖాళీలు

ఖాళీలు 345

న్యూఢిల్లీలోని బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్(బీఐఎస్), డైరెక్ట్ ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

గ్రూప్-ఎ పోస్టులు
- అసిస్టెంట్ డైరెక్టర్: **3 పోస్టులు**

గ్రూప్-బి పోస్టులు
- పర్సనల్ అసిస్టెంట్: **27 పోస్టులు**
- అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్: **43పోస్టులు**
- అసిస్టెంట్: **1 పోస్టు**
- టెక్నికల్ అసిస్టెంట్: **27 పోస్టులు**

గ్రూప్-సి పోస్టులు
- స్టెనోగ్రాఫర్: **19 పోస్టులు**
- సీనియర్ సెక్రటేరియల్ అసిస్టెంట్: **128 పోస్టులు**
- జూనియర్ సెక్రటేరియల్ అసిస్టెంట్: **78 పోస్టులు**
- సీనియర్ టెక్నీషియన్: **18 పోస్టులు**
- టెక్నీషియన్: **1 పోస్టు**

విభాగాలు: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా, ఐటీఐ, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
ఎంపిక: ప్రాక్టికల్ అసెస్‌మెంట్, రాత పరీక్ష, టెక్నికల్ నాలెడ్జ్, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 30
వెబ్‌సైట్: https://www.bis.gov.in/



ఎన్‌టీపీసీలో డిప్యూటీ మేనేజర్లు

ఖాళీలు 250

నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ లిమిటెడ్(ఎన్‌టీపీసీ)... కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.
విభాగాలు: ఎలక్ట్రికల్, మెకానికల్, సీ అండ్ ఐ, సివిల్
అర్హత: సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
జీతం: నెలకు రూ.70,000 - రూ.2,00,000
గరిష్ఠ వయోపరిమితి: 40 ఏళ్లు
దరఖాస్తు ప్రారంభం: సెప్టెంబరు 14
చివరి తేదీ: సెప్టెంబరు 28
వెబ్‌సైట్: https://ntpc.co.in/

బీహెచ్‌ఈఎల్‌లో అప్రెంటిస్‌లు

ఖాళీలు 100

హైదరాబాద్ రామచంద్రపురంలోని భారత్ హెవీ ఎలక్ట్రికల్ లిమిటెడ్ (బీహెచ్ఈఎల్)...ట్రేడ్ అప్రెంటిస్ ఖాళీల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.
విభాగాలు: ఫిట్టర్, మెషినిస్ట్, టర్నర్, వెల్డర్
అర్హత: సంబంధిత విభాగంలో మెట్రిక్యులేషన్/ఎస్ఎస్‌సీ, ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి. జనరల్/ఈడబ్ల్యూఎస్/ఓబీసీ అభ్యర్థులు ఐటీఐలో కనీసం 60 శాతం మార్కులు; ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులు 55 శాతం మార్కులు సాధించి ఉండాలి.
వయోపరిమితి: 2024 సెప్టెంబరు 1 నాటికి 18 నుంచి 27 సంవత్సరాల మధ్య ఉండాలి.
ఎంపిక ప్రక్రియ: అసెస్‌మెంట్ టెస్ట్, మెడికల్ టెస్ట్, సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఆధారంగా
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 13
వెబ్‌సైట్: hpep.bhel.com

రైట్స్ లిమిటెడ్‌లో గ్రాడ్యుయేట్ ఇంజనీర్లు

ఖాళీలు 15

గురుగావ్‌లోని రైల్ ఇండియా టెక్నికల్ అండ్ ఎకనామిక్ సర్వీస్ లిమిటెడ్... ఒప్పంద ప్రాతిపదికన పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.
1. గ్రాడ్యుయేట్ ఇంజనీర్ ట్రెయినీ(మెకానికల్ ఇంజనీరింగ్): **10**
2. గ్రాడ్యుయేట్ ఇంజనీర్ ట్రెయినీ(ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ): **5**

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఇంజనీరింగ్ డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు గేట్-2024 స్కోర్ తప్పనిసరి.
వయోపరిమితి: 30 ఏళ్లు మించకూడదు
ఎంపిక విధానం: షార్ట్‌లిస్ట్, ఇంటర్వ్యూ, గేట్-2024 స్కోర్ ఆధారంగా ఎంపిక ప్రక్రియ ఉంటుంది.
దరఖాస్తు ఫీజు: జనరల్/ఓబీసీ అభ్యర్థులకు రూ.600; ఈడబ్ల్యూఎస్/ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగులకు రూ.300.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 24
వెబ్‌సైట్: https://www.rites.com/

ఎస్‌బీఐలో స్పెషలిస్ట్ కేడర్ ఆఫీసర్లు

ఖాళీలు 58

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ)... ఒప్పంద ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టుల వివరాలు
1. డిప్యూటీ వైస్ ప్రెసిడెంట్: **3 పోస్టులు**
2. అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్: **30 పోస్టులు**
3. సీనియర్ స్పెషల్ ఎగ్జిక్యూటివ్: **25 పోస్టులు**

విభాగాలు: ఐటీ-ఆర్కిటెక్ట్, క్లౌడ్ ఆపరేషన్స్, సెక్యూరిటీ అండ్ రిస్క్ మేనేజ్‌మెంట్, డేటా సెంటర్ ఆపరేషన్స్, ప్రొక్యూర్‌మెంట్ అనలిస్ట్, క్లౌడ్ సెక్యూరిటీ తదితరాలు.
అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా, బీఈ/బీటెక్(కంప్యూటర్ సైన్స్/ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్/ఐటీ), ఎంబీఏ/ఎంసీఏ/ఎంటెక్ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
జీతం: ఏడాదికి డిప్యూటీ వైస్ ప్రెసిడెంట్ పోస్టుకు రూ.45 లక్షలు; అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ పోస్టుకు రూ.35 లక్షలు; సీనియర్ స్పెషల్ ఎగ్జిక్యూటివ్ పోస్టుకు రూ.29 లక్షలు.
వయోపరిమితి: డిప్యూటీ వైస్ ప్రెసిడెంట్ పోస్టుకు 31-45 ఏళ్లు; అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ పోస్టుకు 29-42 ఏళ్లు; సీనియర్ స్పెషల్ ఎగ్జిక్యూటివ్ పోస్టుకు 27-40 ఏళ్లు మించకూడదు.
దరఖాస్తు ఫీజు: రూ.750, ఎస్సీ/ఎస్టీ/పీడబ్ల్యూబీడీ అభ్యర్థులకు ఫీజులో మినహాయింపు ఉంటుంది.
ఎంపిక ప్రక్రియ: షార్ట్‌లిస్ట్, ఇంటర్వ్యూ, మెరిట్ లిస్ట్ తదితరాల ఆధారంగా
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివర తేదీ: సెప్టెంబరు 24
వెబ్‌సైట్: sbi.co.in/

లిటిల్స్



తెలివైన నక్క

ఒక అడవిలోని చెరువులో ఉండే మొసలికి చాలా రోజులుగా అదే చెరువులోని చేపలను తినీ తినీ విసుగు పుట్టింది. వేరే ఏదైనా జంతువు ఆహారంగా దొరికితే బాగుండు అనుకున్నది. వెంటనే తన మిత్రుడైన పీతను పిలిచి, 'నువ్వు అడవిలోకి వెళ్లి.. అన్ని జంతువులకు మొసలి చనిపోయింది అని చెప్పు.అపుడు అవి భయం లేకుండా ఇక్కడికి నీళ్లు తాగడానికి వస్తాయి.

సమయం చూసి, నేను ఏదో ఒక జంతువును పట్టుకుని తింటాను' అని చెప్పింది. పీత వెళ్లి మొసలి చెప్పినట్టే అడవిలో చెప్పింది. దాని మాటలు ఒక నక్క తప్ప మిగతా అన్ని జంతువులు నమ్మాయి.

నక్క మాత్రం 'మిత్రులారా..దీని మాటలు నమ్మవద్దు. మనమే స్వయంగా చెరువు దగ్గరికి వెళ్లి చూద్దాం పదండి' అని జంతువులను బయల్దేరదీసింది. చెరువు దగ్గరికి చేరగానే, నక్క మిగతా జంతువులతో ఇలా అన్నది.' మిత్రులారా..నేను విన్న దాని ప్రకారం మొసలి చనిపోయినా దాని తోక మాత్రం కదులుతూనే ఉంటుందట. కాబట్టి ఈ మొసలి తోక కదిలితే మనం నమ్మవచ్చు'అన్నది. ఆ మాటలు విన్న తెలివి తక్కువ మొసలి తాను చనిపోయానని నమ్మించడానికి మెల్లగా తన తోకను కదిలించడం మొదలు పెట్టింది. అదిచూసిన నక్క 'మిత్రులారా.. నేను ఊహించింది నిజమే. ఈ మొసలి చావలేదు నాటకమాడుతుంది. మనం చెరువు దాకా వస్తే మనలో ఎవరినైనా చంపవచ్చని దీని పన్నాగం.అందుకే నా మాట వినగానే తోక కదిలిస్తోంది పదండి ఇక్కడినుండి పోదాం' అంటూ అన్ని జంతువుల ప్రాణాలు ఆ రోజు తన ఉపాయంతో కాపాడింది తెలివైన నక్క. మిగతా జంతువులన్నీ దానికి ఆ రోజు కృతజ్ఞతలు చెప్పాయి.

7 తేడాలను కనిపెట్టండి






సరైన నీడను గుర్తించండి



ఏవి ఎన్ని?



దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 408

			1		4
				9	
3				2	
9	2			4	
8	4				
				6	

సుడోకు - 407 సమాధానం

4	7	2	1	3	6
6	9	8	5	2	4
3	1	5	7	9	8
9	8	3	4	6	5
2	4	1	9	8	7
7	5	6	3	1	2

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.